KR TV

మన క్రాంతి


ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి:1 సంచిక:15 ఆదివారం, డిసెంబర్ 15, 2024 ఎడిటర్ : సందెపల్లి క్రాంతికుమార్ పేజీలు : 8 వెల : 3 రూ/-


## నేటి మాట

నా దృష్టిలో రాజీపడటాన్ని మించిన నేరం లేదు. అది విలువల విషయంలో కావచ్చు, స్వేచ్ఛ విషయంలో కావచ్చు. అన్యాయంతోనో అక్రమంతోనో అయినా కావచ్చు. భవిష్యత్తు పట్ల నమ్మకాన్ని కోల్పోయినప్పుడే రాజీపడాలన్న ఆలోచన వస్తుంది. ఆ పరిస్థితి ఎప్పుడూ తెచ్చుకోకూడదు. జై హింద్ - సుభాష్ చంద్రబోస్



# గప్పాలు కొట్టిన రేవంత్..

## - హరీష్ రావు ఫైర్

**14వ తేదీ వచ్చినా అంగన్వాడీ టీచర్లలు, ఆయాలు జీతాలు రాక ఆవేదన చెందుతున్నారు. హామీలు నెరవేర్చకుండా సీఎం రేవంత్ గప్పాలు కొడుతున్నారని అన్నారు హరీష్ రావు. కాంగ్రెస్ పాలనలో 10 నెలలుగా అంగన్వాడి కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించని దుస్థితి నెలకొందన్నారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చేస్తున్న డబ్బా ప్రచారాన్ని ఆపాలన్నారు.**



**హైదరాబాద్, క్రాంతిన్యూస్:** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు. ఒకటో తేదీనే జీతాలు అంటూ సీఎం చెప్తున్నారని చెప్పారు. 14వ తేదీ వచ్చినా 39,568 మంది అంగన్వాడీలకు జీతాలు రాలేదని గుర్తు చేశారు. 10 నెలలుగా అంగన్వాడీ కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించలేదని చెప్పారు. విశ్రాంత ఉద్యోగులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఉత్తర్వులు ఉంటే తప్ప రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించి మాట నిలబెట్టుకోండి అని సీఎం రేవంత్ కు సూచనలు చేశారు. హరీష్ రావు తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో.. "ఒకటో తేదీ నాడే ఉద్యోగులకు జీతాలు అంటూ గప్పాలు

2లో..

### ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలి రేవంత్ రెడ్డి..?

విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మాటలే తప్ప చేతలు లేని ముఖ్యమంత్రి నిర్లక్ష్య తీరు వల్ల

2లో..

## విద్యార్థుల మీద ప్రభుత్వం పెట్టేది

# ఖర్చు కాదు.. ఓ పెట్టుబడి

### - సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, క్రాంతిన్యూస్:** రంగారెడ్డి జిల్లా చిలుకూరులో స్కూళ్లు, హాస్టల్స్‌లో కామన్ డైట్ ప్రారంభించిన తెలంగాణ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు సరికొత్త డైట్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. ఇప్పటివరకు ప్రైవేట్ స్కూల్స్‌లో చదివితేనే విద్యార్థులు రాణిస్తారనే అపోహ ఉండేదని, సంక్షేమ హాస్టల్స్‌లోని విద్యార్థుల్లో విశ్వాసం పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తొలిసారి సర్వేల్‌లో సంక్షేమ పాఠశాలను ప్రారంభించారని సీఎం గుర్తు చేశారు. సర్వేల్‌లో చదివిన అనేక మంది కీలక పదవులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం 8 ఏళ్లుగా డైట్ ఛార్జీలు పెంచలేదన్న సీఎం రేవంత్, డైట్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామన్నారు. కాస్మోటిక్ ఛార్జీలు కూడా పెంచి విద్యార్థులకు అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఎక్కువ ఫీజులు ఉన్న ప్రైవేట్ స్కూల్స్‌లో ఎక్కువ మంది చదువుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆలోచించాలి. విద్యార్థుల మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. ఓ పెట్టుబడి అని ముఖ్యమంత్రి

2లో..

**తెలంగాణ కులగణన 98 శాతం పూర్తి** 2లో..

తెలంగాణ కులగణన 98 శాతం పూర్తి



అద్వానీకి ఐసీయూలో చికిత్స : అపోలో వైద్యులు

2లో..



నందిని సిధారెడ్డి తెగువ.. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణలో ఓ మైలురాయి : కేటీఆర్

2లో..

## చంచల్‌గూడ జైలు నుంచి అల్లు అర్జున్ విడుదల



పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ ను పోలీసులు నిన్న(శుక్రవారం) ఉదయం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. 'పుష్ప 2 ది రూల్' ప్రీమియర్ షోలో రేవతి అనే మహిళ మరణించిన కేసులో శుక్రవారం హైదరాబాద్ పోలీసులు ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిన్న(శనివారం) ఉదయం 6:45 గంటలకు చంచల్ గూడ జైలు నుంచి ఆయనను విడుదల చేశారు. బెయిల్ ఆర్డర్ కాపీ పరిశీలన అనంతరం జైలు వెనుక గేటు నుంచి అధికారులు పంపించారు.మధ్యంతర బెయిల్‌పై అల్లు అర్జున్ ఈరోజు విడుదలయ్యారు. 4 వారాల మధ్యంతర బెయిల్‌ను తెలంగాణ హైకోర్టు మంజూరు చేసింది. రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో అల్లు అర్జున్‌కు బెయిల్ మంజూరు చేసింది.

2లో..

## రాజ్యాంగానికి తూట్లు పొడిచింది కాంగ్రెస్ - మోడీ

### ఎమర్జెన్సీతో దేశాన్ని జైలుగా మార్చిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ, క్రాంతిన్యూస్:** రాజ్యాంగంపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ప్రధాని మోదీ.. కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. నెహ్రూ హయాంలోనే రాజ్యాంగానికి తూట్లు పొడిచారని .. ఇష్టం వచ్చినట్లుగా ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా సవరణలు చేశారని అన్నారు. ఇందిగాంధీ హయంలో రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ.. ఎమర్జెన్సీ విధించారని గుర్తు చేశారు. నెహ్రూ దొంగ చాటుగా రాజ్యాంగాన్ని సవరించారని.. సొంత రాజ్యాంగాన్ని నడిపారన్నారు. ఎంతో మంది పెద్దలు అలా చేయవద్దని సలహాలు ఇచ్చినా నెహ్రూ వినలేదన్నారు. ఆనాటి కాంగ్రెస్ నేతలు రాజ్యాంగానికి 75 సవరణలు చేశారని గుర్తు చేశారు. 1971లో ఇందిరాగాంధీ.. సుప్రీంకోర్టు అధికారాలను తగ్గించేందుకు ప్రయత్నించారని అన్నారు. ఇందిర ఎన్నికలను రద్దు చేయడంతో ఈ చర్యకు ప్రయత్నించారని.. ప్రజల మద్దతు లేకుండానే గాంధీ కుటుంబం దేశాన్ని పరిపాలించిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యస్ఫూర్తిని కాంగ్రెస్ అర్థం చేసుకోలేదని.. మా పాలన చూసి ప్రజలు మూడు సార్లు అధికారం ఇచ్చారన్నారు. కానీ భారత రాజ్యాంగం.. కాంగ్రెస్ పార్టీ , గాంధీ కుటుంబం చేసిన దాడిని తట్టుకుందన్నారు. 75 ఏళ్ల ప్రజాస్వామ్యాన్ని వేడుకగా చేసుకునే క్షణాలివని ప్రజాస్వామ్య పండుగను ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. మన రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందని.. ఎందరో మహానుభావులు కలిసి రాజ్యాంగాన్ని రచించారని గుర్తు చేసారు. ఇలాంటి కీలక సమయంలో పార్లమెంట్‌లో తాను ఉన్నందుకు

2లో..

## దేశంలో రాజ్యాంగానికి, మనుస్మృతికి మధ్య ఘర్షణ జరుగుతోంది: రాహుల్



**న్యూఢిల్లీ, క్రాంతిన్యూస్:** లోక్‌సభలో రాజ్యాంగంపై శనివారం(డిసెంబర్ 14) రెండో రోజు చర్చ వాడివేడిగా సాగింది. కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాజ్యాంగంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమయంలో, అతను అదానీ, అగ్నివీర్, పార్శ్వ ప్రవేశానికి సంబంధించి మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు. శుక్రవారం రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు. దీనిపై విపక్షాల నుంచి ప్రియాంక గాంధీ స్పందించారు. రెండో రోజు డిసెంబర్ 14న పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు. కాగా, ఇవాళ సాయంత్రం 5.45 గంటలకు

2లో..



## రేవంత్ రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు

2లో..



సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధభూమే

3లో..

## రేవంత్ తీరుతో

# కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇబ్బంది

**అల్లు అర్జున్ అరెస్ట్ పోలీస్ స్టేషన్ కు తీసుకురావడం, ఆ తర్వాత కోర్టుకు బెయిల్ పై రిలీజ్ లాంటి ఘటనలు రేవంత్ ప్రభుత్వాన్ని కార్నర్ చేస్తున్నాయి. ఆయన పార్టీకి చెందిన నాయకులు నర్మగర్భంగా మాట్లాడడం చూస్తుంటే పలు అనుమానాలు కలుగుతున్నాయి.**

2లో..





## అమెరికాకు గులాబీ బాస్

### - లైఫ్‌లో ఫస్ట్ టైం

రాజకీయ నాయకులు తరచూ విదేశాల్లో పర్యటిస్తుంటారు. అందులోనూ అధికారంలో ఉంటే.. ఇక ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ సదస్సు, ఆ సదస్సు అనో.. లేక అక్కడి అభివృద్ధిని అధ్యాయనం చేసేందుకనో ఇలా రకరకాల కార్యక్రమాలు, కారణాలతో విమానాలెక్కి విదేశాల్లో వాలిపోయి విహరిస్తుంటారు. కానీ.. కేసీఆర్ మాత్రం అందుకు పూర్తి భిన్నం. సుదీర్ఘ కాలం ఉద్యమకారుడిగా ఉండటమే కాకుండా.. సుమారు 35 ఏళ్లకుపైగా సుదీర్ఘంగా రాజకీయాల్లో కొనసాగుతున్న కేసీఆర్.. కేవలం రెండే రెండు ఫారిన్ టూర్‌లతో.. దేశంలోనే అత్యంత తక్కువ విదేశీ పర్యటనలు

2లో..

## జానా రెడ్డి, నందమూరి బాలకృష్ణ ఇంటి మీదకు

# బుల్డోజర్..?

**అసలు తెలంగాణలో ఏమి జరుగుతుంది..?, ఎందుకు సీఎం రేవంత్ రెడ్డి సినీ తారలపై ఇంత పగబట్టాడు అంటూ సోషల్ మీడియాలో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రజలు పరిపాలించమని ప్రభుత్వం లో కూర్చోబెడితే, ఇలా విధ్వంసం చేస్తూ వెళ్లడం ఎంతవరకు సబబు అని మండిపడుతున్నారు.**



**హైదరాబాద్, క్రాంతిన్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం హైడ్రా ద్వారా సృష్టించిన బీభత్సం మామూలుది కాదు. చెరువుల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేయడంలో భాగంగా, అక్కినేని నాగార్జున ఎన్ కన్వెన్షన్ హాల్ ని కూల్చేసిన ఘటన పెద్ద సంచలనంగా మారింది. హై కోర్టు స్టే విధించినా

2లో..



## ఢిల్లీ నేరాలకూ రాజధానిగా మారింది

3లో..

# విద్యార్థుల మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. ఓ పెట్టుబడి

రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే సంక్షేమ హాస్టల్స్‌పై ఫోకస్ పెట్టింది తెలంగాణ ప్రభుత్వం. తనిఖీల పేరుతో ఇవాళ హాస్టల్స్ బాటపట్టింది. ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు ప్రభుత్వ యంత్రాంగం అంతా హాస్టల్స్, గురుకులాల్లో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి.. వాళ్లతో కలిసి భోజనాలు చేశారు. రంగారెడ్డి జిల్లా చిల్కూర్‌లో సోషల్? వెల్ఫేర్ ?రెసిడెన్షియల్ ?స్కూల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. అక్కడి నుంచే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళు ,, గురుకులాల్లో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభించారు. అనంతరం, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి ప్రతినెల 10న గురుకులాలు,హాస్టల్స్ బకాయిల చెల్లింపు జరుపుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గ్రీన్‌ఛానల్ ద్వారా నేరుగా అకౌంట్లలో జమ చేస్తామన్నారు. ఇకపై ప్రతినెలా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు గురుకులాలు, హాస్టల్స్‌ను విధిగా పరిశీలిస్తారని సీఎం స్పష్టం చేశారు. గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌కు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే, విద్యార్థుల్లో స్కిల్స్ కోసం టాటాగ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఇందులో భాగంగానే 75 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని సీఎం ప్రకటించారు. ఐటీఐలో చేరితే ఉద్యోగం వస్తుందనే నమ్మకం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అటు ఉమ్మడి ఖమ్మం జిల్లా బోనకల్‌లో బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. విద్యార్థులతో మాట్లాడి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని గిరిజన వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో పిల్లలతో కలిసి భోజనం చేశారు మంత్రి సీతక్క. అనంతరం, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనాల్లో క్వాలిటీ తగ్గితే సహించేది లేదని.. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులను సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

### తెలంగాణ కులగణన 98 శాతం పూర్తి - సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన 98 శాతం పూర్తయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఫలాలు అందాలన్న సంకల్పంతో కులగణన చేపట్టామని సీఎం చెప్పారు. మిగిలిన రెండు శాతం పూర్తయితే దేశానికే ఆదర్శంగా నిలిచే కులగణన తెలంగాణ ప్రజల మెగా హెల్త్ ప్రొఫైల్‌గా మారుతుందని అన్నారు. హైదరాబాద్‌లో నిర్మించిన కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ %-% దొడ్డి కొమురయ్య ఆత్మ గౌరవ కురుమ భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ... దొడ్డి కొమురయ్య గారి పోరాటాలను స్మరించుకున్నారు. రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా, దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దుడ్డుకర్రల సంఘం పెట్టి పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. చాకలి ఐలమ్మ పేరును యూనివర్సిటీకి పెట్టినట్టుగానే, దొడ్డి కొమురయ్య శాశ్వతంగా గుర్తుండిపోయేలా మంత్రివర్గ సహచరులతో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు. దొడ్డి కొమురయ్య భవన ప్రాంగణం ఒక విద్యా వేదిక కావాలన్నారు. కురుమ సోదరులకు విద్య కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రుణమాఫీ, వరికి బోనస్, ఉచిత విద్యుత్, రూ.500 లకే సిలిండర్, పేదలకు వైద్య సౌకర్యాలు అందించడం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎక్కువగా బలహీన వర్గాలకు అందాయని చెప్పారు. “తెలంగాణకు జమిందారుల తల్లి కాదు. బహుజనుల తెలంగాణ తల్లి ఉండాలి. ఏ తల్లి అయితే మన అమ్మ లాగా ఉంటుందో, అడక్కుండానే మన ఆకలిని గుర్తించి బుక్కెడు అన్నం పెడుతుందో అలాంటి తెలంగాణ తల్లిని తెచ్చుకున్నాం. మన అమ్మకు ప్రతిరూపం. మన అక్కకు ప్రతిరూపం. ఒకపక్క వరి, సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న వంటి తెలంగాణలో పండించే పంటతో పాటు నా బిడ్డలు చల్లంగా ఉండాలి. నా బిడ్డలు శాశ్వతంగా అభివృద్ధి పథంవైపు నడవాలని ఆశీర్వదించే తెలంగాణ తల్లిని మనం ప్రతిష్టించుకున్నాం” అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలు చేస్తాం

ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సంక్లిష్టమైన ఈ అంశంలో ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

గ్లోబల్ ఇంటలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిగ, చమర్ ఇతర అనుబంధ కులాల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ మాదిగ డే-2024 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. వర్గీకరణ అంశంలో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అమలు చేయాలన్న ఉద్దేశంతోనే అధ్యయనానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించామని అన్నారు.

అలాగే, వర్గీకరణ అంశంపై 60 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కోరుతూ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శమీమ్ అఖ్తర్ నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్ ను నియమించామని, మరో వారం రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.


విలేకరులు కావలెను..

మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా?

నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?

మన క్రాంతి తెలుగు దిన పత్రికలో

పనిచేయుటకు మండలాల వారీగా విలేఖరులు,

యాడ్ ఎగ్జిక్యూటివ్ లు (పురుషులు మరియు స్త్రీలు) కావలెను.

కాల్ : 9281041008 వెబ్: https://epaper.krtvnews.com

ఈమెయిల్: krtv.md@gmail.com


## రేవంత్ తీరుతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇబ్బంది

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సెలబ్రెటీలు చాలా ఇబ్బంది పడుతున్నారట. ఇటీవల అల్లు అర్జున్ వ్యవహారంతో రాష్ట్రం మొత్తం ఉక్కిరిబిక్కిరి అయ్యింది. అల్లు అర్జున్ తన పుష్ప-2కు సంబంధించి ప్రమోషన్ కోసం సంధ్య థియేటర్ కు వెళ్లాడు. అక్కడ జరిగిన తొక్కిసలాటలో ఒక యువతి మరణించగా.. ఆమె కొడుకు కూడా చావు వరకు వెళ్లాడు. దీంతో కొందరు సదరు థియేటర్ యాజమన్యంపై, సినిమా హీరో అల్లు అర్జున్ పై కేసు పెట్టారు. ఈ కేసుకు సంబంధించి శు క్రవారం (డిసెంబర్ 13) అల్లు అర్జున్ ను అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరు పరిచారు. కోర్టు బెయిల్ ఇవ్వకపోవడంతో ఆయనను జైలు తరలించారు. ఇలా నాటకీయ పరిణామాల మధ్య రాత్రి సమయంలో ఇంటికి చేరుకున్నాడు. దీనిపై ఆయన అభిమానులతో పాటు సినిమా ఇండస్ట్రీ రేవంత్ ప్రభుత్వంపై విరుచుకుపడుతుంది. సెలబ్రెటీలను టార్గెట్ గా రేవంత్ ప్రభుత్వం నడుపుతున్నారని మండిపడుతున్నారు.(హైడ్రా వచ్చీ రావడంతో ఎన్-కన్వెన్షన్ ను కూల్చివేసింది. కనీసం నోటీసులు ఇవ్వకుండా.. ఎలాంటి హెచ్చరిక చేయకుండా నేలమట్టం చేసింది. ఈ విషయంలో నాగార్జున చాలా ఇబ్బంది పడ్డారు. తాను ఎటువంటి ఆక్రమణలను పాల్పడలేదని, కోర్టుకు వెళ్లి స్టే తెచ్చేలోపే నేల మట్టం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేశారు సరే.. తను తప్పు చేసినట్లు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారని ఆయన రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ఇప్పుడు అల్లు అర్జున్ అరెస్ట్ తో మారోసారి ప్రభుత్వ తీరుపై కొంత నిరసన వ్యక్తం అవుతుంది. నిన్న జరిగిన కొన్ని కార్యక్రమాల్లో రేవంత్ స్వయంగా మాట్లాడుతూ ఎవ్వరైనా చట్టానికి సమానమేనని చెప్పడం.. ఆయన స్టాండ్ ఏ మేరకు ఉందో ఇట్టే అర్థం అవుతుంది. ఇక ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కూడా నర్మగర్భంగా మాట్లాడడం చూస్తుంటే కావాలనే ఇది జరిగిందా..? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ కూడా ప్రభుత్వం స్టాండ్ బయటకు చెప్పద్దు అనడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఒక వేళ ఇది నిజంగా ప్రభుత్వం చేసినా తాము మాత్రం ఖండిస్తున్నామని ఆయన అన్నారు. జాతీయ స్థాయి నటుడు కాబట్టి ఆయన విషయంలో కాస్త ఆలోచించాల్సిన అనిచెప్పడం వెనుక ఏ పరమార్థం దాగుందో తెలుస్తుంది. ఏది ఏమైనా అప్పుడు నాగార్జున, ఇప్పుడు అల్లు అర్జున్ విషయంలో ప్రభుత్వంపై ఇండస్ట్రీ ఫైర్ అవుతున్నట్లు తెలుస్తోంది.

# అమెరికాకు గులాబీ బాస్

చేసిన ముఖ్యమంత్రిగా, పొలిటికల్ లీడర్‌గా కేసీఆర్ నిలిచారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. అమెరికాకు వెళ్లనున్నారు. అది కూడా తన జీవితంగా మొట్టమొదటిసారి. అదేంటీ కేసీఆర్.. ఇంతవరకు అమెరికాకు పోలేదా..? అని ఆశ్చర్యపోతున్నారా..? అవును, కేసీఆర్ ఇప్పటివరకు అగ్రరాజ్యమైన అమెరికాకు వెళ్లలేదు. అంతే కాదు.. రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్.. చేపట్టిన విదేశీ పర్యటనలు కేవలం రెండే రెండు కావటం గమనార్హం. అందులో ఒకటి సింగాపూర్, రెండోది చైనా. అంతకు మించి కేసీఆర్.. తన జీవితకాలంలో దేశం దాటలేదు. కాగా.. ఇప్పుడు లైఫ్‌లో ఫస్ట్ టైం.. అమెరికాకు వెళ్లనున్నట్టు సమాచారం అందుతోంది. సాధారణంగా అయితే.. రాజకీయ నాయకులు తరచూ విదేశాల్లో పర్యటిస్తుంటారు. అందులోనూ అధికారంలో ఉంటే.. ఇక ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ సదస్సు, ఆ సదస్సు అనో.. లేక అక్కడి అభివృద్ధిని అధ్యాయనం చేసేందుకనో ఇలా రకరకాల కార్యక్రమాలు, కారణాలతో విమానాలెక్కి విదేశాల్లో వాలిపోయి విహరిస్తుంటారు. కానీ.. కేసీఆర్ మాత్రం అందుకు పూర్తి భిన్నం. సుదీర్ఘ కాలం ఉద్యమకారుడిగా ఉండటమే కాకుండా.. సుమారు 35 ఏళ్లకుపైగా సుదీర్ఘంగా రాజకీయాల్లో కొనసాగుతున్న కేసీఆర్.. కేవలం రెండే రెండు ఫారిన్ టూర్‌లతో.. దేశంలోనే అత్యంత తక్కువ విదేశీ పర్యటనలు చేసిన ముఖ్యమంత్రిగా, పొలిటికల్ లీడర్‌గా కేసీఆర్ నిలిచారు. కేసీఆర్ కుమారుడైన కేటీఆర్, కుమార్తె కవిత.. ఉన్నత విద్యను అమెరికాలోనే అభ్యసించిన విషయం తెలిసిందే. ఉన్నత విద్య తర్వాత కేటీఆర్ అక్కడే కొన్నాళ్లు ఉద్యోగం కూడా చేశారు. అయినా సరే.. కేసీఆర్ మాత్రం ఒక్కసారి కూడా అమెరికాలో అడుగు పెట్టలేదు. అయితే.. ఇప్పుడు అమెరికా వెళ్లేందుకు గులాబీ బాస్ సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఒకటి రెండు నెలల్లో కేసీఆర్ అమెరికా ప్రయాణం ఉంటుందని తెలుస్తోంది. అమెరికా వెళ్లనున్న కేసీఆర్.. సుమారు 2 నెలల పాటు అక్కడే ఉండే అవకాశం ఉందని సమాచారం. అయితే.. కేటీఆర్ కుమారుడు హిమాన్షు అమెరికాలోనే ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విషయం తెలిసిందే. కాగా.. కేసీఆర్‌కు తన మనవడు హిమన్షుకు మధ్య ప్రత్యేక అనుబంధం ఉంటుంది. తన మనవడు అంటే.. కేసీఆర్‌కు చాలా ప్రేమ అన్న విషయాన్ని పలు సందర్భాల్లో తెలియజేశారు కూడా. అంతగా ప్రేమించే తన మనవడు హిమాన్షు కోరిక మేరకే తాత కేసీఆర్ అమెరికా వెళ్తున్నట్లు సమాచారం. కొన్ని రోజులు అమెరికా వచ్చి రెస్ట్ తీసుకోవాలని.. ఇటీవల ఇండియా వచ్చిన హిమాన్షు తాతను కోరినట్లు తెలుస్తోంది. అయితే.. కేసీఆర్ అమెరికా వెళ్తే ఎక్కడ ఉండాలి, ఏ ప్రాంతాలు పర్యటించాలి అన్న విషయాలపై ఇప్పటి నుంచే.. అక్కడున్న ఎన్నారైలతో చర్చిస్తున్నట్టు సమాచారం. అటు తాను మనవడితో కొంత కాలం ఉన్నట్టు ఉండటమే కాకుండా.. అక్కడున్న ఎన్నారైలతో కూడా పార్టీ వ్యవహారాలు, సమావేశాలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. మొత్తానికి గులాబీ బాస్ కేసీఆర్.. త్వరలోనే అగ్రరాజ్యం అమెరికాలో అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నారన్న మాట.ం

## ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలి రేవంత్ రెడ్డి..?

ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కావాలి..? ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలి..? అని హరీశ్‌రావు నిలదీశారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లీలావతిని హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు. సంక్షేమ పాఠశాలలను సంక్షోభ పాఠశాలలుగా మార్చారు. మేము ప్రశ్నిస్తే వార్డెన్లు, ప్రిన్సిపల్స్ మీద చర్యలు తీస్కొని చేతులు దులుపుకుంటున్నారు. నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతున్నరు. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడం లేదు. ఇప్పటికైనా కళ్లు తెరిచారు స్వాగతిస్తున్నాము. గురుకులాల మొక్కుబడి సందర్శన కాదు.. ఆ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి. ఫోటోలకు పోజులు ఇవ్వడం కాదు.. పట్టెడు పనికొచ్చే బువ్వ పెట్టి పొట్టలు నింపండి. ఫుడ్ పాయిజన్ జరిగిన తర్వాత విద్యార్థులకు సకాలంలో చికిత్స అందించకపోవడం వారి ప్రాణాల మీదకు వస్తున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల ప్రాణాలు బలిగొంటున్నాయి అని హరీశ్‌రావు తెలిపారు. ఇప్పటికైనా కళ్లు తెరవండి.. ప్రచారం కోసం కాదు పిల్లల భవిషత్తు కోసం ఆలోచించండి అని హరీశ్‌రావు కోరారు. చలికాలం వణుకుతున్నారు, వేడి నీళ్ళు లేవు. బట్టలు కూడా వారికి ఇవ్వలేదు, ఆ సమస్యలు పరిష్కరించండి. హాస్టళ్లలో పని చేసే సిబ్బంది జీతాలు ఇవ్వడం లేదు. గ్రీన్ ఛానెల్ ఉంటే ఆరు నెలలుగా హాస్టళ్లకు ఎందుకు డబ్బులు ఇవ్వటం లేదు అని హరీశ్‌రావు అడిగారు.

## గప్పాలు కొట్టిన రేవంత్..

కొట్టిన సీఎం రేవంత్.. ఈనెల 14వ తేదీ వచ్చినా 39,568 మంది అంగన్వాడీ టీచర్లలు, ఆయాలు జీతాలు రాక ఆవేదన చెందుతున్న పరిస్థితి. 10 నెలలుగా అంగన్వాడి కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించని దుస్థితి. ఏడాది కాంగ్రెస్ పాలనలో మీరు సాధించిన ఘనత ఇది. విశ్రాంత ఉపాధ్యాయులను, ఉద్యోగులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నావు. హైకోర్టు ఉత్తర్వులు ఉంటే తప్ప హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని, వారి కుటుంబాలను క్షోభకు గురి చేస్తున్నావు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇలా లక్షల మంది సకాలంలో జీతాలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చేస్తున్న డబ్బా ప్రచారాన్ని ఇకనైనా ఆపండి. ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు చెల్లించి మాట నిలుపుకోండి.” అని పోస్ట్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఆలస్యంగా జీతాలు అందించడంపై మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఒకటో తేదీ నాడే ఉద్యోగులకు జీతాలు అంటూ గప్పాలు కొట్టిన రేవంత్ రెడ్డి.. 14వ తేదీ వచ్చినా 39,568 మంది అంగన్వాడీ టీచర్లలు, ఆయాలు జీతాలు రాక ఆవేదన చెందుతున్న పరిస్థితి ఉంది అని అన్నారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చేస్తున్న డబ్బా ప్రచారాన్ని ఇకనైనా ఆపండి. ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు చెల్లించి మాట నిలుపుకోండి అని హరీష్ రావు సూచించారు.

## చంచల్‌గూడ జైలు నుంచి అల్లు అర్జున్ విడుదల

మధ్యంతర బెయిల్ వచ్చినా రాత్రంతా జైలులోనే అల్లు అర్జున్ ఉన్నారు. బెయిల్ ప్రక్రియ ఆలస్యం కావడంతో ఇవాళ విడుదల చేశారు. అల్లు అర్జున్‌తో పాటు సంధ్యాథియేటర్ యాజమాన్యాన్ని కూడా విడుదల చేశారు. చంచల్‌గూడ జైలుకు అల్లు అరవింద్ చేరుకున్నారు. జైలు అధికారులకు బెయిల్ ఆర్డర్ కాపీ అందజేశారు. మంజీరా బ్యారక్ నుంచి అడ్మిషన్ బ్యారక్‌కు అల్లు అర్జున్‌ను తరలించినట్లు సమాచారం. అల్లు అర్జున్ కోసం జైలుకు ఆయన బాడీగార్డ్స్ చేరుకున్నారు. చంచల్‌గూడ జైలు దగ్గర భారీగా పోలీసులు మోహరించారు.

### జైలు అధికారులు ఏమన్నారంటే..

అల్లు అర్జున్‌ను ఉదయం 6.45 గంటలకు విడుదల చేశామని జైలు అధికారులు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా అల్లు అర్జున్‌ను వెనుక గేటు నుంచి పంపించామని చెప్పారు. అల్లు అర్జున్‌తో పాటు మరో ఇద్దరు నిందితులను విడుదల చేశామని అన్నారు. సంధ్యా థియేటర్ యజమానిని విడుదల చేశామని జైలు అధికారులు వెల్లడించారు. అల్లు అర్జున్ బెయిల్ పేపర్లు అందడానికి ఆలస్యమైందని జైలు అధికారులు తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత బెయిల్ పేపర్లు అందాయని జైలు అధికారులు తెలిపారు. చంచల్‌గూడ జైలు నుంచి గీతా ఆర్ట్స్ కార్యాలయానికి అల్లు అర్జున్ చేరుకున్నారు.

### రాత్రంతా జైలులోనే అల్లు అర్జున్

రాత్రంతా చంచల్‌గూడ జైలులోనే అల్లు అర్జున్ ఉన్నారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చినా ఆర్డర్ కాపీ ఆలస్యం కావడంతో అల్లు అర్జున్ విడుదల కాలేదు. సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసులో బన్నీ అరెస్టైన విషయం తెలిసిందే. తొక్కిసలాట కేసులో మొత్తం 18 మంది నిందితులను చేర్చారు. ఈ కేసులో %ూ%11 నిందితుడిగా అల్లు అర్జున్ ఉన్నారు. అల్లు అర్జున్‌కు అండర్ ట్రయల్ ఖైదీ నెంబర్ 7697 కేటాయించారు. అల్లు అర్జున్ కోసం ఇంటి నుంచి బయల్దేరిన ఆయన బాడీగార్డ్స్ నిన్న జైలు నుంచి విడుదల కాకపోవడంతో అల్లు అర్జున్‌కు అండర్ ట్రయల్ ఖైదీ నెంబర్ 7697ను జైలు అధికారులు ఇచ్చారు. చంచల్‌గూడ జైలు మంజీరా బ్యారక్‌లో అల్లు అర్జున్ ఉన్నారు. చంచల్‌గూడ జైలు దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. రాత్రి చంచల్‌గూడ జైలు దగ్గర అభిమాని హంగామా చేశారు. అల్లు అర్జున్‌ను వెంటనే విడుదల చేయాలంటూ పెట్రోల్ పోసుకుని అభిమాని హల్‌చల్ చేశాడు. పోలీసులు అడ్డుకున్నారు.

## రాజ్యాంగానికి తూట్లు పొడిచింది కాంగ్రెస్ - మోడీ

చాలా సంతోషంగా ఉందన్నారు. స్వాతంత్ర్యం సాధించిన సమయంలో భారతదేశ భవిష్యత్‌పై కలిగిన సందేహాలు, సవాళ్లను అధిగమించి.. భారత రాజ్యాంగం మనలను ఇక్కడి వరకు తీసుకువచ్చిందని... ఇది నిజంగా అద్భుత విజయం అని స్పష్టం చేశారు. రాజ్యాంగ నిర్మాతలతో పాటు.. కోట్లాది మంది భారతీయులకు మోదీ గౌరవ వందనం ప్రకటించారు. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమే కాదని.. వేలాది సంవత్సరాల ప్రజాస్వామ్య సంప్రదాయాల కారణంగా ప్రజాస్వామ్యానికి తల్లిగా నిలిచిందని ప్రకటించారు. ప్రజల మధ్య ఐకమత్యం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంని తెలిపారు.

భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్ప విధానం. బానిస మనస్తత్వంతో ఉన్నవాళ్లు దేశాభివృద్ధికి ఆటంకం కలిగించారు. కొందరు స్వార్థపరుల వల్ల అనేక కష్టాలు పడ్డాం. మన ఐక్యత దెబ్బతీసేందుకు కొందరు విషబీజాలు నాటారన్నారు. 1950లోనే భారతదేశం ప్రజాస్వామ్యం దేశం అవుతుందని నమ్మలేదని ప్రధాని వ్యాఖ్యానించారు. భారతదేశ ప్రజాస్వామ్యం, భారతదేశ గణతంత్రం గతం చాలా గొప్పదన్నారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదన్నారు. దేశ అధ్యక్షురాలిగా ఆదివాసీ మహిళ ఎన్నికయ్యారని మోదీ గర్వంగా ప్రకటించారు. భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. 75 ఏళ్ల రాజ్యాంగ యాత్ర ఓ గొప్ప ప్రయాణమని అన్నారు.

## దేశంలో రాజ్యాంగానికి, మనుస్మృతికి మధ్య ఘర్షణ జరుగుతోంది: రాహుల్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తారు. రాజ్యాంగంపై చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇవ్వనున్నారు.రాజ్యాంగంపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ అభయ అంశాన్ని ప్రస్తావించారు. మన రాజ్యాంగం ఆలోచనల సమాహారమని అన్నారు. రాజ్యాంగం జీవిత తత్వశాస్త్రం. మన సంస్కృతికి సంబంధించిన ఆలోచనలు రాజ్యాంగంలో ప్రతిబింబిస్తాయి. రాజ్యాంగంలో ప్రాచీన వారసత్వం ఉంది. మనుస్మృతి రాజ్యాంగం కంటే గొప్పదని ఆరెస్సెస్ అభివర్ణించిందని రాహుల్ గాంధీ అన్నారు. మనుస్మృతి రాజ్యాంగానికి అతీతమైనదని సావర్కర్ అన్నారు. మీరు ఎవరిని ఆరాధిస్తారో ఆయనే రాజ్యాంగంలో భారతీయత అని చెప్పారని రాహుల్ అన్నారు. బాబాసాహెబ్ ఆశయాలను రాజ్యాంగంలో చూస్తున్నామని రాహుల్ అన్నారు.రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ద్రోణాచార్య, ఏకలవ్యలను ప్రస్తావించారు. ద్రోణాచార్యుడు ఏకలవ్యుని బొటనవేలును కత్తిరించినట్లే, మీరు భారత యువకుల బొటనవేలును కత్తిరించారని ఆయన మండిపడ్డారు. దేశంలోని వ్యాపారవేత్తలను తిడుతున్నారు. ప్రతిభను, బలాన్ని బీజేపీ కొల్లగొట్టాలన్నారు. పేపర్ లీక్ ద్వారా యువత ఆశలపై నీళ్లు చల్లారన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ హత్రాస్ అంశాన్ని లేవనెత్తారు. నిందితులు బయట తిరుగుతున్నారని, బాధితురాలి కుటుంబాన్ని ఇంట్లో బంధించారని తెలిపారు. తమ కుమార్తె అంత్యక్రియలు చేసేందుకు బాధిత కుటుంబాన్ని అనుమతించలేదన్నారు.ఇక యూపీలో మనుస్మృతి వర్తిస్తుందా, రాజ్యాంగం కాదా? బీజేపీ వాళ్లు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. సంభాల్ అంశాన్ని కూడా ప్రస్తావించారు. సంభాల్‌లో ఐదుగురిని హత్య చేశారని రాహుల్ అన్నారు. ఇది రాజ్యాంగంలో ఎక్కడ వ్రాయబడింది? బీజేపీ ప్రజలు ఒక మతంతో మరో మతంతో గొడవ పడుతున్నారు. మన భావజాలం, భారత కూటమి దేశంలో రాజ్యాంగాన్ని స్థాపించడమే అని రాహుల్ స్పష్టం చేశారు.రాజ్యాంగంపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. దేశంలోని సంస్థలను కబ్జా చేశారని అన్నారు. దేశంలో రాజకీయ సమానత్వం అంతమైందని మండిపడ్డారు. తమ మొదటి అడుగు కుల గణన అని, దీని తర్వాత కొత్త తరహాలో రాజకీయాలు జరగనున్నాయన్నారు. 50 శాతం రిజర్వేషన్ల గోడను బద్దలు కొడతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.రాజ్యాంగంపై చర్చ సందర్భంగా రాహుల్ ప్రసంగంపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ స్పందిస్తూ.. రాహుల్ కు రాజ్యాంగం గురించి తెలియదన్నారు. రాజ్యాంగ బలంతో ఎమర్జెన్సీ ముగిసింది. రాజ్యాంగాన్ని మోస్తూ తిరిగేవాళ్లు కూడా చదవాల్సిందే. వారు రాజ్యాంగంలోని పేజీలను కూడా తెరవలేదు. రాజ్యాంగం అధికారం ద్వారా ఇందిరకు చిత్రహింసల నుండి విముక్తి లభించింది. కాంగ్రెస్ హయాంలో సిక్కుల గొంతు కోశారని వఅనురాగ్ ఠాకూర్ విరుచుకుపడ్డారు.

## జానా రెడ్డి, నందమూరి బాలకృష్ణ ఇంటి మీదకు బుల్డోజర్..?

ఎలా కూల్చేస్తారు, దీనిపై న్యాయ పోరాటం చేస్తాను అంటూ నాగార్జున రెస్పాన్స్ ఇచ్చిన సంగతి తెలిసిందే. కేవలం నాగార్జున కి సంబంధించిన ఆస్తులే కాదు, చెరువుల్లో అక్రమకట్టడాలు ఉన్న సామాన్యుల ఇళ్లను కూడా కూల్చేసిన ఘటనలు ఈమధ్య కాలంలో చాలా చూసాము. ఇది ప్రభుత్వానికి తీవ్రమైన వ్యతిరేక గాలి వీచేలా చేసింది. అయినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి తన పని తాను చేసుకుంటూ ముందుకు పోతున్నాడు. ఇది ఇలా ఉండగా ఇప్పుడు సినీ హీరో బాలకృష్ణ, జానా రెడ్డి ఇళ్లపై తెలంగాణ ప్రభుత్వ కన్ను పడినట్టు తెలుస్తుంది. ఫిల్మ్ నగర్ లో ఉన్నటువంటి నందమూరి బాలకృష్ణ ఇంటికి సుమారు 6 ఫీట్ల వరకు మార్కింగ్స్ చేసారని, ఆయన ఇంటి వద్దకు బుల్డోజర్లు కూడా వచ్చాయని మీడియా లో ఒక వార్త సంచలనం రేపింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ బ్రిడ్జీలు, అండర్ పాస్ నిర్మాణాలకు ప్రభుత్వం గత కొద్దిరోజుల క్రితమే ప్లాన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఆ ప్లాన్స్ ని అమలు చేసే విషయం లో భాగంగా జానా రెడ్డి, బాలకృష్ణ ఇంటిలోని కొంత భాగం భూసేకరణ చేయాలనీ నిర్ణయించుకొని, వాళ్ళిద్దరినీ ఏమాత్రం సంప్రదించకుండా వాళ్ళ ఇళ్ల గోడలపై మార్కింగ్స్ చేసింది. దీనిపై అటు బాలకృష్ణ, ఇటు జానారెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇదంతా చూసిన అభిమానులు అసలు తెలంగాణలో ఏమి జరుగుతుంది..?, ఎందుకు సీఎం రేవంత్ రెడ్డి సినీ తారలపై ఇంత పగబట్టాడు అంటూ సోషల్ మీడియాలో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రజలు పరిపాలించమని ప్రభుత్వం లో కూర్చోబెడితే, ఇలా విధ్వంసం చేస్తూ వెళ్లడం ఎంతవరకు సబబు అని మండిపడుతున్నారు. నిన్ననే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ని అరెస్ట్ చేసిన ఘటన ఇండస్ట్రీ లో పెను దుమారం రేపింది. ఇద్దరి వైపు తప్పులు ఉన్నప్పుడు, కేవలం అల్లు అర్జున్ ని మాత్రమే దోషిగా చూపించడం అన్యాయం అంటూ సినీ సెలెబ్రిటీలు కూడా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. అంతకు ముందు మంత్రి కొండా సురేఖ అక్కినేని కుటుంబం పై చాలా నీచమైన వ్యాఖ్యలు చేసిందని, దానికి సినీ ఇండస్ట్రీ మొత్తం తీవ్రస్థాయిలో విరుచుకుపడి, కొండా సురేఖని తప్పుబట్టిన విషయాన్ని మనసులో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి ఇలా ప్రవర్తిస్తున్నాడంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ ఆరోపిస్తున్నారు. రేవంత్ రెడ్డి తెలుగు దేశం పార్టీ లో ఎన్నో ఏళ్ళు నమ్మకమైన నాయకుడిగా కొనసాగి మంచి పేరుని దక్కించుకున్న సంగతి తెలిసిందే. బాలకృష్ణ తో ఆయనకి ఎంతోమంచి సాన్నిహిత్యం ఉంది, అయినప్పటికీ కూడా ఆయన ఇంటిపై టార్గెట్ చేయడం ఏమిటో విశ్లేషకులకు సైతం అంతు చిక్కడంలేదు.

## అద్వానీకి ఐసీయూలో చికిత్స : అపోలో వైద్యులు

బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రి లో చేర్పించారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు అపోలో ఆసుపత్రి వైద్యులు తెలిపారు. డాక్టర్ వినిత్ సూరి సంరక్షణలో ఆయనకు చికిత్స చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అద్వానీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం అద్వానీ వయసు 97 ఏళ్లు. ఆయన గత కొంతకాలంగా వయో సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టు నెలల్లో పలుమార్లు అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. తొలుత జూన్ 26న అద్వానీ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. జులై 3న మరోసారి ఆయన అనారోగ్యం బారిన పడ్డారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు ఆయన్ని ఎయిమ్స్‌కి తరలించారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆగస్టు 6వ తేదీన మరోసారి ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం ఇంటికి చేరారు. ఇప్పుడు మరోసారి అస్వస్థతకు గురయ్యారు.

## నందిని సిధారెడ్డి తెగువ.. తెలంగాణ అస్థిత్వ పరిరక్షణలో ఓ మైలురాయి : కేటీఆర్

తెలంగాణ సాహితీ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కవి, రచయిత నందిని సిధారెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి నగదు పారితోషకం, ప్లాట్‌ను తిరస్కరించడం తెలంగాణ అస్థిత్వ పరిరక్షణలో ఓ మైలురాయిగా నిలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ అస్థిత్వ పరిరక్షణలో సిధారెడ్డి చూపిన నిబద్ధత, తెగువ తెలంగాణ చరిత్రలో చిరకాలం నిలిచి ఉంటుంన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్ణయంపై కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. అల్వాల్‌లోని నివాసంలో జరిగిన సమావేశంలో కేటీఆర్, సిధారెడ్డితో ఉద్యమకాల స్మృతులను నెమరేసుకున్నారు. ప్రభుత్వమే తెలంగాణ అస్థిత్వంపై కుట్రలు చేస్తున్న ఈ తరుణంలో తెలంగాణ సమాజానికి నందిని సిధారెడ్డి గట్టి సందేశం పంపారన్నారు. తెలంగాణ బిడ్డలు తమ అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి ఎన్ని త్యాగాలకైనా వెనుకాడరనే.. సిధారెడ్డి ఈ ధైర్యవంతమైన నిర్ణయం సమాజానికి గొప్ప సందేశం ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. సమావేశంలో తెలంగాణపై ప్రస్తుతం జరుగుతున్న అస్థిత్వ దాడులపై చర్చ జరిగింది. ఇప్పుడు ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండి తమ హక్కులను రక్షించుకోవాల్సిన, అవసరం ఉందని, తెలంగాణ సమాజం మరోసారి ఐక్యంగా పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంలో కవులు, కళాకారులు ఎప్పుడూ ముందుంటారని కేటీఆర్ అన్నారు. నందిని సిధారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడిన కేటీఆర్, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. నందిని సిద్ధారెడ్డి తాను రాసిన కొన్ని పుస్తకాలను కేటీఆర్‌కు అందించారు. సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశ్‌పతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్, దేవి ప్రసాద్, దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు

**హైదరాబాద్ :** తాము ఉద్యమ సమయం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఒక చేతిలో జొన్నకర్ర, మరో చేతిలో బతుకమ్మ ధరించిన తెలంగాణ తల్లి వైభవాన్ని చాటేలా పద్యాలు, కవితలు రచించి పుస్తకాలుగా విడుదల చేస్తామన్నారు. ఉద్యమ సమయం తెలంగాణ తల్లి విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేసుకుంటూ వెళతామన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదని, అందుకే విగ్రహం రూపాన్ని మార్చారని ఆరోపించారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ లేకుంటే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు.బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని... జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## మళ్లీ ఎన్నికలు తప్పవా

దేశంలో రాజకీయ వ్యవస్థ అన్నింటికి ఆటంకంగా మారుతోంది. ఒకప్పుడు చాలా దేశాలకన్నా ముందు ఉన్న మన దేశం.. ఇప్పుడు మాత్రం వెనుకబడింది. దీనికి కారణం రాజకీయాలు.. తరచూ ఎన్నికలు జరగడమే. ఒప్పుడు వెనుకబడిన చైనా.. ఒకే పార్టీ అధికారంలో ఉండడంతో అభివృద్ధిలో దూసుకుపోతోంది. దీంతో మన దేశ అభివృద్ధికి ఆటంకం రాజకీయాలే అని చాలా మంది భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ కూడా దీనినే నమ్ముతున్నారు. ఈ క్రమంలోనే వన్ నేషన్, వన్ ఎలక్షన్‌ను తెరపైకి తెచ్చారు"వన్ నేషన్ వన్ ఎలక్షన్" అమలు కోసం రాజ్యాంగాన్ని సవరించడానికి కనీసం ఆరు బిల్లులు పాస్ చేయాల్సి ఉంటుందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. అయితే దానికి ప్రభుత్వానికి పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం ఉంటుంది.పార్లమెంటు ఉభయ సభల్లో ఎన్‌డీఏకు సాధారణ మెజారిటీ ఉన్నప్పటికీ, ఏ సభలోనూ మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడం చాలా కష్టతరమైన పనే చెప్పాలి. జమిలి ఎన్నికలకు సంబంధించి గతంలో కోవింద్ కమిటీ సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతోన్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కేంద్రం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీని కోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు సమాయత్తం అవుతోంది. మొత్తం 2 దశల్లో ఎన్నికలు జరగనుండగా.. తొలి దశలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు.. అవి పూర్తైన 100 రోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీని కోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితా ఉపయోగించనున్నారు.జమిలి ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోన్న వేళ.. దీనిపై ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లుకు సిఫార్సు చేయాలని సర్కారు యోచిస్తున్నట్లు సమాచారం. దీని ద్వారా వివిధ రాష్ట్రాల శాసనసభ స్పీకర్లతోనూ సంప్రదింపులు జరిపేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని భాగస్వామ్య పక్షాలకు అవకాశం కల్పించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకూ అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించడంపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో రూపొందించిన నివేదికను భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఈ ఏడాది మార్చిలో అందించారు. అనంతరం కోవింద్ కమిటీ ఇచ్చిన సిఫార్సులకు కేంద్ర మంత్రివర్గం ఈ సెప్టెంబరులోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజా పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని భావిస్తోన్న ప్రభుత్వం.. తాజాగా కేంద్ర కేబినెట్‌లో ఆమోద ముద్ర వేసింది.దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల ప్రతిపాదనలను 30కి పైగా పార్టీలు సమర్థించగా.. కాంగ్రెస్ సహా 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. అయితే, ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ పేర్కొంటోంది. తమ పార్టీ జమిలి ఎన్నికలకు మద్దతివ్వడం లేదని, ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఎన్నికలు నిర్వహించాలని వాదిస్తోంది. ఇక ఎన్నికల వ్యవయం పెరుగుతుండడంతో నేతలు అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారు. అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నికల కోసమే డబ్బులు పోగుచేసుకుంటున్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఎన్నికయ్యే నేతల్లో చాలా మంది ఇప్పుడు సంపాదనే లక్ష్యంగా పోటీ పాలన సాగిస్తున్నారు. దీంతో రాజకీయాలు కాస్ట్లీ అయిపోయాయి. దీంతో నేతలు అవినీతి సొమ్మునే ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారు. 2024 పార్లమెంటు ఎన్నికలు ముగిసిన ఆరు నెలల్లోనే ఐదు రాష్ట్టా?టల్లో ఎన్నికలు జరిగాయి. మరో రెండు నెలల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఆ తర్వాత బిహార్, ఆ తర్వాత మరో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ పరిస్థితి మార్చాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే వన్ నేషన్, వన్ ఎలక్షన్ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేక కమిటీ వేసి నివేదిక కోరింది. కమిషన్ అన్ని పార్టీలతో చర్చించి నివేదిక అందించింది. తాజాగా వన్ నేషన్, వన్ ఎలక్షన్‌కు కేబినెట్ ఆమోదం లభించింది. ఇక పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేయడమే తరువాయి.దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగం సవరించాల్సి ఉంటుంది. సుమారు 18 సవరణలు అవసరమని కమిషన్ సూచించింది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు జమిలీ ఎన్నికలే జరిగేవి. కానీ ప్రభుత్వాలు కూలిపోవడం, రాజకీయ అనిశ్చితితో ముందస్తు ఎన్నికలకు వెళ్లడం, ప్రభుత్వాలు రద్దు చేయడం వంటివి జరుగుతున్నాయి. దీంతో ఏ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయో తెలియడం లేదు. ఫలితంగా దీనిని సరిచేయాలంటే 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. ముందు కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాల పరిమితిని తగ్గించాలి.రాజ్యసభలోని 245 సీట్లలో ఎన్డీఏకు 112, ప్రతిపక్ష పార్టీలకు 85 ఉన్నాయి. మూడింట రెండొంతుల మెజారిటీకి ప్రభుత్వానికి కనీసం 164 ఓట్లు అవసరం.లోక్‌సభలో కూడా 545 సీట్లకు గాను ఎన్‌డీఏకు 292 సీట్లు ఉన్నాయి. మూడింట రెండు వంతుల మెజారిటీ మార్క్ 364 వద్ద ఉంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల విధానం వల్ల సమయం, డబ్బు, శ్రమ వృథా అవుతోందని ప్రభుత్వం కొంతకాలంగా ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించాలని ఎన్డీఏ సర్కార్ కంకణం కట్టుకుంది. అంటే.. జమిలి ఎన్నికల పట్ల వైసీపీ సానుకూలంగా ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో.. జగన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే పనిలో పడ్డారు. అటు కేడర్ కూడా గతంలో పోలిస్తే.. కాస్త యాక్టివ్ అయ్యింది. జమిలి ఎన్నికలు జరిగితే తప్పకుండా మేలు జరుగుతుందని వైసీపీ భావిస్తోంది.ఇక టీడీపీ విషయానికొస్తే.. జమిలిపై ఇప్పటివరకు ఆ పార్టీ స్పందించలేదు. అదే సమయంలో.. జమిలి వస్తే ఎంతోకొంత నష్టం జరగొచ్చని ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్టు సమాచారం. 2024 ఎన్నికల సమయంలో ఉన్న ఊపు, వైసీపీపై కోపం.. జమిలి ఎన్నికలు జరిగే నాటికి ఉంటుందా అనే చర్చ టీడీపీ వర్గాల్లో జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ బీజేపీ అనుకున్నట్టు జరిగితే.. 2027 మార్చి తర్వాత ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది. అప్పటికీ పరిస్థితి ఇలానే ఉంటుందా అని టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు.జమిలి ఎన్నికలకు దేశంలోని 32 పార్టీలు అనుకూలంగా ఉన్నాయి. 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఎదుట 47 పార్టీలు వాదనలు వినిపించాయి. ఇండియా కూటమిలోని పలు పార్టీలు జమిలిని వ్యతిరేకిస్తున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతోపాటే స్థానిక ఎన్నికలనూ నిర్వహించాలని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సు చేసింది.

ఇందుకోసం రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టాలని సూచించింది.అయితే స్థానిక ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి కేంద్రం పక్కనబెట్టింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు ఆమోదం తెలిపింది. దీనికి 50 శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. లోకల్ బాడీ ఎన్నికలనూ వాటితో కలిపి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణ, 50 శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుందని అంటున్నారు.కొన్నిసార్లు అనేక దశల్లో జరిగే రాష్ట్ర ఎన్నికలను నిర్వహించడంలో పోల్ కమిషన్ ఎదుర్కొంటున్న లాజిస్టికల్ సవాలును ఎత్తి చూపుతూ ప్రతిపక్షం ఈ ఆలోచనను సరికాదని విమర్శిస్తుంది. ఆలోచన బాగుంది కానీ ఆచరణ కూడా బాగుండాలి. అనిశ్చితి ఉంటే ఏం చేయాలి, ప్రభుత్వాలు మధ్యలో కూలితే ఏమవుతుందని అన్నది కూడా స్పష్టత ఇవ్వాలి. సంకీర్ణాలు వస్తే పరిస్థితి ఏంటి అన్నది కూడా తెలియాలి. ఇందుకు జనంలో అవగాహన రావాలి. వీటిపైనే వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ విధానం సక్సెస్ అవుతుందా లేదా అన్నది ఆధారపడి ఉంటుంది.

## నాకు సహకరించినందుకు ధన్యవాదాలు

**హైదరాబాద్ :** తనకు అండగా నిలిచిన అభిమానులందరికీ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉదయం జైలు నుంచి విడుదలైన ఆయన జూబ్లీహిల్స్‌లోని నివాసానికి చేరుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. 'నాకు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు. నేను చట్టాన్ని గౌరవిస్తాను, కట్టుబడి ఉంటాను. బాధిత కుటుంబానికి మరోసారి సానుభూతి తెలియజేస్తున్నా. నేను సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు అనుకోకుండా ఈ ఘటన జరిగింది. ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదు. 20 ఏళ్లుగా థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తున్నా. నా సినిమాలే కాదు.. మావయ్య సినిమాలు చూశాను. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేనిది. అభిమానం, ప్రేమతో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నేను బాగానే ఉన్నాను. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు.' అని పేర్కొన్నారు.శనివారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్.. నేరుగా గీతా ఆర్ట్స్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ న్యాయవాదులతో దాదాపు 45 నిమిషాలు చర్చలు జరిపారు. బెయిల్ వచ్చినా విడుదల ఆలస్యం కావడంపై వారితో చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గీతా ఆర్ట్స్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా తన నివాసానికి చేరుకున్నారు. బన్నీని చూసి కుటుంబసభ్యులు ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. భార్య, పిల్లలను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అల్లు అర్జున్ కూతురు అర్హ, భార్య, అత్త ఆయన కోసం ఎదురు చూసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నివాసానికి చేరుకున్న బన్నీకి కుటుంబ సభ్యులు దిష్టి తీసి స్వాగతం పలికారు. తన కుమారుడు, కుమార్తెను ఎత్తుకుని అల్లు అర్జున్ భావోద్వేగానికి గురయ్యారు. సతీమణి స్నేహను ఆప్యాయంగా కౌగిలించుకుని కన్నీటి పర్యంతమయ్యారు.కాగా, సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించగా.. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన శనివారం ఉదయం జైలు నుంచి విడుదలయ్యారు. న్యాయవాదులు రూ.50 వేల పూచీకత్తును జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించారు. శుక్రవారం రాత్రే ఆయన జైలు నుంచి విడుదల కావాల్సి ఉండగా.. బెయిల్ పత్రాలు జైలు అధికారులకు ఆలస్యంగా అందడంతో బన్నీ రాత్రంతా జైల్లోనే ఉండాల్సి వచ్చింది. జైలు వెనుక గేట్ నుంచి బన్నీని పోలీసులు బయటకు పంపించారు. ఎస్కార్ట్ వాహనం ద్వారా ఆయన తన నివాసానికి చేరుకున్నారు. కాగా, శనివారం ఉదయం 7 గంటలకు అల్లు అర్జున్ రిలీజ్ అవుతారని ప్రచారం సాగడంతో.. ఫ్యాన్స్‌తో పాటుగా మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున జైలు వద్దకు చేరుకున్నారు. దీంతో గందరగోళం ఏర్పడగా.. ఆయన్ను 06:05 గంటలకు వెనుక గేట్ నుంచి పంపించారు.

## భోజనం తీసుకోలేదు... నేల మీదే నిద్ర

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌నుపోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. నాంపల్లి కోర్టు ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించగా.. హైకోర్టు 4 వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తొలుత శుక్రవారం రాత్రే ఆయన విడుదల అవుతారని అంతా భావించారు. అయితే, జైలు అధికారులకు బెయిల్ పత్రాలు రాత్రి 10:30 గంటలకు అందడంతో ఆయన్ను రాత్రంతా జైల్లోనే ఉంచారు. ఖైదీలందరూ బ్యారక్‌కు వెళ్లిన తర్వాత మంజీర బ్యారక్ క్లాస్ - 1 రూంలో ఉంచారు. జైలు అధికారులు ఫుడ్ ఇచ్చినా బన్నీ తీసుకోలేదని తెలుస్తోంది. ఆయనకు కొత్త రగ్గు, దుప్పటి ఇవ్వగా సాధారణ ఖైదీలాగే నేల మీదే పడుకున్నట్లు సమాచారం. 14 రోజుల రిమాండ్ విధించినప్పుడు న్యాయాధికారి ఆయన్ను ప్రత్యేక ఖైదీగా పరిగణించాలని ఆదేశించారు. ఈ సౌకర్యాలు జైల్లోకి వచ్చిన మర్నాడు మాత్రమే అందుతాయి. అయితే, బన్నీ రాత్రి విడుదల కాకపోవడంతో కుటుంబ సభ్యులు, అభిమానులు నిరాశతో వెనుదిరిగారు. అల్లు అరవింద్ తీవ్ర అసహనంతో సొంత కారు వదిలి క్యాబ్‌లో వెళ్లిపోయారు. హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో ఈ నెల 4న పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కొడుకు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసులోనే శుక్రవారం బన్నీని పోలీసులు అరెస్ట్ చేశారు. నాంపల్లి కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించగా.. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అర్నబ్ గోస్వామి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర, భజన్‌లాల్ కేసులను ప్రస్తావిస్తూ బెయిల్ ఇస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారమే విడుదలవుతారని అంతా భావించారు. అయినా, జాప్యం కావడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## రెండు కార్లు ఢీ:పలువురికి గాయాలు

**పల్నాడు** పల్నాడు జిల్లా ఈపూరు- కూచినపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొట్టగా అంతే వేగంగా వెనక్కి వెళ్లాయి రెండు కార్లు. ప్రమాదంలో రెండు కార్లలోని వారికి గాయాలు కాగా ఓ బాలిక పరిస్థితి విషమంగా ఉంది. షాకింగ్ వీడియో, కూర్చున్న చోటే అకస్మాత్తుగా వెనక కాలువలో పడిపోయిన ఓ వ్యక్తి, ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు.

## బీటెక్ రవిపై ఎంపి అవినాష్ మండిపాటు

**కడప** సాగునీటి సంఘాల ఎన్నికలు విషయంలో టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పై కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఫైర్ అయారు.బిటెక్ రవి మాటలు సినిమా ను తలపిస్తున్నాయని,సినిమా డైరెక్టర్, నిర్మాత, ప్రేక్షకుడు అన్ని ఆయనే అని,అప్ప ప్రజాస్వామ్యంగా సాగునీటి ఎన్నికల్లో జరిగాయని,ఇది చేతగాని దద్దమ్మ ప్రభుత్వం అని,పోలీసులను అడ్డుపెట్టుకొని ఎన్నికలు చేయడం చేతకానితనం అని,ఎన్నికల్లో రైతులు పోటీ చేయాలంటే, నో డ్యూస్ సర్టిఫికెట్ తప్పనిసరి అని,ఖైదీలను బందించినట్లు వి ఆర్ ఓ లను ఎమ్మార్వో కార్యాలయంలో ఎందుకు బంధించారని అన్నారు.

## ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ చట్టం తెచ్చి

# అమలు చేయాలి

### - జాతీయ సోషలిస్ట్ కూటమి డిమాండ్

**హైదరాబాద్ :** ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ చట్టం ప్రవేశ పెట్టి ఆమోదం తెలుపాలని జాతీయ సోషలిస్ట్ కూటమి డిమాండ్ చేసింది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ జాతీయ కై దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా శనిఉవారం అబిట్స్ లోని సుర్యలోక్ కాంప్లెక్స్ లో మేధావుల తో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సోషలిస్ట్ కూటమి జాతీయ చైర్మన్ యల్. జై బాబు మాట్లాడుతూ 1991గ్లోబలైజేషన్ అర్థక సంస్కర్ణ లు అమలు మూలంగా ప్రభుత్వ రంగం తగ్గిపోయి 90శాతం ప్రై వేట్ రంగం పెరిగిందన్నారు. ప్రై వెట్లో రిజర్వేషన్ లేకపోవటం మూలంగా రిజర్వేషన్ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుంది. 10శాతం కూడా లేని ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్ సరిగ్గా అమలు జరగనందున ఇక్కడ అన్యాయమే జరిగిందన్నారు. ఉన్నది కూడా ప్రయివేట్ పరం గా మారే పరిస్థి ఉన్నందున త్వరగా ప్రై వేట్ లో రిజర్వేషన్ చట్టం అమలులోకి తేవాలని డిమాండ్ చేసారు.

1981సెన్సెస్ ప్రకారంఇప్పటికి రిజర్వేషన్ అమలు మూలంగా బఇ బిలు 2లక్షల ఉద్యోగాలు కోల్పోయార ని 2024జనాభా ప్రకారం అమలు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగాల్లో కేంద్రం లక్షలు కోట్లు పెట్టుబడులు విత్ డ్రా చేయడం మూలంగా40% బఇ బిబి ఓబీసీలు కోల్పోయరని ఆవేదన వ్యక్తం చేసారు. ఇక భారీ ఉద్యోగాలు ప్రభుత్వరంగంలో లేనట్లేనని ప్రై వేట్ లో మాత్రమే ఈ అవకాశం ఉన్నందున నూతన చట్టంతెచ్చి న్యాయం అందించాలన్నారు.ఓసి లు 61.6%ఉద్యోగాల్లో సంపదలో 51.6%సమానత్వాన్ని దాటి ఉన్నారని ఎస్సిఎస్టి లు కలిపి 5% ఓబిసి లు 4%మాత్రమే ఉన్నారని ఎప్పటికి సామజిక ఆర్థిక అసమానతలు తొలగిస్తారని ప్రశ్నించారు.

రిజర్వేషన్లు -సమానత్వాన్ని ఎప్పటికీ కాపాడుతారో కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు చర్చ జరపాలన్నారు. ప్రశ్నిస్తే కక్ష గట్టి సోషల్ -పొలిటికల్ యాక్టివిటీస్ని క్రిమినల్ యాక్టివిటీస్ గా మార్చి సామజిక వేత్తలను అక్రమంగా జైల్లో పెడుతున్నారు ఇది అన్యాయం అన్నారు. నిమ్న జాతులను వివక్షతతో చూడడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగం హక్కులు కాపాడుకునే స్వేచ్చ ఉందన్నారు.దేశం చైనాను మించి వృద్ధి రావాలంటే సూక్ష్మ -చిన్న -మధ్య -భారీ పరిశ్రమలు ఏర్పాటు కు సదుపాయలు అందుబాటులోకి రావాలని. కులవృత్తులు బలోపేతం అవ్వాలని బ్యాంకులు పెట్టు బడులు గ్రామస్తాయి కి బలంగా సేవలు విస్తరించాలన్నారు. ప్రభుత్వ రంగసంస్థల్లో ల్లో . బ్యాంక్ ల్లో ఆర్థిక రంగాల్లో. చట్ట సభల్లో కార్పొరేట్ శక్తులు శాశిస్తున్నారని. రాజ్యాంగ అమలుకు అడ్డు పడుతున్నారన్నారు. 94శాతం అనార్గ నైస్డ్ ప్రజల సంక్షేమం ఆర్థిక రంగంతో ముడిపడి ఆర్దక రంగంలో ప్రజలంతా లబ్ది పొందు తున్నందున ప్రై వేట్ రంగం ఎంత పెరిగితే దేశం అంత అభివృద్ధి చెందుతుంది అందుకే చట్టభద్దత ఉన్న అన్ని ప్రై వేట్ సంస్థల్లో రిజర్వేషన్ అడిగే హక్కు ఉన్నందున కేంద్ర ప్రభుత్వం ప్రై వేట్ రంగాన్ని బ్యాలన్స్ చేసి చట్టం అందించాలని దీనిపై అన్నీరాజకీయ పార్టీలతో పార్లమెంట్లో చర్చ పెట్టాలని. ప్రభుత్వ -ప్రై వేట్ ఉద్యోగులకు నూతన పెన్షన్ఒకే విధానం తో చట్టం కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా భుక్య ప్రసాద్,నాయకత్వం లో తెలంగాణా రాష్ట్ర కమిటి ఏర్పడింది. ఈ సమావేశం లో జై స్వరాజ్ పార్టీ రాష్ట్ర అద్యక్షులు శ్రీనివా గౌడ్,శ్రీనివాస్ నాయుడు,పి. చర్చల్,కొమ్ము అధిరప్ప, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అద్యక్షులు అప్పల్ రాజు,సిహెచ్ బాల క్రిష్ణ, పి,వెంకట్ రావుపాల్గొన్నారు.

## ఢిల్లీ నేరాలకూ రాజధానిగా మారింది

## అమిత్ షాకు కేజ్రీవాల్ లేఖ

### డ్రగ్స్ నేరాలు 350 శాతం పెరిగాయని ఆందోళన

**హైదరాబాద్:** ఢిల్లీలో పెరుగుతున్న నేరాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఢిల్లీ నేరాలకు కూడా రాజధానిగా మారిందని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో డ్రగ్స్ నేరాలు 350 శాతం పెరిగాయన్నారు. మహిళలపై నేరాలు, హత్యల్లో ఢిల్లీదే మొదటి స్థానమన్నారు. ఢిల్లీలో బాంబు బెదిరింపులు నిత్యకృత్యంగా మారాయన్నారు. బాంబు బెదిరింపుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ శాంతిభద్రతలపై తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యను వివరించేందుకు తనకు అపాయింట్ మెంట్ ఇవ్వాలని కోరారు. భారత్‌లోని మెట్రో నగరాలతో పోలిస్తే ఢిల్లీలోనే అత్యధికంగా నేరాలు జరుగుతున్నాయని విమర్శించారు. నేరాల కారణంగా ఢిల్లీకి 'రేప్ క్యాపిటల్', 'క్రైమ్ క్యాపిటల్' అనే కొత్త పేర్లు వస్తున్నాయన్నారు.?

## సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధభూమే

### దేశభక్తి, ఐక్యతను సినిమా ప్రేరేపిస్తుంది

### అల్లు అర్జున్‌ను కావాలనే అరెస్టు చేశారు

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

### సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ కౌంటర్!

హైదరాబాద్, డిసెంబర్ 14(ఆర్ఎన్ఎ): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి అల్లు అర్జున్‌కు మద్దతుగా మాట్లాడారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. "సినిమావాళ్లు చేసేది పక్కా బిజినెస్. హీరోలు డబ్బులు పెడుతున్నారు.. ఆ తర్వాత సంపాదించుకుంటున్నారు. వాళ్లేమైనా సరిహద్దుల్లో సైనికుల వలే యుద్ధాలు చేస్తున్నారా?" అని నిన్న ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ స్పందించారు. సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధభూమేనని అన్నారు. దేశభక్తి, ఐక్యతను సినిమా ప్రేరేపిస్తుందని తెలిపారు. దేశభక్తి కేవలం సరిహద్దుల్లోనే కాదు, ప్రజల్లో స్ఫూర్తి నింపడంలో కూడా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అనేక సినిమా పాటలు దేశాన్ని కదిలించాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అల్లు అర్జున్‌ను కావాలనే అరెస్టు చేశారని, ఆయన విషయంలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని బండి సంజయ్ చెప్పుకొచ్చారు.

## విభజన హామీలు బుట్టదాఖలు చేయడంలో

# ప్రధాన ముద్దాయి ప్రధాని మోడీ

**విజయవాడ** విజన్ 2047 పేరుతో చంద్రబాబు గారు మళ్ళీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ దశ - దిశ మారాలంటే తక్షణం కావాల్సింది విజన్లు కాదు.. విభజన హామీలని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని నెంబర్ 1 గా నిలపాలంటే నెరవేరాల్సింది కేంద్రం ఇచ్చిన హామీలు. దశాబ్ద కాలంగా విభజన హామీలను గాలికి వదిలేశారు. పూర్తిగా అటకెక్కించారు. రాష్ట్ర విభజన సమయంలో అనాడు ఐఖం సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చింది. నూతన రాజధానికి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం ఇవ్వాలని సూచించింది. బుందేల్ ఖండ్ తరహాలో వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటన చేసింది. మౌలిక సదుపాయాల కల్పన, పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని షెడ్యూల్ 13 లో పొందపరిచింది. కడప స్టీల్, దుగ్గరాజుపట్నం పోర్టులను నిర్మిస్తామని విభజన చట్టంలో పొందపరిచింది. నూతన రైల్వే జోన్, పెట్రోలియం యూనివర్సిటీ, విశాఖ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విజయవాడ, విశాఖలో మెట్రో రైల్, హైదరాబాద్ నుంచి విజయవాడకు ర్యాపిడ్ రైల్, ఇలా ఎన్నో హామీలు నేటికీ కలగానే మిగిలాయి. ఇవ్వాల్టికి ఒక్క హామీకి దిక్కులేకుండా పోయింది. గడిచిన 10 ఏళ్లలో ప్రత్యేక హోదా వచ్చి ఉంటే పన్నుల్లో రాయితీలు ఉండేవి. వేల సంఖ్యలో కొత్త పరిశ్రమలు వచ్చేవి. లక్షల్లో ఉపాధి అవకాశాలు లభించేవి. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయ్యి ఉంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేది. విజయవాడ, విశాఖలో మెట్రో రైల్ నిర్మాణం జరిగితే ప్రధాన నగరాలుగా అభివృద్ధి చెందేవి. కబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు అంది వుంటే పేదరిక నిర్మూలన సాధ్యం అయ్యేది. విభజన హామీలు అమలయ్యి ఉంటే రాష్ట్రం దిశ - దశ పూర్తిగా మారేది. దేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ విరాజిల్లేది. విభజన చట్ట హామీలు బుట్టదాఖలు చేయడంలో ప్రధాన ముద్దాయి ప్రధాని నరేంద్ర మోడీ అయితే, రెండో ముద్దాయి చంద్రబాబు .. మూడో ముద్దాయి జగన్ మోహన్ రెడ్డి. ముగ్గురు కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. హోదా 5 ఏళ్లు కాదు 10 ఏళ్లు ఇస్తామని మోడీ నమ్మబలికితే.. హోదా ఏమైనా సంజీవనా అని చంద్రబాబు గారు చెవుల్లో పూలు పెట్టారు. 25 మంది ఎంపీలు ఇస్తే ఎందుకు ఇవ్వరో చూస్తా అని శపథాలు చేసిన జగన్ రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారు. చంద్రబాబు ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఎప్పటికైనా రాష్ట్ర అభివృద్ధికి సంజీవని ప్రత్యేక హోదా మాత్రమే. హోదాతోనే రాష్ట్రానికి విజన్. మోడీ పిలక మీ చేతుల్లో ఉంది. విభజన హామీలపై ప్రధానిని నిలదీయండి. కేంద్రం గల్లా పట్టి రాష్ట్ర హక్కులను సాధించండని అన్నారు.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా

## కామన్ డైట్ కార్యక్రమం అమలు

**జగిత్యాల :**రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించే దిశగా ప్రభుత్వం కామన్ డైట్ కార్యక్రమాన్ని లాంచ్ చేసిందని అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్ జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలంలోని తాటిపెల్లి ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ మరియు జగిత్యాల భవాని నగర్ లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికల) పాటు పెద్దాపూర్ గురుకుల పాఠశాల కలెక్టర్ గారు పాల్గొన్నారు. అనంతరం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన, వసతి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా తయారు చేసిన కొత్త డైట్ మెన్యూ ను జిల్లా కలెక్టర్ బి , సత్య ప్రసాద్ ప్రారంభించారు. ప్రజా ప్రభుత్వంలో పిల్లలకు కల్పించే సౌకర్యాలు తల్లిదండ్రులకు తెలియాలనే ఉద్దేశంతో ఈ రోజు వారిని ఆహ్వానిస్తున్నామని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నేటి నుండి నూతన డైట్ మెస్ చార్జీలు పెంచడం జరిగింది. నేటి నుండి అమల్లోకి వచ్చిందని. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని పిల్లలతోపాటు ఉపాధ్యాయులు కూడా కలిసి భోజనం చేసారని తెలిపారు. అలాగే విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. కచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందిస్తూ రిజిస్టర్ నమోదు చేస్తూ పాటించాలని సూచించారు.రోజువారి భోజనం బాగుందా లేదా అని విద్యార్థుల కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. విద్యార్థులందరూ మంచిగా చదువుకొని పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు. గురుకులాలకు గ్రీన్ ఛానల్ ద్వారా వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టామని, ఇక పై నాణ్యతతో కూడిన వస్తువులు మాత్రమే సరఫరా చేయాలని, ఎక్కడ నాణ్యత లోపించిన ఉపేక్షించ కుండా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాలలో పరిశుభ్రతకు ఎక్కడ లోటు లేకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటారో, ఉపాధ్యాయులు అంతే జాగ్రత్తగా చూసుకోవాలని, మన గురుకులాల్లో చదివే పిల్లల పట్ల మనం బాధ్యతతో ఉండాలని తెలిపారు. డైట్ చార్జీలను 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 950 నుంచి 1330 రూపాయలకు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 1100 నుంచి 1540 రూపాయలకు, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు 1500 నుంచి 2100 రూపాయలకు ప్రజా ప్రభుత్వం పెంచిందని, అదేవిధంగా కాస్మెటిక్ చార్జీలను బాలికలకు 7వ తరగతి వరకు 55 నుంచి 175 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పై గల బాలికలకు 75 నుంచి 275 రూపాయలకు, బాలురు 7వ తరగతి వరకు 62 నుంచి 150 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పై గల బాలురు 62 నుంచి 200 రూపాయలకు పెంచినట్లు కలెక్టర్ తెలిపారు ..వైద్యులతో సంప్రదించి పిల్లల ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరమైన పోషకాలు అందించేలా కామన్ డైట్ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు ప్రపంచ స్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను ప్రభుత్వం నిర్మిస్తుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజు కుమార్, మెట్ పెల్లి ఆర్డీవో, శ్రీనివాస్, తహసిల్దార్లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బన్నీని కలిసిన
# సుకుమార్, విజయ్ దేవరకొండ

**హైదరాబాద్** జైలు నుంచి విడుదలై ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్తో డైరెక్టర్ సుకుమార్, హీరో విజయ్ దేవరకొండ భేటీ అయ్యారు. పుష్ప–2 నిర్మాతలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కేసుకు సంబంధించిన విషయాలపై వీరు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే డైరెక్టర్ వంశీ పైడిపల్లి, ఆనంద్ దేవరకొండ బన్నీని కలిశారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలను
# బహిష్కరించిన వైకాపా

**విశాఖపట్నం** సాగునీటి సంఘాల ఎన్నికలను కూటమి నేతలు అప హాస్యం చేస్తున్నారని, అందుకే ఎన్నికలను తమ పార్టీ బహిష్కరి స్తోందని వైసీపీ సీనియర్ నాయ కుడు, శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న తమ అభ్యర్థులకు వీఆర్ఓలు నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. నీటిసంఘాల ఎన్నికల్లో పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నా రని బొత్స ప్రశ్నించారు. వీటన్నింటి కారణంగా ఎన్నికలను బహిష్క రిస్తున్నామన్నారు.రైతన్నలకు అండగా పేరుతో వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు విజయ వంతమయ్యాయని ఆయన తెలిపారు. కాగా, సినీ నటులు అల్లు అర్జున్, మోహన్బాబుల విషయాల్లో ప్రభుత్వాలు తొంద రపాటు నిర్ణయాలు తీసుకోకుండా సంయమనం పాటించాలని వ్యా ఖ్యానించారు. గోదావరి పుష్కరాల సమయంలో తొక్కిసలాట జరిగి 20 మంది మృతిచెందారని, ఆ ఘటనకు ఎవరిని బాధ్యులు చేశారనేది పరిశీలించాలని కోరారు.

## అమ్మవారిని దర్శించుకున్న
# ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**విజయవాడ** శనివారం నాడు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ మధుకర్ భగవత్ ఇంద్రకీలాద్రిలోని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అయనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సత్యనారాయణ, ఆలయ ఈవో కె ఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా మోహన్ భగవత్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత అయనకు వేదపండితుల తో వేదాశీర్వచనం కల్పించారు. మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆలయ ఈవో అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదములు మరియు చిత్రపటం అందజేశారు. తరువాత మంత్రి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆలయమునకు రావడంతో అయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితుల ఆశీర్వచనం కల్పించి, ప్రసాదములు అందజేసి గౌరవించామని అన్నారు. డిసెంబర్ 21 నుండి 25 వరకు జరుగు భవానీ దీక్ష విరమణల సందర్భంగా దేవస్థానం వారు దసరా లాగే పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వం నుండి కావలసిన సహకారములు అందిస్తున్నాం. దీక్షా విరమణ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ముందస్తు బుకింగ్స్, దీక్షా సమాచారం, కౌంటర్లు, పార్కింగ్, టాయిలెట్స్, మెడికల్, సమయం వివరాలు తదితర సమాచారంతో కూడిన మొబైల్ ఆప్ ను ఆవిష్కరించి లాంచ్ చేశారు. భక్తులందరూ ప్లే స్టోర్ నుండి భవాని దీక్ష 2024 అను ఆప్ ను డౌన్ లోడ్ చేసుకొని వినియోగించుకొనవలసిందిగా తెలిపారు.

# రాజన్న కోడెలకు రక్షణ లేదా?

**- ఆందోళన వ్యక్తం చేసిన భారత్ స్వాభిమాన్ ట్రస్ట్**

**- బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి**

**- నందనం కృపాకర్**

**హైదరాబాద్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి చెందిన కోడెలు అంగట్లో సరుకుగా మారడం పట్ల భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆందోళన వ్యక్తం చేసింది. భక్తులు రాజన్నకు సమర్పించిన కోడెల విక్రయాలకు సంబంధించి ఇటీవల వెలుగులోకి వచ్చిన వార్తల పట్లగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ అంశంపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందని, బాధ్యులైన సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్వాభిమాన్ ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నందనం కృపాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీ రాజరాజేశ్వర మందిర గోశాలలో గోమాతకు రక్షణ లేదనే విషయాలను ఇటీవల జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్, వరంగల్ జిల్లా గీసుకొండలో బయటపడ్డ ఉదంతాలు బహిర్గతం చేశాయని ఆయన అన్నారు. ఈ సంఘటనలు రాజన్న భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని అన్నారు. భక్తులు ఎంతో భక్తితో దేవాలయానికి ముడుపుగా చెల్లించిన గోమాతల రక్షణ బాధ్యత నిస్సందేహంగా ఆలయ అధికారులదే అని అన్నారు.ఆలయ గోశాలలోని గోవులకే రక్షణ లేకపోతే వాటికి ఎక్కడ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు.జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్, వరంగల్ జిల్లా గీసుకొండ ప్రాంతాలలో గోశాల నిర్వాహకుల పేరిట కొందరు నకిలీ వ్యక్తులు రాజన్న ఆలయ గోవులను తీసుకువెళ్లి విక్రయిస్తూ పట్టుపడ్డ ఉదంతాలపై సంబంధిత పోలీస్ స్టేషన్లో కేసులు నమోదైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రాజన్న ఆలయ గోవుల విక్రయాలపై ప్రతిస్పందించి ఇందుకు కారణమైన దేవాలయ అధికారులపై తగుచర్యలను తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. రాజన్న ఆలయ గోశాల ప్రాంగణాన్ని విస్తరించి, గోవులను రక్షించడానికి కావలసిన ఏర్పాట్లను చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. భక్తుల మనోభావాలను కించపరిచే ఎటువంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని ఆయన దేవాలయ సిబ్బందికి ,ప్రభుత్వానికి, సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని అనేక దేవాలయాల అధీనంలోఉన్న గోవులను సంరక్షించి, మెజారిటీ ప్రజల విశ్వాసాన్ని పొందడానికి వెంటనే కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## దామరచర్ల మండల
# కేంద్రంలో ఏటీఎం చోరీ




**నల్గొండ** దామరచర్ల మండల కేంద్రంలో ఏటీఎంలో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి ఎస్బిఐ బ్యాంక్ ఏటీఎంను దుండగులు పగలగొట్టారు. సుమారు 20లక్షలు మాయం అయినట్లు సమాచారం. వాడపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం**



**హైదరాబాద్** తెలంగాణలో జరగనున్న గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేపు, ఎల్లుండి గ్రూప్ 2 పరీక్షలు జరుగుతాయని.. అభ్యర్థులు పబ్లిక్ సర్వీస్ కమిషన్పై నమ్మకం ఉంచి పరీక్షలు రాయండని ఆయన చెప్పారు. ఎవరి ఓఎంఆర్ షీట్ వారికే ఉంటుందని.. ప్రతి అభ్యర్థికి బయోమెట్రిక్ తప్పనిసరని టీజీపీఎస్సీ ఛైర్మన్ తెలిపారు. ఈసారి త్వరగానే ఫలితాలు ఇస్తామని అన్నారు. మొత్తం 1,368 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.కాగా.. 783 గ్రూప్–2 సర్వీసుల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 5,51,943 మంది అప్లై చేసుకున్నారు. ఒక్కో పేపరుకు 150 మార్కుల చొప్పున నాలుగు పేపర్లు 600 మార్కులకు ఎగ్జామ్స్ జరగనున్నాయి. ఉదయం 10–12.30, మధ్యాహ్నం 3–5.30గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి.

## గుడిలో మహిళపై
# తొమ్మిది మంది అత్యాచారం



అస్సాలోని గౌహతి ప్రాంతంలో దారుణంలో వెలుగులోకి వచ్చింది. బోరాగఢ్లో ఓ మహిళపై తొమ్మిది మంది సామూహిక అత్యాచారం చేశారు. దీనికి సంబంధించిన వీడియో వాట్సప్ గ్రూపులలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి తొమ్మిది మంది అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ 17న నిజారాపార్ ప్రాంతంలోని దుర్గ గుడి సమీపంలో మహిళపై తొమ్మిది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. డిసెంబర్ 12న వాట్సాప్ గ్రూపులలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులు కుల్దీప్ నాథ్(23), బిజయ్ రాభా(22), పింకుదాస్(18), గగన్ దాస్(21), సౌరవ్ బోరో(20), మ్రినాల్ రాభా(19) ఆరుగురిని అరెస్టు చేశారు. మిగిలిన ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# 2029లోనే ఎన్నికలు

**విజయవాడ :** దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మద్దతు ప్రకటించామని.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా జమిలి ఎన్నికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 202 9లోనే అని చెప్పారు. వైసీపీ పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.'వైసీపీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారు. వైసీపీ చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రతిచోటా చర్చ జరగాలి. విజన్ 2020 సాకారమైన తీరు నేటి తరం తెలుసుకోవాలి. గత పరిస్థితులను బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు అందరికి కనిపిస్తున్నాయి' అని చంద్రబాబు వివరించారు.'2047 లోనూ ఇదే పునరావృతం అవుతుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఒక రోజు పెట్టి వదిలేసేది కాదు. భవిష్యత్ తరాల బాగు కోసం చేసే ప్రయత్నంలో అందరు భాగస్వామ్యం కావాలి. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరత్రా ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతున్నాయి. ఈసారి కలెక్టర్ల సదస్సులో ఎన్నో మార్పులు తీసుకొస్తాం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.'సుదీర్ఘ సమీక్షలకు తావివ్వకుండా ప్రశ్నలు, సమాధానాల రూపంలో నిర్వహిస్తాం. ముందుగానే కలెక్టర్లు, ఎస్పీలకు చర్చ అంశాలు పంపి సమాధానాలు కోరతాం. సమయం సద్వినియోగం, మంత్రులు, అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుంది. ఆస్పత్రిలో చేరిన అద్వానీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. అద్వానీ నాకు దశాబ్దాలుగా అనుబంధం ఉంది. ఆనాడు ఏపీ అభివృద్ధిలో అద్వానీ సహకారం మరువలేనిది' అని చంద్రబాబు కోరారు. జమిలీ ఎన్నికల బిల్లు పెట్టి ఆమోదం తెచ్చుకోవడం ఆసాధ్యమేమీ కాదు. కానీ దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న సస్పెన్స్ కొనసాగుతోంది. కేంద్రం తీసుకురానున్న బిల్లులో జమిలీ ఎన్నికలు పూర్తి స్థాయిలో 2034లో జరుగుతాయని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. 2029లో పాక్షికంగా జమిలీ ఎన్నికలకు లైన్ క్లియర్ చేయనున్నారు. ఆ తరువాత ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా అసెంబ్లీ, లోక్సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. వైసీపీ ఇప్పటికే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయింది మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇష్టాగోష్టిలో మాట్లాడుతూ.. 'ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మేం మద్దతు ప్రకటించాం. అయితే వైసీపీ పబ్బం గడుపుకోవడానికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతోంది. వైసీపీ నేతలు ఇదివరకే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు. వాళ్ల నాటకాలు చూసి ఏపీ ప్రజలు నవ్వుకుంటున్నారు. ప్రస్తుతంలో ఏపీలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. విజన్ 2020 సాకారమైన తీరు నేటి తరం తెలుసుకోవాలి. పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలతో పాటు ప్రతిచోటా చర్చ జరగాలని' పేర్కొన్నారు.

## ఏలూరు జిల్లాల్లో
# రెచ్చిపోతున్న దొంగలు

**ఏలూరు :** ఏలూరు జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్గా కన్నాలు వేస్తున్నారు. పగలు పక్కాగా రెక్కీ నిర్వహించి.. రాత్రిపూట సైలెంట్గా పని కానిచ్చేస్తున్నారు. దీంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో భద్రంగా దాచుకున్నా.. దోచుకెళ్తున్నారని వాపోతున్నారు.ఏలూరు జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి.. పోలీసులకు సవాలు విసురుతున్నారు. రాత్రి గస్తీ, విజిబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా.. దొంగలు తమ పనిని కానిచ్చేస్తున్నారు. గట్టి నిఘా ఉన్నా దొంగతనాలు ఆగడం లేదు. లాక్డ్హౌస్ మోనటరింగ్ సిస్టంపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. దాన్ని ఎక్కువగా సద్వినియోగం చేసుకున్నట్టు కనిపించడం లేదు.

ఇవన్నీ కారణాలు దొంగలకు వరంగా మారాయి. అటు ఊరెళ్లే సమయాల్లో పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడంతో.. దొంగలు గుట్టుగా పని కానిచ్చేస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు ఇలా ఉన్నాయి. ఏలూరు నగరం ఆదివారపుపేటలో ఉంటున్న ఓ వ్యక్తి తన ఇంటికి తాళం వేసి బయటకెళ్లారు. దీన్ని గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి 10 కాసుల బంగారం, రూ.లక్ష నగదు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. కైకలూరుకు చెందిన ఓ వ్యక్తి ఈ నెల 4న కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ వెళ్లారు.

ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు.. లోపలికి చొరబడి నాలుగు కాసుల బంగారం, 30 తులాల వెండి, నగదు దోచుకెళ్లారు.ఏలూరు నగరం, జిల్లాల్లో పట్టణాల్లో పగలు రెక్కీ నిర్వహించడం.. రాత్రి దొంగతనం చేయడం కామన్గా మారింది. ఇంటి యజమానులు లేరన్న కచ్చిత సమాచారంతోనే.. ఆ ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. కొందరు పాత నేరస్థులు బెయిల్పై బయటకొచ్చి.. దొంగతనాలు చేస్తున్నట్టు అనుమానాలు ఉన్నాయి. ఇటీవల అరెస్టయిన దొంగల్లో ఎక్కువ మంది పాత నేరస్థులే ఉండటం గమనార్హం.చోరీల నివారణకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశామని పోలీసులు చెబుతున్నారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరం చేశామని అంటున్నారు. నిరంతరం విజిబుల్ పోలీసింగ్ చేస్తున్నారని.. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన చోరీ కేసుల్లో దొంగలను అరెస్టు చేసి.. సొత్తు రికవరీ చేశామని.. బాధితులకు న్యాయం చేస్తున్నామని అంటున్నారు.

# బాపట్లలో దారుణం

**గుంటూరు :** బాపట్ల జిల్లాలో ఘోర సంఘటన చోటు చేసుకుంది. ఆస్తుల కోసం ఏకంగా కన్న తల్లిదండ్రులనే కుమారుడు రోకలి బండతో అతి కిరాతకంగా దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. నిందితులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు హత్య కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.ఈ ఘటన బాపట్ల జిల్లా బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం? అప్పికట్లలో స్కూల్ హెడ్ మాస్టార్గా పని చేసి పదవీ విరమణ పొందిన పి.విజయ భాస్కరరావు (74), వెకంట సాయి కుమారి (70) దంపతులు సొంతంగా గృహం నిర్మించుకుని ఉంటున్నారు. ఈ దంపతలకు కిరణ్ అనే కుమారుడు ఉన్నాడు. కిరణ్ పోస్టల్ డిపార్ట్మెంట్లో పని చేస్తున్నాడు.అయితే తల్లిదండ్రులు, కుమారుడు మధ్య ఆస్తుల విషయంలో గొడవులు గత కొంతకాలంగా జరుగుతున్నాయి. కిరణ్ నాలుగు రోజుల క్రితమే అప్పికట్ల వచ్చాడు. అప్పటి నుంచి అప్పికట్లలోనే ఉంటూ తల్లిదండ్రులతో గొడవ పడుతున్నాడు. ఆస్తుల పంపకాల విషయంలో తల్లిదండ్రులకు ఆయనకు వివాదం ఏర్పడింది. దీంతో శనివారం తెల్లవారుజామున గాఢనిద్రలో ఉన్న తలిదండ్రులను కుమారుడు కిరణ్ రోకలి బండతో విచక్ష రహితంగా దాడి చేసి హతమార్చాడు.స్థానికులకు శబ్ధాలు రావడంతో లేచి ఆ ఇంటి వద్దకు చేరుకున్నారు. రక్తకపు మడుగుల్లో ఉన్న వృద్ధ దంపతులను చూసి కన్నీరు మున్నీరు అయ్యారు. వెంటనే నిందితుడు కిరణ్ను స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్న తరువాత, స్థానికులు నిందితుడు కిరణ్ను పోలీసులకు అప్పగించారు. పోలీసులు కిరణ్ను బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కన్న కొడుకే దారుణంగా హత్య చేయడంతో ఆ ప్రాంతంలో సంచలనమైంది. ఈ ఘటనతో అప్పికట్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. బంధువులు, స్థానికులు కన్నీరు మున్నీరు అయ్యారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. నిందితుడు, మృతుల కుమారుడు పోలీసులు అదుపులో ఉన్నాడు. ఆయనపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ ఇంటివద్ద పోలీసులు పహారా కాశారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు కుటుంబ సభ్యులను, నిందితుడు కిరణ్ను విచారిస్తున్నారు. డిఎస్పీతో పాటు బాపట్ల ఎస్ఐ తదితరులు ఉన్నారు.కిరణ్కు మతి స్థితిమితం పని చేయక సైకోలా ప్రవర్తిస్తాడని గ్రామస్థులు అంటున్నారు. గతంలో సొంత కొడుకునే హత్య చేశాడని, భార్య కూడా విడిచిపెట్టి వెళ్లిపోయిందని తెలిపారు. గత పది రోజుల నుంచి మెడిసన్ కూడా వాడటం లేదన్నారు. సొంత తల్లిదండ్రులనే హత్య చేస్తాడని అనుకోలేదని పేర్కొంటున్నారు.

## మహిళపై చిరుత దాడి...
# తీవ్రగాయాలు

**అదిలాబాద్ :** అదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలం దేద్రా గ్రామంలో శనివారం తెల్లవారుజామున చిరుతపులి దాడిలో ఒక మహిళ గాయపడింది. అడవి సమీపంలో ఉన్న పశువుల కొట్టం దగ్గరికి మహిళ వ్యక్తిగత అవసరాల కోసం వెళ్లింది. ఈ సమయంలో ఒక్కసారిగా చిరుతపులి దాడి చేసింది.బాధితురాలిని భీమా బాయిగా గుర్తించారు. పులి దాడి చేసిన సమయంలో భీమాబాయి కేకలు వేసింది. వెంటనే స్థానికులు ఆమెను రక్షించారు. అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఆమెను ఆదిలాబాద్లోని రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. అటవీ శాఖ ఆమె చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించింది. ఆమె ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూనే ఉంది.పశువులను వేటాడేందుకు చిరుతపులి గ్రామంలోకి ప్రవేశించిందని, కానీ భీమాబాయిని చూసి దాడి చేసిందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలోని అడవుల్లో దాదాపు 13 చిరుతపులులు ఉన్నాయి. ఇవి తరచుగా పశువులను వేటాడుతున్నాయని అంటున్నారు.ఇటీవల ఈ ప్రాంతంలో పులుల దాడులు దడ పుట్టిస్తున్నాయి. నవంబర్ 29న, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పత్తి కోస్తుండగా 21 ఏళ్ల మోర్లే లక్ష్మి అనే మహిళ పులి దాడిలో మరణించింది. మరుసటి రోజు సమీపంలోని గ్రామంలో రౌతు సురేష్ అనే రైతుపై కూడా అదే పులి దాడి చేసింది.బాయిపై చిరుతపులి దాడి ఘటన పట్ల మంత్రి కొండా సురేఖగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పిసిసిఎఫ్) ఆర్.ఎం. డోబ్రియాల్తో మాట్లాడారు. సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.మహారాష్ట్ర నుండి ఆదిలాబాద్లోకి చిరుతపులి ప్రవేశించి.. పశువుల కోసం తిరుగుతుందని అటవీ శాఖ అధికారులు మంత్రికి వివరించారు. పశువుల మంద వద్దకు వస్తున్నప్పుడు ఆ మహిళ కదలికలపై భయపడి చిరుత దాడి చేసినట్టు వివరించారు. గాయపడిన మహిళకు రిమ్స్లో తక్షణ వైద్య సహాయం అందించామని చెప్పారు.ఆమె పరిస్థితి మెరుగుపడుతోందని.. పూర్తిగా కోలుకున్న తర్వాత ఆమెను డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. బాధితురాలికి ఇప్పటికే ఆర్థిక సహాయం అందించినట్లు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మంత్రికి వివరించారు.

## చుక్కలు చూపిస్తున్న
# మర్డర్ కేసు

**వరంగల్ :**వరంగల్ నగరంలో హర్రర్ సినిమా తరహాలో జరిగిన ఓ మర్డర్ కేసు పోలీసులకు చుక్కలు చూపిస్తోంది. ఓ వృద్ధురాలిని దారుణంగా హతమార్చిన దుండగులు, సాక్ష్యాధారాలు దొరక్కకుండా జాగ్రత్త పడగా? కేసును ఛేధించేందుకు పోలీసులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే వంద మందికిపైగా అనుమానితులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఏడాదైనా వృద్ధురాలి మర్డర్ కేసు మిస్టరీగానే మిగిలిపోయింది. ఈ ఘటన జరిగి ఏడాది అవుతున్న నేపథ్యంలో స్థానికుల్లో ఇప్పుడిదే చర్చ నడుస్తోంది.వరంగల్ ట్రై సిటీలోని కాజీపేట రహమత్ నగర్ కు చెందిన కన్నె విజయ(68) వడ్డీ వ్యాపారం నిర్వహిస్తుండేది. ఆమె భర్త భద్రయ్య అంతకు ఆరు సంవత్సరాల కిందటే చనిపోగా, విజయ తన కొడుకు కన్నె వీరఅశోక్ ఇంట్లో ఉంటూ వడ్డీల వ్యాపారం నడిపిస్తుండేది. ఈ క్రమంలో 2023 డిసెంబర్ 14న ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయిన విజయ ఆ తరువాత కనిపించకుండా పోయింది. సాయంత్రమైనా ఇల్లు చేరకపోవడంతో ఆమె కొడుకు, ఇతర కుటుంబ సభ్యులు రాత్రి 12.30 గంటల వరకు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో ఇంటికి చేరుకున్నారు.ఈ క్రమంలో అర్ధ రాత్రి 2 గంటల ప్రాంతంలో వారి ఇంటికి కొద్ది దూరంలోని మరో గల్లీలో కుక్కలు విపరీతంగా మొరగడం మొదలు పెట్టాయి. ఒక్కసారిగా కుక్కల శబ్ధం కావడంతో అనుమానం వచ్చిన విజయ కొడుకు వీరఅశోక్, ఇతర కుటుంబ సభ్యులంతా కుక్కల వైపు పరుగులు తీశారు. దీంతో వారికి తమ ఇంటి వైపు ఉన్న ఓ స్ట్రీట్ లైట్ కింద డెడ్ బాడీ కనిపించింది. విజయ మృతదేహం అర్ధనగ్నంగా ఉండగా, ఆమె జాకెట్ కొద్దిదూరంలో ఉన్న డ్రైనేజీ వద్ద రక్తంతో తడిసి ఉంది. విజయ తల వెనుక భాగంతో పాటు కుడి చేతి మధ్య వేలు కూడా పగిలిపోయి ఉన్నాయి. ఆమె ఒంటిపై ఉండాల్సిన రెండు తులాల బంగారం కనిపించకపోవడంతో బంగారం కోసమే ఆమెను హతమార్చి ఉంటారని అనుమానాలు వ్యక్తమయ్యాయి.విజయను హతమార్చిన దుండగులు ఎలాంటి ఆధారాలు చిక్కకుండా చాలా జాగ్రత్త పడ్డారు. డిసెంబర్ 14న ఉదయం విజయ ఇంటి ముందు నుంచి బయటకు వెళ్లిపోగా, ఆ దృశ్యాలు ఆ మార్గంలోని ఓ ఇంటి సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. కానీ ఆమెను హత్య చేసిన దుండగులు ఎలాంటి సీసీ కెమెరాలు లేని, విజయ ఇంటి వెనకవైపు ఉన్న గల్లీ నుంచి వచ్చి డెడ్ బాడీని పడేసి వెళ్లిపోయారు. దీంతో ఆ కాలనీ వ్యవస్థ గురించి తెలిసిన వ్యక్తులే ఈ దారుణానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

అంతేగాకుండా విజయను హత్య చేసిన దుండగులు ఆమె ఒంటిపై రక్తపు మరకలు లేకుండా తుడిచేశారు. పోలీస్ డాగ్ స్క్వాడ్ కూడా వాసన పసిగట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతోనే మర్డర్ జరిగిన అనంతరం పోలీస్ శునకాలు ఘటనా స్థలాన్ని పరిశీలించినా ఫలితం లేకుండా పోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.వడ్డీ వ్యాపారం చేసే విజయ హత్యకు గురి కావడంతో ఆమె వద్ద అప్పు తీసుకున్న వారెవరైనా ఈ హత్య చేసి ఉంటారా అనే అనుమాలు వ్యక్తమయ్యాయి. అంతేగాకుండా పాత కక్షలు, కుటుంబ పరిస్థితులపై కూడా పోలీసులు ఆరా తీసి, మొత్తంగా ఈ కేసులో వంద మందికిపైగా విచారణ జరిపారు. అయినా అసలు ఆమెను చంపింది ఎవరు.. ఎందుకు చంపారనే విషయాలపై మాత్రం క్లారిటీ రాలేదు.నగల కోసం చంపిన వ్యక్తులు మృతదేహాన్ని సీసీ కెమెరాలు లేని మార్గంలో తీసుకు రావడానికి వారికి ఎవరైనా సహకరించారా.. ఆధారాలు దొరకకుండా జాగ్రత్త పడ్డారంటే చంపింది ప్రొఫెషనల్సా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సంచలనం కలిగించిన పెద్ద పెద్ద కేసులనే రోజుల వ్యవధిలో పరిష్కరించి ఎవర్ విక్టోరియస్ గా పేరుగాంచిన వరంగల్ పోలీసులు విజయ మర్డర్ కేసును సాల్వ్ చేయకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాజీపేట పోలీసులు విజయ మర్డర్ కేసును నీరుగారుస్తున్నారనే విమర్శలు వినిపిస్తుండగా, ఒక క్రైమ్ సినిమా తరహాలో జరిగిన ఈ హత్య కేసు మిస్టరీ ఎప్పుడు వీడుతుందో.. అసలు దోషులుగా ఎవరు తేలుతారో చూడాలి.

# వివాదాల మోహన్ బాబు

**హైదరాబాద్ :** మంచు మోహన్‌బాబు.. 500 సినిమాలకు పైగా నటించి.. 50 సినిమాల వరకూ నిర్మించి.. ఇంట్లో ముగ్గురు బిడ్డలను నటులుగా ఇండస్ట్రీకి అందించి.. టాలీవుడ్ మెయిన్ పిల్లర్లలో ఒకడిగా నిలిచిన వాడు. నటన విషయంలో మోహన్ బాబు టాలీవుడ్‌లోనే వన్ ఆఫ్ ది గ్రేటెస్ట్ అనొచ్చు. హీరోయిజమైనా, విలనిజమైనా, పౌరుషమైనా... పౌరాణికమైనా.. చివరకు కామెడీ అయినా సరే.. మోహన్‌బాబుకు తిరుగులేదు. అద్భుతమైన పాత్రలతో అలరించడమే కాదు.. అంతకంటే మంచి చిత్రాలను ప్రొడ్యూసర్‌గానూ అందించారు. 75ఏళ్ల పై వయసులో ఇప్పుడు తెలుగు సినిమా ఇండస్ట్రీకి ఓ పెద్దదిక్కుగా ఉన్నారు. ఇదంతా మోహన్‌బాబుకు ఓ సైడు... ఇంకో వైపు చూస్తే.. ఆయన ప్రొఫెషనల్.. పర్సనల్ లైఫ్ లో బోలెడు వివాదాలున్నాయి. ఇప్పుడు ఇంట్లో గొడవ రచ్చకెక్కింది కానీ.. అంతకు ముందు నుంచే ఆయన చుట్టూ చాలా గొడవలున్నాయి. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఏం జరిగిందో తెలీదు అయితే తిరుపతి రంగంపేట దగ్గర శ్రీ విద్యానికేతన్ పెట్టిన దగ్గర నుంచీ చాలా విషయాలు అందుబాటులో ఉన్నాయి.తిరుపతి రంగంపేట దగ్గర పాతికేళ్ల కిందటే మోహన్‌బాబు విద్యాసంస్థ ఏర్పాటు చేశారు. ఇప్పుడది వందల ఎకరాల్లో యూనివర్సిటీగా రూపుదిద్దుకుంది. ఆ విద్యాసంస్థ దారి విషయంలో 1999లో ఊరి వాళ్లతో గొడవైంది. దానిని చిత్రీకరించడానికి వెళ్లిన మీడియా ప్రతినిధిపై దాడి చేసి కెమెరా ధ్వంసం చేశారు. ఆర్థిక పరమైన లావాదేవీల విషయంలో అప్పటి తిరుపతి టీడీపీ నేత, మాజీ మునిసిపల్ ఛైర్మన్ కందాటి శంకర్‌రెడ్డిపై మోహన్‌బాబు అనుచరులు దాడి చేశారు. అప్పట్లో నటుడు శ్రీహరి కూడా ఆ గొడవలో ఉన్నట్లు బయటకు వచ్చింది. ఆయన మోహన్‌బాబుతో శ్రీరాములయ్య సినిమాలో నటిస్తున్నారు. శ్రీహరితో స్నేహం ఉన్న మోహన్ బాబు ఆయన్ను తీసుకెళ్లారు. రివాల్వర్‌తో శంకర్‌రెడ్డిని బెదిరించారని ప్రచారం జరిగింది. మోహన్‌బాబుకు కోపం ఎక్కువ. ఈ విషయం ఆయన కూడా చాలా సందర్భాల్లో అంగీకరించారు. తనది ధర్మాగ్రహం అని.. అన్యాయం జరుగుతుంటే సహించలేనని ప్రశ్నిస్తానని పలు సందర్భాల్లో చెప్పారు. అయితే ఈ కోపం కాస్త తీవ్రమై తన సినిమాల్లో నటులపై దురుసుగా ప్రవర్తించడం, చేయు చేసుకోవడం వరకూ వెళ్లేదని ఇండస్ట్రీ వాళ్లు అంటుంటారు. పెదరాయుడు సినిమా షూటింగ్ సమయంలో సీనియర్ నటి జయంతిపై కోప్పడటమే కాకుండా చేయు చేసుకున్నారని బాగా ప్రచారం జరిగింది. అది పెద్ద గొడవగా మారడంతో అప్పట్లో దాసరి నారాయణరావు ఆ తగువును తీర్చారని చెబుతారు. ఆ తర్వాత విష్ణు బాబుతో తీసిన మొదటి సినిమా విష్ణు లో హీరోయిన్ శిల్పా శివానంద్ విషయంలో కూడా ఆయన ఇలాగే ప్రవర్తించారు. ఆమెపై కూడా చేయి చేసుకున్నారా లేదా అన్నది క్లారిటీ లేదు కానీ ఆమెతో అయితే గట్టిగానే గొడవ అయిన విషయం మాత్రం నిజం. మోహన్‌బాబు గొడవలన్నింటిలోకి పెద్దది, ముఖ్యమైంది.. తెలుగు సినిమా వజ్రోత్సవాల సమయంలో జరిగిందే. చిరంజీవిపై పరోక్షంగా చేసిన వ్యాఖ్యల వల్ల జరిగిన రగడ.. అంతా ఇంతా కాదు. తెలుగు సినిమా 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అప్పట్లో సినిమా పెద్దలు చిరంజీవికి లెజండరీ అవార్డు ఇద్దాం అని ప్రతిపాదించారు. దీనిని మోహన్‌బాబు అంత పెద్ద వేదికపైనే 'ఎవరు లెజండరీ.. ఎవరు సెలబ్రిటీ' అని ప్రశ్నించారు. రాజ్యసభకు ఎంపికై.. పద్మశ్రీ తీసుకున్న తనకు అర్హత లేదా అన్నారు. రాజ్యసభకు ఎంపికై.. పద్మశ్రీ తీసుకున్న తనకు అర్హత లేదా అన్నారు. ఆ వెంటనే చిరంజీవి సోదరుడు పవన్ కల్యాన్.. మోహన్‌బాబు ను ఉద్దేశించి.. "తమ్ముడూ మోహన్‌బాబు" అనడంతో వివాదం మరింత పెద్దదైంది. ఈ గొడవ ముదరడంతో చిరంజీవి తనకు ఆ అవార్డు వద్దని వారించి.. కుదిరితే తెలుగు సినిమా వందేళ్ల ఫంక్షన్లో తీసుకుంటా అన్నారు. మోహన్‌బాబు నటుడు మాత్రమే కాదు.. రాజకీయాల్లోనూ క్రియాశీలకంగానే ఉన్నారు. తెలుగుదేశం పార్టీతో సన్నిహితంగా ఉన్న ఆయన ఆ పార్టీ తరపున రాజ్యసభకు వెళ్లారు. ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న మోహన్‌బాబు ఆయన్ను పదవీచ్యుతుడిని చేసే సమయంలో చంద్రబాబు వెంట ఉన్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకే చంద్రబాబుతో గొడవ అయింది. దీంతో ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత నుంచీ చంద్రబాబును వ్యతిరేకిస్తూ వచ్చిన మోహన్‌బాబుకు.. చంద్రబాబుతో వ్యాపార గొడవలు కూడా వచ్చాయి. హెరిటేజ్‌ను ప్రారంభించినప్పుడు మోహన్‌బాబు కూడా అందులో ఓ డైరెక్టర్. అందులో వాటాల విషయంలో చంద్రబాబుతో విభేదించారు. ఆ తర్వాత వైఎస్సార్‌కు, ఆయన కుమారుడు జగన్‌కు సన్నిహితంగా ఉన్న మోహన్‌బాబు 2014-19లో చంద్రబాబు పై గట్టిగానే మాట్లాడారు. వేలాది మంది విద్యార్థులను రోడ్లపైకి తెచ్చి.. ఫీజు రీయింబర్స్మెంట్ చేయడం లేదంటూ.. తిరుపతి రోడ్డుపైన పడుకున్నారు. ఆ తర్వాత.. తర్వాత చంద్రబాబుతో కొద్దిగా సర్దుబాటు అయింది.

మోహన్ బాబు ఫ్యామిలీలో చాలా కాలం హెయిర్ డ్రెస్సర్ గా పనిచేసే నాగ శ్రీను అనే వ్యక్తితో గొడవ అయింది. ఆయనపై ఫ్యామిలీ దొంగతనం కేసు పెట్టగా.. ఆ వ్యక్తి తనను వేధించారని కులం పేరుతో దూషించారని ఆరోపణలు చేయడంతో పెద్ద గొడవే జరిగింది. ఇక ఆయన మాటల వల్ల జరిగిన రచ్చలు అనేకం. రంగంపేటలో మోహన్‌బాబు యూనివర్సిటీ ఎదురుగా ఉండే దుకాణాల విషయంలో చిన్న చిన్న గొడవలు చాలా జరిగాయి. ఈ దుకాణదారులను యూనివర్సిటీ వాళ్లు ఇబ్బంది పెడుతున్నారని మనోజ్ వాళ్లకు బహిరంగంగా మద్దతు ఇచ్చారు. అక్కడ నుంచే ఇంట్లో గొడవలు పెరుగుతూ వచ్చాయి. ఓ నటుడిగా తిరుగలేని స్టార్ అయిన మోహన్‌బాబు వ్యక్తిగా మాత్రం ట్రోలింగ్ స్టార్. ఆయన, ఆయన కుటుంబం చేసిన వ్యాఖ్యలు, చేష్టల వల్ల అనేక సార్లు వీళ్లు ట్రోలింగ్‌కు గురయ్యారు. తమ కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని పనిగట్టుకుని చేశారని మంచు విష్ణు అనేక సార్లు చెప్పిన దాంట్లో నిజం ఉండొచ్చేమో కానీ.. వీళ్లు సోషల్ మీడియాలో పలుచన అయింది కూడా అంతే నిజం. మోహన్‌బాబు దురుసుతనంతో.. మంచువిష్ణు ఫన్నీ కామెంట్లతో.. మంచు లక్ష్మి తనదైన మేనరిజం, యాక్సెంట్‌తో ఫేమస్ అయ్యారు. వీళ్లంతా ఓ టైప్ అయితే మనోజ్ ఇంకో రకం. ఇంట్లో ఉన్న అందరిపైనా ట్రోలింగ్ రావడం వీళ్ల విషయంలోనే జరిగింది.

## సంగారెడ్డి నుంచే యుద్ధ ట్యాంకర్లు...

**మెదక్ :** సరిహద్దుల్లో బాంబుల గర్జనలు చేసే యుద్ధ ట్యాంకర్లు.. సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ చెరువులో ప్రత్యక్షమయ్యాయి. భారీ ఆకారంతో యుద్ధ మైదానాల్లో పరుగులు తీసే ఈ ట్యాంకర్లు చెరువులో పడవల ప్రయాణిస్తూ.. స్థానిక ప్రజల ఆకట్టుకున్నాయి. కొండలు, గుట్టలు, పర్వతాలను అధిరోహించే ఈ యుద్ధ ట్యాంకర్లు ఎందుకు మల్కాపూర్ చెరువులో దిగాయి. ఇక్కడి నీటిలో ఎందుకు చక్కర్లు కొట్టాయో తెలుసుకుందాం..సంగారెడ్డి జిల్లాలోని ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో యుద్ధ ట్యాంకర్లను తయారు చేస్తున్నారు. ఇక్కడ నుంచే వీటిని భారత సైన్యానికి అందిస్తుంటారు. ఇవి దేశం నలుమూలల భారత సైనిక దళాల్లో చేరి విధులు నిర్వహిసుంటాయి. అలాంటి ట్యాంకర్లు కఠినమైన మైదానంలోనే కాకుండా.. నీటిలోనూ ప్రయాణం సాగించేందుకు వీలుగా రూపొందించారు. యుద్ధక్షేత్రాల్లో ఎక్కడైనా కాలువలు, నదులు ఎదురైతే ఆ అడ్డంకులను సులువుగా అధిగమించేలా వీటిని డిజైన్ చేశారు.ఈ కారణంగానే యుద్ధ ట్యాంకర్లను మల్కాపూర్ లోని మైదాన ప్రాంతాలతో పాటు ఇక్కడి చెరువులోనూ ట్రైయల్ రన్ నిర్వహించారు. నీటిలో ప్రయాణించేటప్పుడు ఇవి ఏ తీరుగా పనిచేస్తున్నాయో శాస్త్రవేత్తల బృందం పరీక్షించింది. ఈ సమయంలో యుద్ధ ట్యాంకర్లు, వాటి విన్యాసాలను వీక్షించేందుకు స్థానిక ప్రజలు గుమ్మిగుడారు. వీటి విన్యాసాలు ప్రయాణాన్ని చూసి స్థానికులు ఆశ్చర్యపడ్డారు.ఎద్దుమైలాపూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారైన ఈ యుద్ధ ట్యాంకర్.. ఒక్కొక్కటి 14.5 టన్నుల బరువుతో రూపొందించారు. ఈ ట్యాంకర్ పై ఒకేసారి పదిమంది ప్రయాణం చేసే అవకాశం ఉంది. నేల మీదే కాకుండా నీటిలో ప్రయాణించే సమయంలోనూ ఈ ట్యాంకర్ పై పదిమంది ప్రయాణించవచ్చని చెబుతున్నారు. ట్రయల్ రన్ సమయంలోను ట్యాంకర్ పై పదిమంది కూర్చుని చెరువులో ప్రయాణించారు.ఇప్పటికే పెద్ద ఎత్తున ఈ తరహా యుద్ధ ట్యాంకుల్ని ఉత్పత్తి చేస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ.. దాదాపు 3500 ట్యాంకర్లను భారత సైన్యానికి అందించింది. మరిన్ని ట్యాంకర్లను రూపొందిస్తూ సైనిక దళాలను పటిష్టం చేయడంలో విరామం లేకుండా కృషి చేస్తోంది ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ. ఇక్కడ తయారవుతున్న యుద్ధ ట్యాంకర్లను అనేక పరిస్థితుల్లో, వివిధ ప్రాంతాల్లో పరీక్షిస్తూ.. వాటి సామర్థ్యాలను పరిశీలిస్తుంటారు. వాటిలో ఏమైనా లోటుపాట్లుంటే.. సరిచేసి అప్ గ్రేట్ చేస్తుంటారు. అందుకే ఇక్కడ నిర్వహించిన ట్రయల్ రన్ లకు ప్రత్యేకత ఉంటుంది. పైగా.. ఈ ట్యాంకర్లు యుద్ధ క్షేత్రాల్లో కీలక భూమిక పోషిస్తుంటాయి కాబట్టి.. ఇలాంటి వెహికిల్స్ ఎంత సమర్థవంతంగా, అత్యాధునికంగా ఉంటే మన సైనిక దళాలు అంత పటిష్టంగా ఉంటాయి.ప్రస్తుతం మల్కాపూర్ చెరువులో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ట్యాంకర్లను.. ఇన్ఫాంట్రీ వెహికల్స్ గా పిలుస్తారని ఆర్టినెన్స్ ఫ్యాక్టరీ అధికారులు వెల్లడించారు. వీటిని యుద్ధ క్షేత్రాల్లో ప్రత్యర్థుల పోస్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత సైనికులను, ఇతర సామాగ్రిని వేగంగా తరలించేందుకు వినియోగిస్తారని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని ఫ్యాక్టరీ నుంచి వేలాది ట్యాంకర్లను, వివిధ వేరియంట్లల్లో తయారు చేస్తుండగా.. ప్రస్తుతం పరీక్షలు జరుపుకున్న వాటిలో 7 రకాలున్నట్లు పేర్కొన్నారు. వాటిలోఒకదాన్ని ప్రస్తుత ట్రయల్ రన్ లో వినియోగించినట్లు తెలిపారు.

## గోవాకు తగ్గుతున్న పర్యాటకం

**పానాజీ :** భారత్ ఎన్నో అందమైన ప్రదేశాలకు, సహజ సిద్ధమైన అందాలకు నిలయం. ప్రకృతి ప్రేమికులను ఆకర్షించే దట్టమైన అడవులు ఉన్నాయి. చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక క్షేత్రాలకు అయితే కొదవ లేదు. ఇక బీచ్‌లు దేశంలో అనేకం ఉన్నాయి. అయితే గోవా బీచ్‌లు ఇక్కడ చాలా ప్రత్యేకం. ఇక్కడికి దేశంతోపాటు విదేశాల నుంచి కూడా టూరిస్టులు వస్తుంటారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి టూరిసమే ప్రధాన ఆదాయ వనరుగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా టూరిజం అభివృద్ధికి, పర్యాటకుల రక్షణకు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. దీంతో విదేశీ పర్యాటకులను కూడా గోవా ఆకర్షిస్తోంది. ఏటా లక్షల మంది ఇక్కడి బీచ్‌లకు వస్తుంటారు. అయితే ఇటీవల గోవాకు వచ్చే పర్యాటకులు తగ్గుతున్నారు. దేశీయ పర్యాటకులతోపాటు విదేశీ పర్యాటకుల సంఖ్య తగ్గుతోంది.గోవా రాష్ట్రానికి వచ్చే పర్యాటకులు ఐదేళ్లుగా తగ్గిపోతున్నారు. 2019లో గోవాకు రికార్డుస్థాయిలో 85 లక్ష మంది వచ్చారు. 2023 నాటికి ఆ సంఖ్య 15 లక్షలకు పడిపోయింది. ఈ లెక్క ప్రకారం 75 శాతానికిపైగా టూరిస్టులు తగ్గిపోయారు. కరోనా కారణంగా 2020లో కేవలం 2 లక్షల మంది, 2021లో 5 లక్షల మంది, 2022లో 12 లక్షల మంది మాత్రమే వచ్చారు. రష్యా, బ్రిటన్ నుంచి ఎక్కువగా టూరిస్టులు వచ్చేవారు. వారంతా ఇప్పుడు శ్రీలంకకు వెళ్తున్నారు.ఇక భారతీయ టూరిస్టులు ఎక్కువగా థాయ్‌లాండ్, మలేషియా వెళ్తున్నారు. దేశంలోని పర్యాటక ప్రదేశాలను చూడడం కన్నా ఫారిన్ వెళ్లడం మేలని భావిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. విమాన చార్జీలు తక్కువగా ఉండడం, వివిధ సంస్థలు ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తుండడం, గోవా వెళ్లే అయ్యే ఖర్చులతో పోలిస్తే.. విదేశీలకు వెళ్లే అయ్యే ఖర్చు దాదాపు సమానంగా ఉండడంతో చాలా మంది, ముఖ్యంగా యువత ఫారిన్ ట్రిప్‌కే మొగ్గుచూపుతున్నారు.ఇక ఏటా గోవాకు వచ్చే ఫారిన్ టూరిస్టులు కూడా తగ్గిపోతున్నారు. థాయ్‌లాండ్, శ్రీలంక, మలేషియా, మాల్దీవులు టూరిస్టులను ఆకట్టుకుంటున్నాయి. ఇక కొన్ని దేశాల్లో ఖర్చు తక్కువగా ఉండడం కూడా విదేశాలకు వెళ్లేందుకు కారణంగా పరిశీలకులు చెబుతున్నారు.ఇక గోవాలో టాక్సీ మాఫియా విదేశీ టూరిస్టులను ఇబ్బంది పెడుతోంది. గతంలోనూ వెలుగు చూశాయి.వాటికారణంగా టూరిజం ఇమేజ్ దెబ్బతింటోంది. ఇక గోవాలో అసౌకర్యాలు, గోవా టూరిస్టు డెస్టినేషన్‌గా ఎంచుకోవడానికి ఫారిన్ టూరిస్టులు వెనుకాడుతున్నారు. ఐదేళ్లుగా పర్యాటకుల సంఖ్య తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇక థాయ్‌లాండ్, వియత్నాం, ఇండోనేషియాతో పోలిస్తే మన గోవాలో సౌకర్యాలు తక్కువగా ఉన్నాయి. దీంతో తెలుగు టూరిస్టులు కూడా గోవాకు వెళ్లకుండా ఫారిన్ ట్రిప్ వేస్తున్నారు. హోటల్ సదుపాయాలు, రవాణా, ఇతర టూరిస్టుల భద్రత విషయంలో గోవాకన్నా చురుగ్గా ఉన్నాయి.

## నాగబాబు మంత్రి పదవికి స్మాల్ బ్రేక్

**ఏలూరు :** ఆలస్యం అమృతం విషం అంటారు. కొన్ని విషయాల్లో వెనువెంటనే పరిణామాలు జరిగితేనే సత్ఫలితాలు ఇస్తాయి. ఆలస్యం అయితే అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతాయి. ఇప్పుడు మెగా బ్రదర్ నాగబాబు విషయంలో అదే జరుగుతోందన్న అనుమానం ఉంది.ఏపీలో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతోంది. అదే సమయంలో వైసీపీ పోరుబాట పట్టింది. ప్రభుత్వ వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్త నిరసనకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. సరిగ్గా ఇదే సమయంలో రాష్ట్ర క్యాబినెట్లోకి మెగా బ్రదర్ నాగబాబును తీసుకుంటున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. అయితే దీనిపై కూటమిలోనే భిన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. విపక్షంలో ఉన్నప్పుడు కుటుంబ రాజకీయాలపై ఎక్కువగా మాట్లాడారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు ఒకే కుటుంబానికి అన్ని పదవులా అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఇంతవరకు నాగబాబు కు మంత్రి పదవి అన్న విషయంలో పవన్ కళ్యాణ్ స్పందించలేదు. దీంతో రకరకాల అనుమానాలు ప్రారంభం అయ్యాయి. సోషల్ మీడియాలో సైతం దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. అవి రకరకాల సందేహాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా దీనిని వైసిపి ప్రచారాస్త్రంగా మార్చుకుంటుంది.నారా కుటుంబానికి ఎన్ని పదవులు ఉన్నాయి . రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నారు. మంత్రిగా నారా లోకేష్ ఉన్నారు. మరోవైపు మెగా కుటుంబం నుంచి డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఇప్పుడు మంత్రిగా మెగా బ్రదర్ నాగబాబును తెస్తే.. రెండు కుటుంబాలే ప్రభుత్వాన్ని పంచుకుంటున్నాయి అన్న విమర్శ రాక మానదు. ఇప్పటికే వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వాన్ని మల్టీ స్టార్ గవర్నమెంట్ గా చెబుతున్నారు. అయితే ప్రభుత్వంలో నారా తో పాటు కొణిదల కుటుంబానికి ప్రాధాన్యం దక్కుతోంది. కానీ నందమూరి కుటుంబానికి చాన్స్ లేకుండా పోయిందన్న విమర్శ ఉంది.ఇంకోవైపు జనసేనలో సైతం మరోరకమైన విమర్శ ఉంది. జనసేన ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. మూడు మంత్రి పదవులను సొంతం చేసుకుంది. అయితే మంత్రులు ముగ్గురు అగ్రకులాలకు చెందిన వారే. అందులో ఇద్దరు కాపు సామాజిక వర్గానికి చెందినవారు.

మిగతా ఒకరు కమ్మ సామాజిక వర్గం. దీంతో బీసీలకు కనీస ప్రాతినిధ్యం లేకుండా పోయింది అన్న విమర్శ ఉంది. ఇప్పుడు జనసేనకు లభిస్తున్న ఆ ఒక్క మంత్రి పదవి బీసీలకు ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం పార్టీ నుంచి వ్యక్తం అవుతోంది. ఈ పరిణామాల నడుమ నాగబాబు మంత్రి కావడం అనుమానంగా కనిపిస్తోంది. అయితే దీనిపై స్పష్టత సీఎం చంద్రబాబు ప్రకటించిన తర్వాత ఈ విషయంలో వెనక్కి తగ్గే పరిస్థితి లేదని తెలుస్తోంది. కానీ ఒక రకమైన అనుమానం మాత్రం వెంటాడుతోంది.

## జైలు వెనుక గేటునుంచి బయటకు వచ్చిన బన్నీ

**హైదరాబాద్** చంచల్గూడ జైలు నుంచి అల్లు అర్జున్ విడుదల అయ్యారు. చంచల్గూడ జైలు వెనుక గేటు నుంచి అల్లు అర్జున్‌ను అధికారులు పంపించారు. ఎస్కార్ట్ వాహనం ద్వారా నివాసానికి అల్లు అర్జున్‌ను పంపించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో శుక్రవారం అల్లు అర్జున్ అరెస్టు అయ్యారు. అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. అనంతరం తెలంగాణ హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. మధ్యంతర బెయిల్ వచ్చినా రాత్రంతా జైలులోనే అల్లు అర్జున్ ఉన్నారు. ప్రక్రియ ఆలస్యం కావడంతో ఇవాళ విడుదలయ్యా రు. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో 18 మందిని నిందితులుగా చేర్చగా, ఇందులో ఏ11గా అల్లు అర్జున్ ఉన్నారు.జైలు నుంచి విడు దలైన అనంతరం అల్లు అర్జున్ నేరుగా గీతా ఆర్ట్స్ కార్యాలయానికి వెళ్లారు. గీతా ఆర్ట్స్ కార్యాలయం నుంచి ఇంటికి బయల్దేరారు. సుమా రు గంటకు పైగా గీతా ఆర్ట్స్ కార్యా లయంలోనే ఉన్నారు. 45 నిమిషా లపాటు న్యాయవాదుల బృందంతో చర్చలు జరిపారు. తరువాత అభి మానులకు అభివాదం చేసుకుంటూ వాహనం ఎక్కారు. అక్కడ నుంచి జూబ్లీహిల్స్‌లోని నివాసానికి చేరుకున్నారు.

## ఆ ఇద్దరికి నో ఎంట్రీ బోర్డు

**మహబూబ్ నగర్ :** పదేళ్లపాటు ఏకచత్రాధిపత్యంగా పాలించిన బీఆర్‌ఎస్‌కి ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఓటర్లు కోలుకోలేని షాక్ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఆ పార్టీ కేవలం రెండు సీట్లకే పరిమితం అయ్యింది. కేవలం గద్వాల, ఆలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే గులాబీ జెండా ఎగిరి జిల్లాలో పరువు దక్కించుకుంది. గద్వాల నుండి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ నుంచి అనూహ్యంగా బరిలో నిలిచిన విజయుడు విజయం సాధించారు.అయితే గెలిచిన తర్వాత గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో జిల్లా బీఆర్‌ఎస్‌లో ఒకే ఒక్కడుగా విజయుడు మిగిలిపోయారు. ఇక ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిచిన చల్ల వెంకట్రామిరెడ్డి సైతం బీఆర్‌ఎస్లోనే ఉండిపోయాడు. మిగిలిపోయిన ఈ ఇద్దరు కూడా ముహూర్తం చూసుకుని కాంగ్రెస్‌లోకి మారుతారన్న ప్రచారం జరిగింది. ముహూర్తం కుదరలేదో? మరే ఇతర కారణాలో తెలియదు కానీ వారి పార్టీ మార్పు వ్యవహారం అక్కడితో ఆగిపోయిందిగడచిన అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సంపత్ కుమార్‌కు ఓటమి తప్పలేదు. తన అనుచరుడైన విజయుడుని అనూహ్యంగా బరిలో ఉంచి సంపత్ కుమార్ ఓటమికి కారణమయ్యారు చల్ల వెంకట్రామిరెడ్డి. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయన గెలిపించుకున్న అభ్యర్థి డమ్మీగా ఉండిపోవాల్సి వస్తుందంట. తాను ఎమ్మెల్సీగా ఉండి తన అనుచరుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో తమకు సరైన గుర్తింపు లేదని వెంకటరామిరెడ్డి మధనపడుతున్నారంటఆలంపూర్ ఎన్నికలలో పోటీ చేసి ఓటమిపాలైన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తన ఓటమికి ప్రధాన బాధ్యుడు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రా మిరెడ్డి అని ఆగ్రహంతో ఉన్నారంట.. అందుకే వారిద్దరినీ కాంగ్రెస్‌లో చేర్చుకోకుండా అడ్డం పడుతున్నారంట. ఈ క్రమంలో నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఇతరాత్ర వ్యవహారాలకు సంబంధించి సంపత్‌కుమార్ పెత్తనమే నడుస్తుంది. నియోజకవర్గం యాంత్రాంగం మొత్తం సంపత్‌కుమారే ఎమ్మెల్యే అన్నట్లు వ్యవహరిస్తుంది.అయినప్పటికీ ఏదో రకంగా కాంగ్రెస్‌లో చేరడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రయత్నాలు చేసి విఫలం అయ్యారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు తమ పార్టీకి ఎమ్మెల్యే లేడు అన్న లోటు తెలియకుండా అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటుండగా.. బీఆర్ఎస్ శ్రేణులు తమ పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ.. ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఆ క్రమంలో కొంతకాలంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మౌనంగా ఉండి పోవడంతో నియోజకవర్గ ప్రజలు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అదలా ఉంటే ఇద్దరిలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్లో చేరిపోగా మిగిలిన ఎమ్మెల్యే విజయుడికి అవకాశం లేకుండా పోవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ డోర్లు తెరుచుకోకపోవడంతో ఎమ్మెల్యే విజయుడు తప్పని పరిస్థితులలో బీఆర్‌ఎస్‌లో చురుగ్గా వ్యవహరించాలని చూస్తున్న కేడర్ సహకరించడం లేదంట.. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాత్రం ఇప్పటికీ నియోజకవర్గం వైపు తొంగి చూడడం లేదు. ఎన్నికలలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలయ్యే పరిస్థితి లేకపోవడంతో.. స్థానిక సంస్థల ఎన్నికలలో అలంపూర్ నియోజకవర్గంలో గులాబీ పార్టీకి ప్రతికూల ఫలితాలు తప్పవన్న ప్రచారం సాగుతోంది

## సెకండ్ ఇన్నింగ్స్‌కు రెడీ అవుతున్న రోజా..

**చెన్నై :** తెలుగు రాజకీయాల్లో నగరి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆర్కే రోజా అంటే ఫైర్.. ఫైర్ అంటే రోజా అన్నట్లు వ్యవహరించారు. ప్రత్యర్థులపై ఆమె చేసే విమర్శలు అంత ఘాటుగా ఉంటాయి. ఏ అంశంలోనైనా ప్రత్యర్థుల్ని ఏకిపారేయడం రోజా స్టైల్. నగరి నుంచి వరుసగా రెండుసార్లు గెలిచిన రోజా ఆ నియోజకవర్గం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గాలి భాను చేతిలో ఘోర ఓటమిని మూటగట్టుకున్నారు.మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో రోజా భర్త, సోదరుల పెత్తనం పెరిగిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తినా ఆమె పట్టించుకోలేదు. చంద్రబాబు, లోకేష్, పవన్ లపై మితిమీరిన విమర్శలు, సొంత పార్టీలో వ్యతిరేక కుంపటి, మంత్రి అయ్యాక హంగు ఆర్భాటం, విలాసవంతమైన జీవితం, విదేశీ ప్రయాణాలు.. ఇవే రోజాకు ప్రస్తుతం శాపాలుగా మారాయి. ఆ ప్రభావంతో గత ఎన్నికలలో సూమారు 45 వేల ఓట్లతో ఓడిపోయారు. ఎన్నికల ఫలితాల తరువాత ఏపీఐసీసీ చైర్మన్ గా, మంత్రిగా రోజాల చేసిన అక్రమాలతో పాటు, నియోజకవర్గం జరిగినా అవినీతిపై విచారణ కోరుతూ పెద్ద ఎత్తున కూటమి నేతలు సిఐడి కు ఫిర్యాదు చేశారు.ఆ క్రమంలో ఆడుదాం ఆంధ్ర, నగరిలో భూ అక్రమాలు, టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇంటి స్థలాలకు సంబంధించి కోట్ల రూపాయల అవినీతిపై సీఐడీ లోతుగా విచారణ జరుపుతుందట. ఆ ప్రభావంతో ఎన్నికల తరువాత అప్పుడప్పుడు తిరుపతి జిల్లాలో తళుక్కుమన్న రోజా గత కొంత కాలంగా అసలు ఇటు వైపు చూడటమే మానేశారు. ఆమె చెన్నై, హైదరాబాదుల్లోనే ఎక్కువగా ఉంటున్నారు.సీఐడీ విచారణలతో రాజకీయంగా ఇబ్బందులు తప్పదని ఫిక్స్ అయిన అమె ఇప్పుడు రూట్ మార్చినట్లు టాక్ నడిస్తోంది.రోజా ఓడిపోయాక గతంలోలా పెద్దగా వాయిస్ వినిపించడం లేదు. అప్పుడప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఎక్స్ వేదికగా మాత్రమే పోస్టులు పెడుతూ ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆ క్రమంలో రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి సంబంధించి రోజా పెట్టిన ట్వీట్‌పై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఘాటుగా స్పందించారు. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుంది మీ యవ్వారం. ముందు ఆ ప్యాలెస్‌కు.. మీ బెంజ్ కారుకు ఉన్న సంబంధం ఏంటో బయట పెట్టండని భాను నిలదీయడం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది.రోజా బెంజికారు ఎపిసోడ్ వైరల్‌గా మారడంతో .. లేనిపోని తలనొప్పులు ఎందుకని రోజా ట్వీట్ లు పెట్టడం కూడా తగ్గించేశారు. పార్టీ ఆదేశిస్తే తప్ప తనుకు తానుగా బయటకు వచ్చి స్పందించడం మానేశారు. ట్వీట్లు సైతం పార్టీ పంపితే పెడుతూ సైలెంట్ గా ఉంటున్నారంట. ఈమధ్య షర్మిల సైతం రోజా పెడుతున్న పోస్టులు అమెవీ కాదని వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న పనే అని ఆరోపించారు.ఏదేమైనా మున్ముందు దూకుడుగా వెళితే ఇబ్బందులు అని తెలిసే రోజా మౌనంగా ఉంటున్నారనే టాక్ వైసీపీలో నడుస్తోంది. అందుకే పొలిటికల్ హీట్ నుండి తప్పించుకోవడానికి సినిమాల వైపు చూస్తున్నారట రోజా.. తాను క్యారెక్టర్ రోల్స్ చేయడానికి రెడీ అంటూ తన టీమ్ ద్వారా టాలీవుడ్‌లోని పలువురు దర్శకులకు, తమిళ సినిమా నిర్మాతలకు సంకేతాలు పంపిస్తున్నారంట. నిజానికి రాజకీయాల వల్ల సినిమాలకి గుడ్ బై చెప్పారు కానీ ఒకప్పుడు క్యారెక్టర్ రోల్స్‌తో టాలీవుడ్‌లో, టీవీ షోల్లో రోజా బిజీగానే ఉన్నారు. 2013లో ఆమె టాలీవుడ్‌కి గుడ్‌బై చెప్పారు. అప్పటి నుండి ఫుల్ టైమ్ రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. కానీ బుల్లితెరపై జబర్దస్త్, ఎక్స్‌ట్రా జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి షోలు, పలు ఫెస్టివల్ ఈవెంట్స్‌లో మాత్రం పాల్గొంటూ వచ్చారు .. మంత్రి పదవి వచ్చిన తర్వాత బుల్లితెరకి కూడా బైబై చెప్పేశారు. అయితే ఇటీవల జబర్దస్త్ కాకుండా ఎదైనా షోలో అవకాశం ఇస్తే చేస్తానని ఆమె ప్రకటించారు. మొన్నీమధ్య కేసీఆర్ అనే సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కి గెస్ట్‌గా రావడం, పుష్ప సినిమాను అద్భుతంగా ఉందంటూ పొగడటం లాంటివి స్క్రీన్‌పై రీఎంట్రీ ఇవ్వడానికే అంటున్నారు.అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అమెకు అవకాశాలు ఎంత ఎవరకు వస్తాయో అనేది డౌటే అన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. డిప్యూటీ సిఎంగా పవన్ ఉండటం, తాజాగా నాగబాబుకు మంత్రి గా అవకాశం రావడంతో.. చిరంజీవి నుండి పవన్ వరకు అందరి పైన తీవ్రస్థాయి విమర్శలు చేసిన రోజాకు సినిమా ఇండస్ట్రీ నుంచి ఏ మేరకు మద్దతు లభిస్తుంది అన్నది అనుమానంగానే మారింది .. మరి టాలీవుడ్‌లో తిరిగి మేకప్ వేసుకోవాలనుకుంటున్న రోజా కోరిక తీరకపోతే.. ఆమె తమిళ ఇండస్ట్రీకి షిఫ్ట్ అయిపోతారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

### భారత దేశపు ఉక్కు మనిషి


## సర్దార్ వల్లభ్ భాయి పటేల్

**- నేడు ఆయన వర్ధంతి**



భారత దేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయి పటేల్ జవేరిభాయ్, లాడ్ బాయి దంపతులకు 1875, అక్టోబరు 31న గుజరాత్‌లోని నాడియార్‌లో జన్మించాడు. ఇతను ప్రముఖ స్వాతంత్ర యోధుడు మాత్రమే కాదు, స్వాతంత్రానంతరం సంస్థానాలు భారతదేశములో విలీనం కావడానికి గట్టి కృషిచేసి సఫలుడైన ప్రముఖుడు. హైదరాబాదు, జునాగఢ్ లాంటి సంస్థానాలు భారతదేశము లో విలీనం చేసిన ఘనత ఇతనికే దక్కుతుంది. ఇంగ్లాండులో బారిష్టరు పట్టా పుచ్చుకొని స్వదేశానికి తిరిగివచ్చి దేశంలో జరుగుతున్న జాతీయోధ్యమానికి ఆకర్షితుడై బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మహాత్మాగాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకున్నాడు. బార్డోలిలో జరిగిన సత్యాగ్రహానికి నాయకత్వం వహించి విజయవంతం చేయడమే కాకుండా తాను దేశప్రజల దృష్టిని ఆకర్షించాడు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలోనే కాకుండా దేశప్రజల సంక్షేమం కోసం అనేక సాంఘిక ఉద్యమాలను చేపట్టాడు. 1931లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించాడు. భారత రాజ్యాంగం రచనలో ప్రముఖ పాత్ర వహించాడు. రాజ్యాంగ రచనలో అతిముఖ్యమైన ప్రాథమిక హక్కుల కమిటీకి చైర్మెన్‌గా వ్యవహరించాడు. స్వాతంత్రానంతరం జవహర్ లాల్ నెహ్రూ మంత్రిమండలిలో హోంమంత్రి గాను, ఉప ప్రధానమంత్రి గాను బాధ్యతలను నిర్వహించాడు. దేశవిభజన అనంతరం అనేక ప్రాంతాలలో జరిగిన అల్లర్లను చాకచక్యంతో అణచివేశాడు. నెహ్రూ మంత్రిమండలిలో ఉన్ననూ అనేక విషయాలలో నెహ్రూతో విభేధించాడు. నెహ్రూ శాంతికాముకతను కాదని అనేక పర్యాయాలు బలప్రయోగం చేపట్టి సఫలుడైనాడు. కేవలం 40 మాసాలు మాత్రమే పదవిలో ఉన్ననూ అనేక దేశ సమస్యలను తనదైన పద్ధతితో పరిష్కరించి 1950 డిసెంబరు 15న మరణించాడు. మరణించిన 4 దశాబ్దాల అనంతరం 1991లో భారత ప్రభుత్వం భారతరత్న బిరుదాన్ని ఇచ్చి గౌరవించింది.

## నేడు అంతర్జాతీయ చాయ్ దినోత్సవం




అంతర్జాతీయ చాయ్ దినోత్సవం (అంతర్జాతీయ తేనీటి దినోత్సవం) ప్రతి ఏట డిసెంబర్ 15న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. తేనీరుపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఈ దినోత్సవం ఏర్పాటుచేయబడింది. టీ మొట్టమొదటిసారిగా చైనాలో తయారుచేశారు. 4వ శతాబ్దంలో ఒక చైనాకు చెందిన వైద్యుడు తేయాకు ఆకులను ఎండబెట్టి వేడిచేసి, వేడి నీటిలో నానబెట్టగా వచ్చిన చేదు డికాక్షను వైద్యపరీక్ష కోసం త్రాగాడు. ఆ డికాక్షను త్రాగినందువల్ల అతడు ఉత్తేజాన్ని పొందాడు. అలా 15 శతాబ్దంలో నాగరిక ప్రపంచానికి టీ పరిచయం అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా తేయాకు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న దేశాలు టీ ప్రాధాన్యాన్ని పెంచేందుకు అంతర్జాతీయ సదస్సులను నిర్వహించాయి. ప్రతి సంవత్సరం డిసెంబరు 15న అంతర్జాతీయ చాయ్ దినోత్సవం జరుపుకుంటారు. మొదటి అంతర్జాతీయ చాయ్ దినోత్సవం 2005, డిసెంబరు 15న న్యూఢిల్లీలో జరిగింది.రెండవ అంతర్జాతీయ దినోత్సవం 2006, డిసెంబరు 15న శ్రీలంకలో జరిగింది. టీ ఉత్పత్తి చేస్తున్న భారతదేశం, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, ఇండోనేషియా, కెన్యా, మలావి, మలేషియా, ఉగాండా, టాంజానియా వంటి దేశాలలో 2005 నుండి ఈ దినోత్సవం జరుపుకుంటారు

# రేవంత్ ధైర్యం ఏమిటీ

**హైదరాబాద్ :** అల్లు అర్జున్ అరెస్టు పై జరుగుతున్న చర్చ రెండు తెలుగు రాష్ట్రాలలో రాజకీయంగా సంచలనం సృష్టిస్తోంది. అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారాన్ని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఖండించారు. ట్విట్టర్ వేదికగా రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శించారు.అల్లు అర్జున్ అరెస్టుకు సంబంధించి.. తన ప్రమేయం ఏ మాత్రం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని వివరించారు. పుష్ప సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి హైదరాబాద్లోని ఆర్టీసీ ఎక్స్ రోడ్డు సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోయిందని.. ఆమె కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకే పోలీసులు చర్యలు తీసుకున్నారని.. అరెస్ట్ కంటే ముందు అల్లు అర్జున్ కు పోలీసులు నోటీసులు జారీ చేశారని రేవంత్ వివరించారు. ఆ తర్వాత రేవంత్ అంతటితోనే ఆగలేదు. ఢిల్లీలో విలేకరులతో జరిగిన చిట్ చాట్ లో సంచలన వ్యాఖ్యలు చేశారు. " ఆయన ఏమైనా సరిహద్దుల్లో యుద్ధం చేశాడా? నాలుగు సినిమాలు చేశాడు.. అందులో పెట్టుబడి పెట్టాడు.. అంతకంటే ఎక్కువ పైసలు సంపాదించాడు. ఇవాళ ఏదో ఆయన అరెస్టు ను రకరకాలుగా చిత్రీకరించడం సరికాదని" రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో ఒక్కసారిగా మీడియాలో సంచలనం నమోదయింది. మీడియా కూడా అల్లు అర్జున్ అరెస్ట్ విషయాన్ని పక్కనపెట్టి.. అతడికి బెయిల్ వచ్చిన విషయాన్ని ప్రస్తావించడం మానేసి.. రేవంత్ చేసిన వ్యాఖ్యలకే ప్రాధాన్యం ఇవ్వడం మొదలు పెట్టింది. మొదట్లో చట్టం తన పని తాను చేసుకుపోతుంది అని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఆ తర్వాత అతడేమైనా సరిహద్దులో యుద్ధం చేసిన సైనికుడా? అని వ్యాఖ్యానించడంతో అల్లు అర్జున్ అరెస్టు వెనుక ఎవరు ఉన్నారో తెలిసిపోయింది. వాస్తవానికి రేవంత్ రెడ్డి ఇటీవల నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేత విషయంలో కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేయలేదు. కానీ అల్లు అర్జున్ విషయంలో మాత్రం మొహమాటం లేకుండా చెప్పేశారు. ఓ ఆంగ్ల న్యూస్ ఛానల్ చేసిన ఇంటర్వ్యూలోనూ రేవంత్ దూకుడుగానే మాట్లాడారు. అల్లు అర్జున్ అరెస్టుపై మొహమాటం లేకుండా స్పందించారు. ఏమైనా ఇండియా, పాకిస్తాన్ బోర్డర్ లో నిల్చొని యుద్ధం చేశాడా?, అతను కేవలం ఒక సినిమా హీరో. ఈ దేశం లో సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ లాంటి సూపర్ స్టార్స్ అరెస్ట్ అవ్వలేదా?, పుష్ప 2 చిత్రానికి నిర్మాతలు కోరిన వెంటనే మేము బెనిఫిట్ షోస్ కి అనుమతిని ఇచ్చాము. సరైన ప్రోటోకాల్స్ లేకుండా ఆయన థియేటర్ కి వచ్చాడు. కారెక్కి నమస్కారం చేస్తూ ర్యాలీ కూడా చేసాడు. అలా చేయడం వల్లనే అక్కడ పరిస్థితులు అదుపు తప్పాయి. అతని కారణంగా ఒక మహిళ చనిపోయింది. ఒక పసి బిడ్డ చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. దీనిని మేము తేలికగా వదిలేయాలా?, దీనిపై మేము కేసు పెట్టి చర్యలు తీసుకోకపోయితే , జనాలు పెట్టలేదని మమ్మల్ని అడగరా?, తప్పు ఎవరు చేసినా తప్పే చట్టానికి ఎవ్వరూ అతీతులు కారు' అంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.'అల్లు అర్జున్ సైలెంట్ గా వచ్చి సినిమా చూసి వెళ్లిపోకుండా, కారు ఎక్కి చాలా హంగామా సృష్టించాడు. జనాలు ఎక్కువ ఉన్న చోట ఒక సెలబ్రిటీ వస్తే ఎలా ఉంటుందో అతనికి ఆ మాత్రం తెలియదా?, పోలీసులు వద్దని చెప్తున్నా కూడా లెక్క చేయకుండా ప్రోటోకాల్స్ ని ధిక్కరిస్తే ఏమి చెయ్యాలో మీరే చెప్పండి. అతనికి స్పెషల్ షో చూడాలని అనిపిస్తే ఇంట్లో హోమ్ థియేటర్ ఉంది , లక్షణంగా చూసుకోవచ్చు కదా, ఇలా లేనిపోని హంగామా సృష్టించడం ఎందుకు' అంటూ ఆయన సూటి ప్రశ్నలు వేసాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యింది. అల్లు అర్జున్ తీరుని తప్పు పెట్టేవాళ్ళు కొందరుంటే, మరి కొందరు మాత్రం ఆయనని సమర్థిస్తున్నారు. " ఒక సినీ నటుడు తన సినిమాను ఇంట్లో చూసుకోవచ్చు. లేకుంటే హోమ్ థియేటర్లో చూసుకోవచ్చు. అంతేగాని అంతమంది జనం వచ్చినచోటకు కార్లో చేయి ఊపుతూ రావడం వల్ల జనం భారీగా వచ్చారు. ఆ సమయంలో వారందరినీ కంట్రోల్ చేయడం పోలీసుల వల్ల కాలేదు. అందువల్లే తొక్కిసలాట జరిగింది. ఫలితంగా ఓ భర్త తన భార్యను కోల్పోవాల్సి వచ్చింది. తన కుమారుడిని కాపాడుకునేందుకు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఇంతకంటే దారుణం ఏముంటుందని" రేవంత్ వ్యాఖ్యానించారు.రేవంత్ రెడ్డి కి సహజంగానే దూకుడు ఉంటుంది. ఆ దూకుడు వల్లే ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. నాటి అధికార భారత రాష్ట్ర సమితిని ఎక్కడికక్కడ ఎండగట్టారు. 2018 ఎన్నికల్లో కొడంగల్ అసెంబ్లీ స్థానంలో ఆయనను కావాలని ఓడించినప్పటికీ.. మల్కాజ్ గిరి స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత పిసిసి అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీలో జవసత్వాలు నింపారు. ఏకంగా అధికారంలోకి తీసుకొచ్చారు.. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి.. ఏడాది పాటు తన పరిపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి తన దూకుడు తగ్గించుకోవడం లేదు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇదే సమయంలో కొన్ని విషయాలలోనూ సానుకూల ధోరణి కంటే మరింత దూకుడు తనాన్ని ప్రదర్శిస్తున్నారు . దీనిని కొంతమంది వ్యతిరేకిస్తున్నప్పటికీ.. రేవంత్ తన ధోరణి మార్చుకోవడం లేదు. పైగా సై అన్నట్టుగా పోటీకి సంకేతాలు ఇస్తున్నారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్ విషయంలోనూ రేవంత్ కాస్త నెమ్మదిగా ఉన్నప్పటికీ.. అల్లు అర్జున్ విషయంలో మాత్రం తగ్గేదే లేదు అన్నట్టుగా దూకుడు తత్వాన్ని కొనసాగించారు. రేవంత్ వ్యవహార శైలిని భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా తప్పు పడుతుండగా.. కాంగ్రెస్ పార్టీ మాత్రం గట్టిగానే సమాధానం ఇస్తోంది. శుక్రవారం ఉదయం నుంచి రెండు పార్టీల సోషల్ మీడియా విభాగాల మధ్య ఏకంగా యుద్ధమే జరుగుతున్నది.

**లాయర్ ఫీజు గంటకు 5 లక్షలు :** రిన వేళ.. ఆయనకు బెయిల్ మంజూరు చేసేందుకు వాదనలు వినిపించిన లాయర్ ఎవరు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అల్లు అర్జున్ క్వాష్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదించిన లాయర్ సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి గురించి ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే అసలు ఈ లాయర్ నిరంజన్ రెడ్డి ఎవరు. ఆయన ఇంతకుముందు ఎలాంటి కేసులు వాదించారు. ఆయన గంటకు ఎంత ఫీజు వసూలు చేస్తారు. లాయర్ వృత్తి మాత్రమే కాకుండా ఆయన ఇంకా ఏమేం చేస్తారు అనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారింది.ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్, ఆ వెంటనే మధ్యంతర బెయిల్ మంజూరు కావడం.. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. అల్లు అర్జున్ అరెస్ట్ సరికాదంటూ సినీ, ఇతర రంగాల ప్రముఖులు ప్రకటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్‌కు బెయిల్ రావడం వెనుక లాయర్ సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి పాత్ర ఎంతో ఉంది. బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ "రయీస్" సినిమా ప్రమోషన్లలో భాగంగా జరిగిన తొక్కిసలాట ఘటనను గుర్తు చేసిన లాయర్ నిరంజన్ రెడ్డి.. అల్లు అర్జున్‌కు కోర్టు బెయిల్ ఇవ్వడంలో కీలక వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలోనే అసలు ఈ సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి ఎవరు అనేది ఇప్పుడు చర్చ జరుగుతోంది.సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి లాయర్ మాత్రమే కాదు. ఆయన ప్రస్తుతం వైసీపీ తరఫున రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్నారు. 2022లో సిర్గాపూర్ నిరంజన్ రెడ్డిని వైసీపీ రాజ్యసభకు నామినేట్ చేసింది. ఇదే కాకుండా ఆయన సినిమా ప్రొడ్యూసర్‌గా కూడా చేశారు. ఇప్పటివరకు ఆయన పలు సినిమాలకు ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. అందులో మెగాస్టార్ చిరంజీవి నటించిన ఆచార్య సినిమా కూడా ఉండటం గమనార్హం. మిగితావి క్షణం, ఘాజీ, వైల్డ్ డాగ్ సినిమాలు ఉన్నాయి. 2011లో వచ్చిన గగనం సినిమాతో ఆయన సినిమా రంగంలోకి అడుగుపెట్టారు.సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని నిర్మల్. ఆయన తండ్రి విద్యాసాగర్ రెడ్డి కూడా ప్రముఖ లాయర్. నిరంజన్ రెడ్డి నిజామాబాద్‌తోపాటు హైదరాబాద్‌లోనూ విద్యాభ్యాసం చేశారు. 1992లో లా డిగ్రీ పూర్తి చేసిన నిరంజన్ రెడ్డి.. మహారాష్ట్ర పుణెలోని ప్రతిష్ఠాత్మక సింబయాసిస్ లా స్కూల్‌లోనూ చదువుకున్నారు. ఓవైపు లాయర్‌గా పలు కేసులు వాదిస్తూనే.. అటు ప్రొడ్యూసర్‌గా, ఇటు రాజకీయ నాయకుడిగా ఉన్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు నిరంజన్ రెడ్డి లాయర్‌గా వసూలు చేసే ఫీజు గురించి కూడా తీవ్రంగా చర్చ జరుగుతోంది. తాజాగా ఆయన అల్లు అర్జున్‌కు బెయిల్ ఇప్పించడంతో నిరంజన్ రెడ్డి పేరు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా మారుమోగిపోతోంది.

సీనియర్ లాయర్ అయిన సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి.. గంటకు రూ.5 లక్షలు వసూలు చేస్తారనే వార్తలు ఇప్పుడు చక్కర్లు కొడుతున్నాయి.అంతేకాకుండా పలు ముఖ్యమైన హై ప్రొఫైల్ కేసుల్లో వాదనలు వినిపించిన అనుభవం సిర్గాపూర్ నిరంజన్ రెడ్డికి ఉండటం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసులో సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తున్నారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే, అల్లు అర్జున్ ఫ్రెండ్ శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి.. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు సిర్గాపూర్ నిరంజన్ రెడ్డిని తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సన్నిహితుడిగా ఉన్న శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.. తనకు ఉన్న పొలిటికల్ పరిచయాలతో తన పార్టీకి చెందిన నిరంజన్ రెడ్డికి కేసు అప్పగించినట్లు సమాచారం. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో నంద్యాల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి మద్దతుగా అల్లు అర్జున్ అప్పట్లో ప్రచారం నిర్వహించారు.

# రీజనల్ రింగ్ రోడ్డుకు మహర్దశ

**హైదరాబాద్ :** తెలంగాణ అభివృద్ధిలో హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు సూపర్ గేమ్ ఛేంజర్ అని ప్రభుత్వ పెద్దలు వెల్లడిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సగం తెలంగాణ అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సుమారు 40 కి.మీ దూరం నుంచి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ భాగాలుగా ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగం భూసేకరణ దాదాపు పూర్తయింది.తెలంగాణ మణిహారంగా చేపడుతున్న రీజినల్ రింగు రోడ్డుపై కీలక అప్డేట్ వచ్చింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి (159 కి.మీ.) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి గడ్కరీతో సమావేశమైన సీఎం రాష్ట్రానికి సంబంధించి పలు జాతీయ రహదారులు, ఇతర రహదారుల వివరాలను తెలియజేసి సత్వరం అనుమతులు మంజూరు చేయాలని కోరారు.2017లోనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని 161 ౦౦ జాతీయ రహదారిగా ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని చెప్పారు. మిగిలినవి కూడా పూర్తి చేస్తామమని త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు ఆర్థిక పరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. అందుకు గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు సీఎంవో వర్గాలు వెల్లడించాయి.ఇక దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్ నగరంతో అనుసంధానించే ఔఊ-765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉందని, మిగిలిన 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని చెప్పారు. ఆ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని, అందుకు 2024-25 బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే హైదరాబాద్ ఏపీలోని ప్రకాశం జిల్లా మధ్య 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్య నగరాలైన హైదరాబాద్-విజయవాడ (ఎన్.హెచ్-65) రహదారిని 6 వరుసలుగా విస్తరించే పనుల డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు.పర్వత్ మాల ప్రాజెక్ట్‌లో యాదగిరి గుట్ట దేవాలయం, నల్గొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. గోదావరి, కృష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో.. ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న 10 చోట్ల పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయాలన్నారు. నల్గొండ జిల్లాల్లో ఎన్.హెచ్-65 పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్ పోర్ట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారిని కలిసిన వారిలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పలువురు ఎంపీలు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇంటి సర్వేలో 35 ప్రశ్నలు

**నల్గొండ :** ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ అమలు కోసం 'యాప్' అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ప్రతి అంశాన్ని యాప్ లో నమోదు చేస్తున్నారు. అన్ని కోణాల్లో పరిశీలించి? లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇటీవలే ప్రత్యేక మొబైల్ యాప్ ను తీసుకొచ్చింది. అన్ని జిల్లాల్లోనూ యాప్ ద్వారా అధికారులు వివరాలను సేకరిస్తున్నారుప్రజాపాలనలో పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ప్రతి దరఖాస్తును క్షుప్తంగా పరిశీలించి? వివరాలను సేకరిస్తున్నారు. యాప్ లో నమోదు చేసే వివరాల ఆధారంగా? దరఖాస్తుదారుడు అర్హులా? కాదా? అనేది వెల్లడవుతుంది.గతంలో ఏదైనా గృహ పథకంలో లబ్ది పొందారా?, ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం ఎలా ఉంది వంటి వివరాలను యాప్ లో సేకరిస్తున్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి భూమి అందుబాటులో ఉందా? లేదా?, స్థలం లబ్దిదారుడి పేరు మీద ఉందా? కుటుంబ సభ్యుల పేరు మీద ఉందా?, ఇంట్లో వివాహిత జంటల సంఖ్య, ప్రస్తుత గ్రామం/పట్టణంలో ఎన్నేళ్లుగా నివసిస్తున్నారు వంటి వాటిపై ఆరా తీస్తున్నారు. లబ్దిదారులు వికలాంగులు/అనాథలు/ ఒంటరి మహిళలు/వితంతువులు/ ట్రాన్స్ జెండర్లు, పారిశుద్ధ్య కార్మికులు ఉంటే ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం ఉంటుందని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. వీరిని కూడా యాప్ ద్వారానే గుర్తిస్తారు, అన్ని కలిపి 30 - 35 ప్రశ్నలు ఉంటాయి. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి అధికారులు ఆయా వివరాలను యాప్లో నమోదు చేస్తున్నారు.మొదటి విడతలో సొంత స్థలం ఉన్న నిరు పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనుంది. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తొలి సంవత్సరంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లను కేటాయిస్తారు. మొత్తంగా 4.5 లక్షల ఇండ్లకు ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నిధులను విడుదల చేస్తారు. ఈ నిధులను ధపాలు వారీగా ఇస్తారు.

# దరఖాస్తు ఇలా చేసుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కూసుమంచిలో మాట్లాడిన ఆయన? పేదవారు కన్న కల ఇందిరమ్మ ఇల్లు అని చెప్పుకొచ్చారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ అధికారులు వెళ్లి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారని గుర్తు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. 80 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం అభ్యర్థించారని తెలిపారు. ఎవరైతే సొంత స్థలంలో ఉంటారో వారి ఇంటి ఫోటో తీసి యాప్ లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూపాయలు ఇస్తామన్న ఆయన? రాష్ట్ర వ్యాప్తంగా 580 మోడల్ హౌజ్ లను నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. సంక్రాంతి నాటికి కూసుమంచి లో మోడల్ హౌజ్ నిర్మాణం పూర్తి అవుతుందని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం లో కాంట్రాక్టర్లకు ఇళ్లు ఇస్తే కూలిపోయే పరిస్థితి ఏర్పడిందని మంత్రి పొంగులేటి విమర్శించారు. ఎవరు ఇళ్లు వారే నిర్మించుకునే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజాపాలన లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తిస్తున్నారని వివరించారు. ప్రజాపాలన లో దరఖాస్తు చేయని వారు స్పెషల్ కౌంటర్ లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసిన వారి కుటుంబ సభ్యులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.ఇందిరమ్మ ప్రభుత్వం లో కండీషన్ లు పెట్టి ఇళ్లు ఇవ్వకుండా తప్పించుకునే ప్రభుత్వం కాదని మంత్రి స్పష్టం చేశారు. పేదవారికి భారం కాకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. గ్రామాలకు సర్వేకు వచ్చే అధికారులు ఇందిరమ్మ కమిటీలను కలుపుకుని పోవాలని పిలుపునిచ్చారు. పేదవారి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. దరఖాస్తుదారుల వివరాలను ఎంట్రీ చేసి? లబ్ధిదారులను గుర్తిస్తారు. యాప్ అందుబాటులోకి రావటంతో ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ ప్రక్రియ వేగవంతం కానుంది.ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఆయా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వేయర్లు యాప్ లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటికే చాలా నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ మొదలైంది. దరఖాస్తుదారుడి అన్ని వివరాలను సేకరిస్తారు. గతంలో ఏదైనా ఇంటి స్కీమ్ లో లబ్ధి పొందారా..? ఎలాంటి వాహనాలు ఉన్నాయి..? స్థలం ఎవరి పేరుపై ఉంది..? కుటుంబంలో ఉద్యోగస్తులు ఎవరైనా ఉన్నారా..? ఇన్ కమ్ ట్యాక్స్ చెల్లింపుతో పాటు ఇతర వివరాలను తీసుకుంటారు. దరఖాస్తుదారుడు ఇచ్చే సమాచాన్ని యాప్ లో నమోదు చేసిన తర్వాత అన్ని కోణాల్లో క్రోడీకరిస్తారు. ఇందులో ఏఐ టెక్నాలజీ కీలకంగా పని చేయనుంది. అన్నింటిని పరిశీలించిన తర్వాతే? అసలైన నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తారు.

# బుగ్గ రాజరాజేశ్వర ఆలయంలో హుండీ చోరీ




**బెల్లంపల్లి:** బుగ్గ రాజరాజేశ్వర ఆలయంలో హుండీ చోరీ బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయితీ శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మరోసారి హుండీ చోరికి గురైంది. తాళ్ల గురిజాల ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం. బుగ్గ ఆలయంలో శుక్రవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచి చూడగా హుండీ దొంగిలించినట్లు పూజారీ గుర్తించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# రైతులకు బేడీ తలనొప్పి

**హైదరాబాద్ :** గత ఖమ్మం జిల్లాలో రైతులకు బేడీలు వేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. 2023 ఎన్నికల్లో దాని ప్రభావం కనిపించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాంటి చర్యలకు దిగడం విమర్శలకు తావిస్తోంది.దేశానికి అన్నం పెట్టేది రైతులే. కానీ, రైతులకు.. వారి శ్రమకు గుర్తింపు, ఫలితం దక్కడం లేదు. ప్రభుత్వాల తీరుతో ఇబ్బంది పడుతున్నారు. దళారుల తీరుతో మోసపోతున్నారు. ఇటీవల రైతుల భూములు తీసుకోవడం ఉద్రిక్తతలకు దారితీస్తోంది. మల్లన్న సాగర్ భూసేకరణ సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను, గ్రామస్తులను పోలీసులతో నిర్బంధించి భూములు లాక్కుంది. తాజాగా కాంగ్రెస్ వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా సిటీ కోసం భూసేకరణకు సిద్ధమైంది. ఈ సమయంలో రైతులు అధికారులపై తిరగబడ్డారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు. పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే జైల్లో ఉన్న రైతులను బేడీలు వేసి తీసుకురావడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తాజాగా హీర్యానాయక్‌ను జైలు నుంచి సంకెళ్లతో ఆస్పత్రికి తరలించారు. విమర్శలు రావడంతో జైలర్ సంజీవరెడ్డిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సూపరింటెండెంట్ సంతోష్‌పై శాఖాపరమైన చర్యలకు జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తాకు లేఖ రాశారు.హీర్యానాయక్ గురువారం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో పోలీసులు సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.ఈ సమయంలో ఆయనకు బేడీలు వేసి ఉండడం, ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఫైరల్ అయ్యారు. ఘటనపై ఆరా తీశారు. సంకెళ్లు ఎందుకు వేశాలరని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. దీంతోరంగంలోకి దిగిన మల్టీజోన్?2 ఐజీ సత్యనారాయణ సంగారెడ్డికి వెళ్లి విచారణ చేపట్టారు.లగచర్ల ఘటన తర్వాత పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేశారు. అందులో హీర్యానాయక్ కూడా ఉన్నారు. న్యాయస్థానం వారికి రిమండ్ విధించింది. దీంతో సంగారెడ్డిజైలుకు తరలించారు. బుధవారం ఛాతీలో నొప్ప రావడంతో జైలు అధికారులు ఎస్కార్ట్‌తో ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల తర్వాత జైలుకు తరలించారు. గురువారం మళ్లీ నొప్పగా ఉందనడంతో మరోమారు గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సమయంలో చేతికి సంకెళ్లు ఉండడంతో కొందరు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.ఇదిలా ఉంటే.. హీర్యానాయక్‌ను ఆస్పత్రికి తరలించేందుకు సిబ్బందిని పంపించాలని జైలు సూపరింటెండెంట్ రాసిన లేఖలో పలు అంశాలు కలకలం రేపాయి. వాటిపై నిఘావర్గాలు ఆరాతీస్తున్నాయి. సాధారణంగా ఏసు నమోదు చేసిన పోలీసులు ఎస్కార్ట్ అడగాలి. కానీ, సూపరింటెండెంట్ వికారాబాద్ పోలీసులను కాకుండా సైబరాబాద్ పోలీసులకు లేఖ రాశారు. అందులో బాలానగర్ పీఎస్‌లో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. ఆ కేసు రోడ్డు ప్రమాదానికి సంబంధించినది.ఇదిలా ఉంటే లగచర్ల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న సురేశ్ ఫోన్‌లో మాట్లాడిన విషయం కూడా బైయటకు వచ్చింది. దీనిపై జైలర్ జీవన్‌రెడ్డిని డీజీ సస్పెండ్ చేశారు. ఏ2గా ఉన్న సురేశ్ ల్యాండ్ ఫోన్ నుంచి ఎవరితోనో మాట్లాడారిని మల్టీజోన్?2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఫోన్‌లో గుండెనొప్పి అని లాయర్లు, మీడియాకు సమాచారం ఇస్తే గంటలో బెయిల్ ఇస్తామని తెలిపాడు. మరోవైపు సూపరింటెండెంట్ లేఖపైనా విచారణ జరుపుతున్నారు.

# సంక్రాంతికి విస్తరణ పక్కా

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. కేబినెట్ 12 మందితో ఏర్పడింది. ఆరు పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వాటి భర్తీకి లైన్ క్లియర్ అయింది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో క్యాబినెట్ బెర్తుల ఖాళీలు భర్తీ చేసేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కసరత్తు మొదైలంది. కాంగ్రెస్ మార్కు రాజకీయాలు రాష్ట్రంలో ఊపందుకున్నాయి. తాజాగా ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ విస్తరణ కోసం అనుమతి తీసుకున్నారు. ఆరుగురి పేర్లు ఖరారు చేసుకుని వస్తారని తెలుస్తోంది. దీంతో ఆశావహులు అలర్ట్ అయ్యారు. మరోవైపు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కూడా మరో జాబితాతో ఢిల్లీ వెళ్లారు. ఆయన ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతోపాటు మరికొంతమంది కోసం లాబీయింగ్ చేస్తున్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా భట్టిని కలిశారు. తన పేరు సిఫారసు చేయాలని కోరారని సమాచారం.ఇదిల ఉంటే.. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఢిల్లీలో రచ్చ చేశారు. పార్టీలో పాత వారికన్నా కొత్తవారికి ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస మున్షికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్‌ను చంపేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.

మరోవైపు మంత్రి పదవి ఆశిస్తున్న పలువురు హస్తిన బాట పట్టారు. సామాజిక సమీకరణలకు కేబినెట్‌లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.కేబినెట్ బెర్తుల భర్తీలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆమె కూడా కొందరి పేర్లు సిఫారసు చేశారని సమాచారం. సీనియరుల, సీఎం, ఇన్‌చార్జి తమ తమ పేర్లతో ఢిల్లీ చేరుకున్నారు.

ఇప్పుడు ఎవరి జాబితాకు హైకమాండ్ ఆమోదం తెలుపుతుందన్న టెన్షన్ నెలకొంది.మరోవైపు కేబినెట్ విస్తరణకు నల్గొండ నేతలు అడ్డు పడుతున్నట్లు తెలిసింది. నల్గొండ జిల్లా నుంచి ప్రస్తుత ఏబినెట్‌లో ఒకే సమాజికవర్గం నేతలు ఉన్నారు. కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కూడా ప్రయత్నం చేస్తున్నారు. ఈనేపథ్యంలో కేబినెట్ విస్తరణను ప్రభావితం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు కూడా కారణం. ఈ నేపథ్యంలో అధిష్టానం కూడా ఈ విషయంపై దృష్టిసారించింది. మరోవైపు తాజా విస్తరణలో హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు ప్రాధాన్యం దక్కే అవకాశం ఉంది.

# ఇవాళ్టి నుంచి గ్రూప్ 2

**హైదరాబాద్ :** తెలంగాణాలో గ్రూప్-2 పరీక్షలు ఈ నెల 15, 16వ తేదీల్లో జరగనున్నాయి. ఇప్పటికే హాల్ టికెట్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. గ్రూప్-2కి పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు ఇప్పటికే హాల్ టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ పరీక్షల కోసం అభ్యర్థులు ఎంతగానే ప్రిపేర్ అయ్యారు. ఈ పరీక్షల కోసం ఎన్నో ఏళ్ల నుంచి కూడా ప్రిపేర్ అయ్యే వాళ్లు ఉంటారు. ఈ పరీక్షల కోసం టీజీపీఎస్సీ ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టింది. ఈ పరీక్ష మొత్తం నాలుగు పేపర్లు రెండు రోజులు జరగనున్నాయి. ఈ పరీక్షలకు వెళ్లే అభ్యర్థులు కొన్ని విషయాలను తప్పకుండా తెలుసుకోవాలి. కొందరు అభ్యర్థులు జాగ్రత్త తీసుకోకుండా చేసిన కొన్ని తప్పుల వల్ల పరీక్ష రాయకుండా పరీక్ష సెంటర్ నుంచి తిరిగి వచ్చేస్తారు. ఎన్నో ఏళ్ల నుంచి కష్టపడి చదివి పరీక్ష రాయకపోతే ఎంతో బాధగా ఉంటుంది. కాబట్టి పరీక్ష రాయాలంటే కొన్ని సూచనలు పాటించాలి.గ్రూప్-2 పరీక్ష రెండు రోజుల పాటు మొత్తం నాలుగు పేపర్లలో జరగనుంది.

డిసెంబర్ 15, 16వ తేదీల్లో రెండు రోజుల పాటు పరీక్షలు జరగనున్నాయి. మొదటి రోజు పేపర్-1 ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుంది. తర్వాత రెండో పేపర్ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అవుతుంది. సాయంత్రం 5:30 వరకు పరీక్ష జరుగుతుంది. ఇదే సమయాల్లో 16వ తేదీన కూడా పరీక్షలు జరుగుతాయి. ప్రతీ పేపరులో ఒక్కో పేపరు 150 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయి.గ్రూప్-2 పరీక్షలకు వెళ్లే అభ్యర్థులు తప్పకుండా కొన్ని సూచనలు పాటించాలి. ఆఫ్‌లైన్ పద్ధతిలో పరీక్ష ఉంటుంది. కాబట్టి బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకెళ్లాలి. అలాగే హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. కొందరికి హాల్‌టికెట్‌లో ఫొటో బ్లర్ ఉంటుంది. అలాంటి వారు మూడు పాస్‌ఫొటోలను తప్పకుండా తీసుకెళ్లాలి. పాత పాస్ పోర్ట్ కాకుండా గత మూడు నెలల లోపలది అయి ఉండాలి. పరీక్ష్ ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుంది. అంటే ఉదయం 8:30 గంటల పరీక్ష కేంద్రానికి అనుమతి ఇస్తారు. 9:30 లోపల వరకు మాత్రమే పరీక్ష సెంటర్‌లోకి అనుమతి ఇస్తారు. ఆ తర్వాత వెళ్లిన లోపలికి అనుమతించరు. మధ్యాహ్న సమయాల్లో అయితే 1:30 నుంచి 2:30 వరకు మాత్రమే పరీక్ష కేంద్రానికి అనుమతి ఇస్తారు.

పరీక్ష రాసే అభ్యర్థులు చేతులకు మెహందీ, గోరింటాకు, తాత్కాలికమైన టాటూలు వంటివి ఉండకూడదు. వీటితో వెళ్తే పరీక్ష రాయకుండా తిరిగి వస్తారు. వీటితో పాటు పరీక్ష సెంటర్‌లోకి మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్లూ టూత్, పెన్ డ్రైవ్ వంటివి కూడా అనుమతించరు. అమ్మాయిలు చైన్, గాజులు, రింగులు, బొట్టు, హ్యాండ్ బ్యాగ్, వాచ్, రబ్బరు బ్యాండ్ వంటివి ధరిస్తే పరీక్ష సెంటర్‌లోకి అనుమతించరు.

# వైసీపీలో ఆగని షాక్‌లు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సీపికి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఉదయం మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామా చేశారు. మధ్యాహ్నం భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ ఆ పని చేశారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించి లేఖ రిలీజ్ చేశారు ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి గ్రంథి శ్రీనివాస్ వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. పార్టీకి దూరంగా ఉన్నారు. ఇతర పార్టీల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీతో చర్చలు పూర్తయ్యాయో కానీ ఆయన రాజీనామా చేశారు. ఇటీవల గ్రంథి శ్రీనివాస్ ఇంట్లో ఐటీ దాడులు జరిగాయి. దాదాపుగా వారం రోజుల పాటు ఆయన వ్యాపార వ్యవహారాల్లో ఉన్న అవకతవకలన్నింటినీ వెలికి తీశారని ప్రచారం జరుగుతోంది. అంతకు మందు నుంచే ఆయన వైసీపీకి దూరంగా ఉన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున అప్పటి విపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడటంతో వైసీపీ ఉంటే తనకూ ఇబ్బందులేనన్న ఉద్దేశంతో ఆయన కొంత కాలంగా సైలెంట్ గా ఉన్నారు. దీనికి కూడా ప్రత్యేకమైన కారణం ఉంది. అదేమిటంటే.. ఆయన 2019 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పై గెలిచారు. ఆ తర్వాత పవన్ పై అనేక అనుచిత వ్యాఖ్యలు కూడా చేశారు. పలు మార్లు భీమవరంలో జనసేన, వైసీపీ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచార సమయంలో భీమవరంలో గ్రంథి శ్రీనివాస్ పై తీవ్ర విమర్శలు చేశారు. రౌడీయిజం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి వ్యాపారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రౌడీయిజాన్ని అణిచి వేస్తామని హెచ్చరించారు. దీంతో కూటమి గెలిచిన తర్వాత తనకు చిక్కులు తప్పవని ఆయన అనుకుంటున్నారు. అయితే ఆయనను జనసేన పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు. టీడీపీ లేదా బీజేపీలో చేరేందుకు ఆయన ప్రయత్నాలు చేశారని అంటున్నారు. కానీ ఆయనకు గ్రీన్ సిగ్లన్ రాలేదని చెబుతున్నారు. వైసీపీకి రాజీనామా చేసే నేతల సంఖ్య వరుసగా పెరుగుతోంది. ఇప్పటికే మెజార్టీ సీనియర్ నేతలు యాక్టివ్ గాలేరు. వారిలో వరుసగా రాజీనామా బాట పడుతున్నారు. మరో వైపు కూటమి ప్రభుత్వంపై పోరుబాట పట్టాలని జగన్ అనుకుంటున్న సమయంలో ఇలా వరుసగా నేతలు ఒకరి తర్వాత ఒకరు గుడ్ బై చెబుతూంటడం.. ఆ పార్టీ పెద్దల్ని కూడా కలవర పరుస్తోంది.

# కూటమి వైపు వైసీపీ చూపులు

**విజయవాడ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ఏదో ఓ కూటమిలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇండియా కూటమి నేతృత్వం నుంచి కాంగ్రెస్ పార్టీ వైదొలిగి మమతా బెనర్జీ నాయకత్వంలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాను సిద్ధమేనని మమతా బెనర్జీ ప్రకటించిన తర్వాత అనూహ్యంగా పలు పార్టీలు మద్దతు పలికాయి. ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు దీదీ నాయకత్వానికి ఓకే అంటే సరే అనుకోవచ్చు కానీ జగన్ నేతృత్వంలోని వైసీపీ కూడా మద్దతు పలికడం రాబోతున్న మార్పులకు సూచనగా మారింది. ప్రస్తుతం ఇండియా కూటమి చీలిక దిశగా ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్ తో కలసి పని చేసేందుకు సిద్ధంగా లేదు. హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ ఆప్ ను పట్టించుకోలేదు. ఇప్పుడు ఆప్ .. కాంగ్రెస్ ను పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ను కాదని ప్రాంతీయ పార్టీల నేతలే కూటమికి నేతృత్వం వహించాలని కోరుకుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్, అఖిలేష్ యాదవ్ వంటి వారు ఈ డిమాండ్ ను సమర్థిస్తున్నారు. ఇతర పార్టీలు కూడా ఓకే అంటే.. నాయకత్వం మారే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ కూడా ఈ అంశంపై కూటమిని నిర్మించే బాధ్యత ప్రాంతీయ పార్టీలకు ఇచ్చే అవకాశాలనుపరిశీలించే చాన్స్ ఉందని అనుకుంటున్నారు. విజయసాయిరెడ్డి ఇండియా కూటమికి దీదీ నాయకత్వం వహిస్తే బాగుంటుందని ప్రకటించేశారు. మామూలుగా అయితే ఆ కూటమికి ఎవరు నేతృత్వం వహిస్తే మాకేంటి అంటారు కానీ ఆయన తీరు మాత్రం వేరుగా ఉంది. ప్రస్తుతం వైసీపీ అత్యంత బలహీనంగా ఉంది. అసెంబ్లీకి వెళ్లడం లేదు. ఈ పరిస్థితులు చూస్తే రానున్న రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. వీటిని ఎదుర్కోవాలంటే తమకు ఓ కూటమి మద్దతు ఉండాలని అనుకుంటున్నారు. కాంగ్రెస్ ఉన్న కూటమిలో చేరడానికి ఇంత కాలం సంశయిస్తూ వస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో ధర్నా చేసినప్పుడు కాంగ్రెస్ మినహా మిగతా ఇండియా కూటమి పార్టీలన్నీ హాజరయ్యాయి. ఇప్పుడు ఆ వ్యూహం వెనుక ఉన్న రాజకీయం వెలుగులోకి వస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మమతా బెనర్జీ నేతృత్వంలో త్వరలో ఇండియా కూటమి పునర్ వ్యవస్థీకరణ జరగనుంది. కాంగ్రెస్ పార్టీ ఉంటుందో ఉండదో కానీ.. వైసీపీ చేరడం మాత్రం పక్కా అని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. మమతా బెనర్జీ కూడా నేరుగా జగన్ తో సంప్రదింపులు జరుపుతున్నారని అంటున్నారు. ఇంత కాలం బీజేపీతో లొల్లి పెట్టుకోవడానికి ఏ మాత్రం ఇష్టపడని జగన్ ఇప్పుడు ఆ పార్టీని నమ్మడానికి సిద్ధంగా లేరు. అందుకే ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారన్న అభిప్రాయం ఢిల్లీలో గట్టిగా వినిపిస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చి ఇంకా ఏడాది పూర్తి కాలేదు. రానున్న ఐదేళ్లు పార్టీ నుంచి మరిన్ని ఒత్తిళ్లు ఉంటాయని భావిస్తున్నారట. పార్టీలో ఉండి కష్టాలు కోరి తెచ్చుకునే కంటే, రాజీనామా చేస్తే బెటరని అనుకుంటున్నారు. ఇటు పార్టీకి.. అటు ప్రభుత్వానికి దూరంగా ఉంటే ఎలాంటి సమస్యలు ఉండదన్నది ఆయా నేతల ఆలోచన. మరికొందరికి సొంత నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. అధిష్టానం వద్ద ఎంత మొరపెట్టుకున్నా, ఫలితం లేకపోయింది. ఫలితంగా ఫ్యాన్‌కి దూరంగా ఉండేందుకు సిద్ధపడుతున్నారు. ఇంకొందరు నేతలు ఏపీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. ప్రస్తుతం కూటమి సర్కార్‌కు కేంద్రం నుంచి అన్నివిధాలుగా సహాయ సహకారాలున్నాయి. కూటమిలో చీలిక వచ్చే ప్రసక్తి లేదని భావిస్తున్నారు. ఒకవేళ వైసీపీ పుంచుకున్నా, మళ్లీ అధికారంలోకి రావడం కష్టమని, కాకపోతే బలమైన ప్రతిపక్షంగా తయారు కావచ్చనే అంచనాలు లేకపోలేదు. ఆ లెక్కన దాదాపు పదేళ్లు ప్రతిపక్షానికి పరిమితం కావాల్సి ఉంటుందన్నమాట. ఇప్పుడున్న పరిస్థితుల్లో అయితే టీడీపీ, లేదంటే జనసేన, ఇంకా లేదంటే బీజేపీ వైపు వెళ్తే సేఫ్‌గా ఉండవచ్చని భావిస్తున్నారట. ఇప్పటికిప్పుడు కాకపోయినా ఫ్యూచర్‌లో బెటర్ లైఫ్ ఉంటుందనేది నేతల భావన. రాబోయే ఐదేళ్లలో వైసీపీలో ఉండేదెవరు? వెళ్లిపోయేదెవరు? ఎందుకు ఆయా నేతలను ఆపే ప్రయత్నం చేయలేకపోతోంది? మొత్తానికి రాబోయే ఐదేళ్లు మాత్రం వైసీపీ గడ్డుకాలమేనని చెప్పక తప్పదు.

## టీడీపీ కండువాతో

# వైసీపీ నేతలవసూళ్లు

**ఏలూరు :** ఓ రోడ్‌పై అనధికారిక టోల్ గేట్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారన్న కారణంగా వైసీపీకి చెందిన ప్రేమ్ కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మెడలో పసుపు కండువాలు వేసుకుని ఓ రోడ్డు మీద టోల్ అనే బోర్డులు ఇద్దరు మనుషులతో ఏర్పాటు చేయించి .. ఓ సెక్యూరిటీ గార్డును కూడా పెట్టుకుని వచ్చి పోయే వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో పోలీసులు ప్రేమ్ కుమార్ ను అరెస్టు చేశారు. ప్రభుత్వానికి, టీడీపీకి చెడ్డపేరు తెచ్చేందుకు ఇలా చేశాడన్న ఆరోపణలు టీడీపీ కార్యకర్తలు చేస్తున్నారు. టీడీపీ కండువాలతో టోల్ గేట్లు డబ్బులు వసూలు చేయడం వెనుక కుట్ర ఉందన్న ఉద్దేశంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు అయితే తాము నిరసన వ్యక్తం చేస్తున్నామని ఆ వైసీపీ నేతలు చెబుతున్నారు. ప్రేమ్ కుమార్ వీడియో మాత్రమే తీసుకున్నాడని ఎవరి దగ్గర డబ్బులు వసూలు చేయలేదని వైసీపీ నేతలు చెబుతున్నారు. వీడియోలో డబ్బులు ఇస్తున్న వారు కూడా ప్రేమ్ కుమార్ ఏర్పాటు చేసిన వ్యక్తులేనని అంటున్నారు. కూటమి ప్రభుత్వం స్థానిక రహదారులపైనా టోల్స్ వసూలు చేయాలనుకుంటోంది కాబట్టి దానికి నిరసన వ్యక్తం చేశారని అంతే తప్ప డబ్బులు వసూలు చేయాలని కాదని మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసుల్ని కలిసి వివరించారు. సోషల్ మీడియా యాక్టివిస్టుల్ని అరెస్టు చేస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి ఇలా డబ్బులు వసూలు చేసుకునే పద్ధతి ఎంచుకోవడం మాత్రం.. ఆ ప్రేమ్ కుమార్ ను జైలుకు పంపేలా చేసింది.

## నేనే బాగానే వున్నా

# అందరికి థాంక్స్

**హైదరాబాద్** తన నివాసం వద్ద మీడియాతో అల్లు అర్జున్ మాట్లాడారు. నేను బాగానే ఉన్నా. ఆందోళన చెందాల్సిన పనిలేదు.

నేను చట్టాన్ని గౌరవిస్తాను, నాకు మద్దతు తెలిపిన అందరికి ధన్యవాదాలు, రేవతి కుటుంబానికి నా సానుభూతి, జరిగిన ఘటన దురదృష్టకరం ఇది అనుకోకుండా జరిగిన ఘటన అని అన్నారు. కేసు కోర్టు పరిధిలో ఉంది, కాబట్టి న్యాయస్థానాన్ని గౌరవిస్తూ ఇప్పుడు ఏం మాట్లాడలేనని అన్నారు

# ఎన్నికలకు సిద్ధం అవుతున్న వైసీపీ

**గుంటూరు :** ఏపీలో పోయిన చోట వెతుక్కోవడంతో పాటు రాబోయే ఎన్నికలకు కార్యకర్తలను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకుంటోంది. ఏపీలో ప్రభుత్వాలు ఏవైనా పరిణామాలు ఎలా ఉన్నా విజయం మాత్రం తమదే అంటూ ధీమా వ్యక్తం చేస్తోంది వైసీపీ. అసలు ప్రభుత్వ ఏర్పాటుపై వైసీపీ లెక్క ఏంటి..? ఎన్నికపై జగన్ వ్యూహాలు ఏంటి? ప్రభుత్వం తమదే అంటున్న వైసీపీ నేతల వ్యాఖ్యల వెనక ఉన్న ఆంతర్యం ఏంటి..? అన్నదీ హాట్ టాపిక్‌గా మారింది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీకి పునర్వైభవం తీసుకువచ్చే దిశగా ఆ పార్టీ నేతలు అడుగులు వేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా మళ్ళీ పర్యటించి, ఏపీలో పట్టు నిలుపుకునేందుకు పార్టీ నేతలను కార్యకర్తలను ఆ పార్టీ అధినాయకత్వం ఇప్పటినుంచే సిద్ధం చేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి ఫలితాల తర్వాత ఆయా లోటుపాట్లను సరిదిద్ది, నూతన ఉత్సాహంతో ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేస్తోంది వైసిపి. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కార్యకర్తల్లో నేతలు అంతా చెల్లా చదురవడంతో వారందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు నేరుగా వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆ బాధ్యతలను భుజానికి వేసుకున్నారు. అందులో భాగంగానే ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడు నెలల్లోనే కొత్త జిల్లా కమిటీలు,కొత్త అధ్యక్షులు,నూతన నియోజకవర్గ సమన్వయ కర్తలు, నూతన అనుబంధ సంఘాల విభాగాల నేతలను నియమించి పార్టీలో కొత్త జోష్ తీసుకొస్తున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మానిటర్ చేసేందుకు ఎప్పటికప్పుడు కొత్త టీములను సైతం సిద్ధం చేసుకుంటున్నారు వైఎస్ జగన్. ఎన్నికల ఫలితాలపై ఇప్పటికే అన్ని లెక్కలను సిద్ధం చేసుకున్న వైసీపీ, అధినాయకత్వం ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా, ఇప్పటి నుంచే తమ కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు.ఎన్నికల ఫలితాలతో వైసీపీ పూర్తిగా డీలాపడటంతో ఇప్పటి నుంచే ఎన్నికల కోసం వైసీపీ లెక్కలు చేస్తోంది. 2019 ఎన్నికల ఫలితాలను పునరావృతం చేయాలన్న సంకల్పంతో ప్రస్తుతం పార్టీ కేడర్‌ను సిద్ధం చేసుకుంటుంది. జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించిన నేపథ్యంలో జమిలి ఎన్నికలు వస్తాయన్న యోచనలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఆయా ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీ విజయం సాధిస్తుందన్న ఆశాభావం చేస్తుంది.అందులో భాగంగానే గత ఎన్నికల్లో జరిగిన తప్పులు పునరావృత్తం కాకుండా కేడర్‌కు, లీడర్లకు మధ్య గ్యాప్ లేకుండా ఎన్నికల కోసం సమాయత్తం చేస్తోంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే జిల్లాల పర్యటనకు రంగం సిద్ధం చేసుకుంటున్న వేళ జమిలి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్తకు ప్రతి నేతకు భరోసా ఇచ్చే దిశగా జగన్ అడుగులు వేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతోనే అధినాయకత్వం సైతం రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ సమస్యలపై ఆందోళన చేపట్టడంతో పాటుగా పార్టీకి దూరంగా ఉన్న ప్రతి కార్యకర్తను దగ్గర అయ్యేలా చూడాలంటూ ఆయా జిల్లా నాయకత్వాలకు రాష్ట్ర అధినాయకత్వం స్పష్టమైన ఆదేశాలను పంపింది.ఇప్పటికే వైఎస్ జగన్ కార్యకర్తలపై దాడులు ప్రతి దాడులు జరిగిన చోట పరామర్శల పేరుతో పర్యటనలు చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల పరిధిలో పార్టీ పరిస్థితి నాయకత్వం మార్పు కొత్త అధ్యక్షులు నియామకం రీజనల్ కోఆర్డినేటర్ల బాధ్యతలు అప్పగించడం లాంటి అంశాలను ప్రత్యేకంగా తీసుకొని ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయం వేదికగా వరుస సమావేశంలో నిర్వహించడంతోపాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు పార్టీ తరపున ఎన్నికైన ప్రతి ఒక్కరికి పార్టీ తరపున భరోసా ఇస్తూనే జమిలి ఎన్నికలకు సిద్ధం కావాలంటూ జగన్మోహన్ రెడ్డి నేరుగా పిలుపునిస్తున్నారు.జమిలి ఎన్నికలను పెంచాలని కేంద్రం అడుగులు వేస్తున్న వేళ ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సైతం అందుకు తగ్గట్టుగానే తన కార్యాచరణను సిద్ధం చేసుకుంటుంది. జమిలి ఎన్నికలకు తాము మొదటి నుంచి ఆమోదం తెలిపామన్న విషయాన్ని స్పష్టం చేస్తూనే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము విజయం సాధిస్తామంటూ కార్యకర్తలకు నేతలకు భరోసా ఇస్తోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, జరిగిన పరిణామాలు దృష్ట్యా తమకంటూ ఉన్న ఓటు బ్యాంకు ఎక్కడకు దూరం కాలేదని అధిష్టానం భావిస్తోంది. పార్టీ తరఫున జరిగిన లోటు పాట్ల చెక్ పెట్టామని, ఏపీలో ప్రజలు మళ్లీ తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారని వైసీపీ నేతలు అంటున్నారు. జగన్ మోహన్ రెడ్డి పరిపాలన పరమైన అంశాల విషయంలో ప్రజల్లో ఎక్కడ ఇబ్బందులు లేవని, జమిలి ఎన్నికలను వైసిపి స్వాగతిస్తుందని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా తాము విజయం సాధిస్తామంటూ వైసీపీ అధినాయకత్వం స్పష్టంగా చెబుతోంది.అందులో భాగంగానే ఎప్పటి నుంచే పార్టీ కేడర్‌ను సిద్ధం చేసుకుంటూనే మరోసారి అధికారాన్ని చేపట్టడమే లక్ష్యంగా జమిలి ఎన్నికలకు సిద్ధమవుతామని వైసీపీ ప్రకటిస్తోంది. ఇదే అంశాన్ని వైఎస్ జగన్ మీడియా సమావేశం వేదిక స్పష్టం చేశారు. జెమిలి ఎన్నికలు ఎప్పుడొచ్చినా తాము సిద్దంగా ఉన్నామని ఆ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన నిర్మోహమాటంగా చెప్పేస్తున్నారు.ఇదిలా ఉంటే జమిలి ఎన్నికలపై వైసీపీ వేస్తున్న లెక్కల విషయంలో కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నమైన ప్రకటన చేస్తోంది.

జెమిలి ఎన్నికలు ఎప్పట్లో లేవని కేవలం పార్టీ కార్యకర్తలను నేతలను నాయకత్వాన్ని దగ్గర చేసుకునే ప్రయత్నంలో భాగంగాని జెమిలి ఎన్నికలంటూ కొత్త అంశాన్ని వైసీపీ తెరపైకి తీసుకువచ్చిందంటున్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు కొత్త ఎత్తులు వేస్తోందని రాష్ట్రమంత్రులు ధ్వజమెత్తారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం సాధిస్తామన్న ప్రకటనను పదేపదే చెప్పి పార్టీకి దూరమైన కార్యకర్తలను నేతలను దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారని, వరసగా పార్టీని వీడుతున్న నేతల విషయంలో ఏం చేయాలో అర్థం కాని వైసీపీ అధినాయకత్వం జెమినీ పేరుతో రాంగ్ ట్రాక్ పట్టిస్తున్నారు అంటూ మంత్రులు మండిపడుతున్నారు. ఎన్నికలు ఏమైనా ఎప్పుడు వచ్చినా కూడా మళ్లీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారులకు వస్తుందంటూ

# ఏపీలో ఈవీ పాలసీ...

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు ఊపు తెచ్చేలా కొత్త ఈవీ పాలసీను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేలా రాయితీలు ప్రకటించారు. కొనుగోలు దారులతో పాటు ఉత్పత్తిదారులకు కొత్త ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీలో రాయితీలు కల్పించారు.ఏపీలో కొత్త ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గత కొంత కాలంగా ఈవీలకు పన్ను ప్రోత్సహకాల విషయంలో ప్రతిష్టంభన నెలకొనడంతో వాహనాల కొనుగోళ్లు తగ్గిపోయాయి. పొరుగు రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నా ఏపీలో కొంత జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఏపీలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేలా ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. 2024-29 మధ్య పాలసీ నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొంది. విద్యుత్తు వాహనాల తయారీదారులతోపాటు కొనుగోలుదారులకూ రాయితీలు ప్రకటించింది.

**కొత్త పాలసీలో ప్రయోజనాలు ఇవే..** ఎలక్ట్రిక్ బ్యాటరీల సాయంతో నడిచే ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్లకు ఇకపై ఏపీలో విక్రయ ధరలో 5 శాతం రాయితీ కల్పిస్తారు. ఆర్వీఎస్ఎస్ ఆపరేటర్ నుంచి సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ తీసుకుంటే వాహనం ధరలో 10 శాతం రాయితీ లభిస్తుంది. 2027 మార్చి వరకు జరిగే విక్రయాలపై మాత్రమే ఈ ప్రోత్సాహకం లభిస్తుంది. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న అన్ని విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్డు ట్యాక్స్ మినహాయింపు ఇస్తారు. అయితే హైబ్రిడ్ వాహనాలకు ఈ మినహాయింపు వర్తించదు' అని పాలసీలో పేర్కొన్నారు.ఎక్స్ షోరూమ్ ధరకు కూడా పరిమితి విధించింది. ద్విచక్రవాహనానికి గరిష్ఠంగా రూ. లక్ష, త్రి చక్ర వాహనానికి రూ.2 లక్షలు, సరకు రవాణా వాహనానికి రూ.5 లక్షలు, ట్రాక్టర్కు రూ.6 లక్షలు, విద్యుత్ బస్సుకు రూ.2 కోట్ల వరకు పరిమితిగా తీసుకుని ప్రభుత్వ రాయితీ వర్తింపజేస్తారు.మొదటి 5 వేల ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే వారికి ఖర్చులో 25% (గరిష్ఠంగా రూ. 3లక్షల) వరకు రాయితీ ఇస్తారు.

**కొత్త పాలసీ లక్ష్యాలు?** 2029 నాటికి 2 లక్షల విద్యుత్ ద్విచక్రవాహనాలు రిజిస్టర్ చేయడం, 2029 నాటికి కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త కార్లను తీసుకురావడంతో పాటు ఆర్టీసీలో నూరు శాతం విద్యుత్ బస్సుల వినియోగం లక్ష్యంగా పెట్టుకున్నారు. 30 కి.మీ.లకు ఒక విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులో తీసుకువస్తారు. ఈ-మొబిలిటీ నగరాల నిర్మాణానికి రూ.500 కోట్లతో కార్పస్ నిధి ఏర్పాటు చేస్తారు. ఈ-మొబిలిటీ స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు 100 ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు. ఈవీ రంగంతో అనుసంధానమైన భాగస్వామ్య పక్షాల నుంచి తీసుకున్న అభిప్రాయాలకు అనుగుణంగా పాలసీ విధానాలను ప్రభుత్వం రూపొందించినట్టు పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, విడిభాగాల తయారీ యూనిట్లు, పబ్లిక్, ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా చార్జింగ్/ స్వాపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో కొనుగోలు చేసిన విద్యుత్ వాహనాలు, రిజిస్ట్రేషన్ చేయడం, రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాప్ ఫెసిలిటీస్ (ఆర్వీఎస్ఎఫ్) ఆపరేటర్లు, ఈ- వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్లు, ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లు (ఏటీఎస్) ఏర్పాటు చేయడం చేస్తారు.

# కేంద్ర మంత్రిగా పవన్...

**తిరుపతి :** ఏపీ రాజకీయాల్లో ఊహించని మార్పులు జరగబోతున్నా యా? సీఎం చంద్రబాబు-డిప్యూటీ సీఎం పవన్ ఆలోచనకు మోదీ సర్కార్ ఓకే చెప్పిందా? జమిలి ఎన్నికల నేపథ్యంలో ఈ ప్లాన్ చేశారా? కేంద్రం నుంచి ఏపీకి పెద్ద మొత్తంలో నిధులు రావడం ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.దేశంలో జమిలి ఎన్నికలు వేడి కొనసాగుతోంది. దీనికి సంబంధించి రేపో మాపో మోదీ సర్కార్ పార్లమెంట్‌లో బిల్లు పెట్టబోతోంది. ఆ తర్వాత జేపీసీకి ఇవ్వాలని నిర్ణయించు కుంది. ఆ తర్వాత ఈ బిల్లుకు ఆరేడు సవరణలూ జరగనున్నాయి. కాకపోతే మోదీ సర్కార్‌ను ఒకటే వెంటాడుతోంది.ఈసారి సౌత్‌లో ఎక్కువ సీట్లు సాధించాలనే కమలనాథులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా పావులు కదుపుతోంది. రీసెంట్ జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ ఛరిష్మా కలిసొచ్చింది. దీంతో మూడింట రెండొంతుల మెజార్టీ బీజేపీ కూటమి దక్కించుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకుంది.పవన్ ఛరిష్మాను గుర్తించిన బీజేపీ పెద్దలు పవన్ కల్యాణ్ తమ పార్టీ స్టార్ క్యాంపెయినర్ గా వినియోగించుకోవాలని భావిస్తోంది. అందుకు పవన్ అంగీకరిస్తారా? అన్నది అసలు పాయింట్. నార్త్‌లో బీజేపీ బలంగా ఉన్నా, సౌత్‌లో మాత్రం బలహీనంగా కనిపిస్తోంది. సీట్లు పెరిగిన సందర్భం కనిపించలేదు.

తమిళనాడు, కేరళ, కర్ణాటక ఇలా ఏ రాష్ట్రం చూసినా బీజేపీకి పెద్ద లోటు కనిపిస్తోంది. దాన్ని భర్తీ చేసేందుకు బీజేపీ హైకమాండ్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. పవన్ కల్యాణ్ కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటే, దక్షిణాదికి సరైన స్టార్ క్యాంపెయినర్ లభించినట్లు అవుతుందన్నది కమలనాథుల ఆలోచనగా చెబుతున్నారు. దీనికితోడు జమిలి ఎన్నికలు 2028లో జరగడం ఖాయమనే ప్రచారం లేకపోలేదు.ఇక ఏపీ విషయానికొద్దాం.. రీసెంట్‌గా నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటన చేయడంతో తెలుగు తమ్ముళ్లు కాసింత అసహనం వ్యక్తం చేశారట. తక్కువ సీట్లు గెలిచిన వారికి ఒకే కుటుంబంలో రెండు మంత్రి పదవులు ఎలా ఇస్తారంటూ నేతల మాటల చర్చ సీఎం చంద్రబాబు చెవిలో పడింది.రీసెంట్‌గా సీఎం చంద్రబాబు-డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. ఈ క్రమంలో నాగబాబుకు మంత్రి పదవి ఇస్తే.. సీనియర్ల నుంచి ఏమైనా ఒత్తిడి రావచ్చనే చర్చ జరిగిందట. ఈ క్రమంలో నాగబాబు కేబినెట్‌లో చోటు కల్పించి, మోదీ కేబినెట్‌లోకి పవన్ వెళ్తే ఎలా వుంటుందనే చర్చ జరిగిందట.ఈ నేపథ్యంలో ఏపీ నుంచి ఓ వర్తమానం ఢిల్లీకి వెళ్లడం, అక్కడి బీజేపీ పెద్దలు అందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగిపోయిందని పొలిటికల్ సమాచారం. మంత్రిగా ఉంటూనే నాగబాబు రాష్ట్ర వ్యవహారాలను చక్కబెట్టడానికి వీలవుతుందని అంటున్నారు.పవన్ కేంద్రమంత్రిగా ఉంటూ బీజేపీ పెద్దలతో నిత్యం టచ్‌లో ఉండటానికి ఇదొక మార్గంగా బాబు-పవన్ ద్వయం ఆలోచన. ప్రస్తుతం ఏపీ నుంచి ఇద్దరు కేంద్రమంత్రులున్నారు. అందులో ఒకరు రామ్మోహన్‌నాయడు కాగా, మరొకరు పెమ్మసాని ఉన్నారు. దీనికి పవన్ కూడా తోడైతే రాష్ట్రానికి కావల్సిన నిధులు, ప్రాజెక్టులు తీసుకొచ్చే అవకాశముందని అంటున్నారు.

## చెత్తలోకి చేరుతున్న

# మిర్చి, టమాటా



**కర్నూలు :** నిన్న మొన్నటి వరకు చుక్కల్ని తాకిన టమాటా, మిర్చి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని ధరలు అమాంతం పెరిగితే ఇప్పుడు కొనేవాళ్లు లేక పారబోయాల్సి వస్తోంది. నిన్న మొన్నటి వరకు రూ.60-70 ఓ దశలో రూ.100 రుపాయలకు చేరువైన కిలో టమాటాను ఇప్పుడు వ్యవసాయ మార్కెట్లలో కనీసం రుపాయి ధరకి కూడా కొనడం లేదు. ఏపీతో పాటు తెలుగు రాష్ట్రాల మార్కెట్లకు కర్నూలు, మదనపల్లి మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున టమాటా విక్రయాలు జరుగుతుంటాయి. మూడు నెలల క్రితం అకాల వర్షాలతో పంటలు నష్టపోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. కొత్త పంట చేతికి వచ్చే సరికి ధరలు పడిపోయాయి. దీంతో కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్లో గురువారం టమాటా రైతులు ఆందోళనకు దిగారు. పత్తికొండ- గుత్తి రహదారిలో రైతుల ఆందోళనకు దిగారు.వ్యవసాయ మార్కెట్లలో టమాటా, మిర్చి ధరలు గురువారం ఒక్కసారిగా పడిపో యాయి. కిలో టమాటా రూపాయి కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు హతాశులై మార్కెట్లలో పారబోశారు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది.దళారుల దోపిడీని నిరసిస్తూ పత్తికొండ- గుత్తి ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. నాణ్యత ఉన్న పంటకు గిట్టుబాటు ధర కూడా ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహంతో రగిలిపోయారు. మార్కెట్లలో వ్యాపారులు కుమ్మక్కై తక్కువకు ధరలకు వేలం పాడుతుండటంపై రైతులు రగిలిపోయారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో టమాటా పంట ఒక్కసారిగా రావడంతో ధరలు ఒక్కసారి పడిపోయినట్టు మార్కెట్ యార్డు కార్యదర్శి చెబుతున్నారు. వారం రోజు లుగా టమాటా ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నా పూర్తిగా పడి పోలేదని నాణ్యతలేని పంటకు మాత్రమే వ్యాపారులు తక్కువ ధరకు అడిగారని తోటల్లో సాగు చేసిన టమాటా క్వింటాలు ధర రూ.1,800 వరకు పలికిందని మెట్ట భూముల్లో సాగు చేసిన పంట నాణ్యత దెబ్బతినడంతో తక్కువ ధర పలుకుతోందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో రైతు బజార్లలో కిలో టమాటా ధర 25 గా ఉంది. కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్లో మాత్రం గురువారం కిలో ధర రుపాయి నుంచి 8 రూపాయల వరకు పలికింది. పత్తి కొండ వ్యవసాయ మార్కెట్‌లో నిత్యం 200 టన్నుల కొనుగోళ్లు జరుగుతాయి. పత్తికొండలో కొనుగోలు చేసిన వ్యాపారులు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు.ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో కూడా పంటలు అందుబాటులోకి రావడంతో పత్తికొండ నుంచి ఎగుమతి అయ్యే టమాటాకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు ధర తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. గురువారం మార్కెట్లో కనీస ధరలు కూడా లేకుండా కొనడంపై రైతులు ఆగ్రహంతో టమాటాలను మార్కెట్లోనే పారబోసి వెళ్లిపోయారు. కొందరు పత్తికొండ రహదారిపై ఆందోళనకు దిగారు.బాపట్ల జిల్లా సంతమాగులూరులో మిర్చి ధరను తగ్గించడంతో రైతులు రోడ్డుపై పారబోశారు. బహిరంగ మార్కెట్లో క్వింటాలు ధర రూ.3వేలు ఉంటే వ్యవసాయ మార్కెట్లో రూ.1200మాత్రమే చెల్లిస్తుండటంతో రైతులు పంటను చెత్తలో పారబోశారు. సంతమాగలూరు మండలం కొమ్మాలపాడులో చేలలో కోసిన పంటను చెత్త కుప్పలో పారబోశారు.

## జగన్ బెయిల్

# రద్దవుతుందా

**కడప :** వైసీపీ అధినేత జగన్ కొత్త సమస్య ఏర్పడిందా? ఆయన బెయిల్ రద్దు పిటిషన్‌పై జనవరి 10న తేల్చనుంది సుప్రీంకోర్టు. దీంతో ఆయన బెయిల్‌పై కంటిన్యూ అవుతారా? ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయా? సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్లడం మాటేంటి? ఇవే ప్రశ్నలు వైసీపీ నేతలను వెంటాడుతున్నాయి.జగన్ బెయిల్ రద్దు పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఓకా ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను జనవరి 10కి వాయిదా వేసింది.జగన్ అక్రమాస్తుల కేసు ట్రయిల్ సరిగా జరగలేదని, ఆలస్యమవుతోందని గతంలో రఘురామకృష్ణంరాజు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని అందులో పేర్కొన్నారు. గడిచిన 12 ఏళ్లుగా జగన్ బెయిల్ ఉన్నారని, రద్దు చేయకుంటే విచారణ తీవ్ర జాప్యం జరిగే అవకాశముందని మరో పిటిషన్ దాఖలు చేశారు.రఘురామరాజు వేసిన రెండు పిటిషన్లపై విచారణ చేపట్టింది న్యాయస్థానం. సీబీఐ, ఈడీ ఇచ్చిన నివేదికలు పరిశీలించాక తీర్పు వెల్లడిస్తామని స్పష్టం చేసింది ధర్మాసనం. తదుపరి విచారణను జనవరి 10కి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం న్యాయస్థానానికి అందజేసినట్టు సీబీఐ లాయర్ వెల్లడించారు.సీబీఐ దాఖలు చేసిన స్టేటస్ కో రిపోర్టును తాము పరిశీలించాల్సి వుందని జగన్ తరపు న్యాయవాదులు ప్రస్తావించారు. జనవరి 10న న్యాయస్థానం తీర్పు ఏ విధంగా ఉంటుందోనన్న ఆసక్తి ఆ పార్టీ నేతల్లో మొదలైంది. ఎందుకంటే సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ సిద్ధమవుతున్నారు. కోర్టు తీర్పు అనుకూలంగా వస్తే ఓకే, ఒకవేళ రాకుంటే పరిస్థితి ఏంటన్న చర్చ అప్పుడే మొదలైంది.

# ఖైదీ నెంబర్ 7697

## - జైలులో బన్నీ ఏం చేశాడంటే..?



సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. శుక్రవారం అరెస్ట్ అవ్వడంతో చంచల్‌గుడా జైలుకు తరలించగా.. హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. అయితే విడుదలకు సంబంధించి ఫార్మాలిటీస్ పూర్తికాకపోవడంతో నైట్ అంతా జైలులోనే గడిపాడు అల్లు అర్జున్. అయితే జైలులో ఉన్న అల్లు అర్జున్‌కి అధికారులు ఎలాంటి వసతి కల్పించారు. బన్నీ ఎలా ఉన్నాడు అనే దానిపై ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. అల్లు అర్జున్‌ని చంచల్‌గుడాలోని వీఐపీ బ్లాక్ ఉంచినట్లు తెలుస్తుంది. ఇక జైలులో ఉన్న అల్లు అర్జున్‌కు అండర్ ట్రయల్ ఖైదీగా యూటీ 7697 నంబర్‌ను అధికారులు కేటాయించారు. రాత్రంతా మంజీరా బ్యారక్‌లోని బ్లాక్ -1లో అల్లు అర్జున్‌ని ఉంచగా.. తెల్లవారేవరకు అల్లు అర్జున్ నిద్రపోకుండానే గడిపినట్లు తెలుస్తుంది. అల్లు అర్జున్ పడుకునే ముందు జైలు సిబ్బంది రగ్గు దుప్పటి ఇచ్చినట్లు సమాచారం. అయితే వీటిని తిరస్కరించి అల్లు అర్జున్ నేలపైనే పడుకున్నట్లు.. ఇక జైలులో ఉన్నంత సేపు అధికారులతో తప్ప ఎవరితో బన్నీ మాట్లాడలేదని తెలుస్తుంది. రాత్రి జైలులో అధికారులు భోజనం అందించగా.. కొంచెం తిని పక్కన పెట్టినట్లు తెలుస్తుంది. ఉదయం 5.45 గంటలకు బన్నీని జైలు నుంచి బయటకు తీసుకువచ్చి.. విడుదలకు సంబంధించి ఫార్మాలిటీస్ పూర్తిచేసినట్లు.. ఉదయం 6.39 గంటలకు విడుదల చేసినట్లు సమచారం.

# నువ్వు నాలో స్ఫూర్తిని నింపావు

## - రానాకు సమంత బర్త్‌డే విషెస్



రానా దగ్గుబాటి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదే సమయంలో సినీ సెలబ్రిటీలు సైతం రానాకు విషెస్ తెలుపుతున్నారు. ఈ క్రమంలో స్టార్ నటి సమంత సైతం రానాకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. 'హ్యాపీ బర్త్ డే రానా. నువ్వు చేసే ప్రతి పనిలోనూ వంద శాతం ఫోకస్ పెడుతుంటావు. ఈ విషయంలో నీ నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. నేను ఎప్పటికీ నీ అభిమానినే. దేవుడు ఆశీర్వాదులు నీకు ఎప్పుడూ ఉండాలి' అంటూ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, రానా ప్రస్తుతం సరికొత్త టాక్ షోతో ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'నం1 యారి' అంటూ ఓటీటీలో సందడి చేసిన రానా.. ఇప్పుడు 'ది రానా దగ్గుబాటి షో' అనే పేరుతో అభిమానులను అలరిస్తున్నాడు. ఈ షో ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో నవంబర్ 23 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.



# మీ ఘటనలో మీడియా తప్పు లేదు

## - మంచు మనోజ్



మంచు ఫ్యామిలీలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్ట్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో జర్నలిస్ట్‌కు తీవ్రగాయాలు కాగా.. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలి అంటూ జర్నలిస్ట్ సంఘాలు అన్నీ ధర్నా చేయడం మొదలు పెట్టాయి. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి మోహన్ బాబు క్షమాపణలు తెలుపగా.. తాజాగా ఈ విషయంపై నటుడు మంచు మనోజ్ స్పందించాడు. ఈ ఘటనలో మీడియా తప్పు లేదు. నిస్సహాయ స్థితిలో నేను మీడియాను లోపలికి తీసుకువెళ్లాను. మా ఇంట్లోకి నన్ను అనుమతించకపోవడంతోనే మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని తీసుకువెళ్లా. లోపలికి వెళ్లిన అనంతరం తనపై దాడి జరిగింది. ఈ ఘటనలో అసలు మీడియా తప్పు లేదు అంటూ మనోజ్ చెప్పుకొచ్చాడు.

# ఇది ముమ్మాటికీ రాజకీయమే : పూనమ్ కపూర్



చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం.. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడం.. హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయడం.. రాత్రంతా బన్నీ జైల్లోనే ఉండటం అందరికీ తెలిసిందే. శనివారం ఉదయమే బన్నీని జైలు నుంచి విడుదల చేశారు. ఇక సెలబ్రిటీలు అయితే బన్నీకి అండగా నిలిచారు. టాలీవుడ్ మొత్తం కదిలివచ్చింది. అల్లు అర్జున్ కోసం బాలీవుడ్ స్టార్లు కూడా మాట్లాడి మద్దతు తెలిపారు. ఇక సోషల్ మీడియాలో బన్నీ అరెస్ట్ మీద భిన్న వాదనలు అయితే వినిపించాయి. స్టార్ అయితే ఏంటి? నేషనల్ అవార్డు విన్నర్ అయితే ఏంటి? చట్టం ముందు అందరూ సమానులే.. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది అని కొందరు అన్నారు. ఇక రేవంత్ రెడ్డి కక్ష్య సాధింపు చర్యలు అంటూ ప్రతి పక్షాలు మండిపడ్డాయి. ఈ హడావిడిలో పూనమ్ కౌర్ కూడా కొన్ని సెటైర్లు వేసింది. అల్లు అర్జున్ ఫోటోలను షేర్ చేస్తూ.. నా ఫేవరేట్ హీరో అని చెప్పింది. ఇక తాజాగా మరో ట్వీట్ వేసింది. ఇందులో అధికారాన్ని దుర్వినియోగం చేయడమే రాజకీయం.. ఆ అధికారాన్ని ప్రజల అభివృద్ధికి వాడటమే నాయకత్వం అంటూ కౌంటర్ వేసింది. అంటే రేవంత్ రెడ్డి తన పవర్‌ను మిస్ యూజ్ చేస్తున్నాడని, రాజకీయాలు చేస్తున్నాడని పూనమ్ కౌర్ చెప్పకనే చెబుతూ కౌంటర్లు వేసింది. అల్లు అర్జున్ మాత్రం బయటకు వచ్చి మీడియాతో మాట్లాడుతూ.. చట్టపరిధిలో ఈ కేసు ఉందని, భారత న్యాయ వ్యవస్థ మీద తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ కేసు గురించి తాను బయట మాట్లాడను అని చెప్పేసి వెళ్లిపోయాడు. మరి నెక్స్ట్ బన్నీ ఎలాంటి స్టెప్ తీసుకుంటాడో చూడాలి. నాలుగు వారాల అనంతరం ఈ కేసులో ఏ ట్విస్టులు చోటు చేసుకుంటాయో చూడాలి.



# సూర్యతో జోడీగా..

దక్షిణాది చిత్రసీమలో త్రిష హవా నడుస్తోంది. ప్రస్తుతం ఈ భామ ఏడు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. 'పొన్నియన్ సెల్వన్' సిరీస్ చిత్రాల భారీ సక్సెస్‌తో త్రిష దశ మారిపోయింది. వరుసగా అగ్ర హీరోల చిత్రాలను అంగీకరిస్తూ బిజీబిజీగా మారింది. తాజాగా ఈ భామ అగ్ర హీరో సూర్య 45వ చిత్రంలో కథానాయికగా ఖరారైంది.

ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సూర్య నటిస్తున్న 45వ చిత్రం ఇటీవలే ప్రారంభమైంది.

ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సూర్య-త్రిష జోడీ విజయవంతమైన చిత్రాల్లో నటించారు. సుదీర్ఘ విరామం తర్వాత వీరు కలిసి నటిస్తుండటం విశేషం. త్రిష ప్రస్తుతం విశ్వంభర, థగ్‌లైఫ్, బ్యాడ్ అండ్ అగ్లీ వంటి భారీ చిత్రాల్లో నటిస్తున్నది.

# అల్లు అర్జున్‌తో పెట్టుకుంటే సర్వనాశనం అవుతారు

## - ప్రముఖ రచయిన చిన్నికృష్ణ సంచలన కామెంట్



సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో అరెస్టైన టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ చంచల్‌గూడ జైలు నుంచి శనివారం ఉదయం 6.40 గంటలకు విడుదలయిన విషయం తెలిసిందే. జైలు నుంచి ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బన్నిని పరామర్శించేందుకు సినీ సెలబ్రిటీలు అల్లు నివాసానికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్న టాలీవుడ్ రచయిత చిన్ని కృష్ణ బన్నీ అరెస్ట్‌పై సంచలన వ్యాఖ్యలు చేశాడు. అల్లు అర్జున్‌కు మరక అంటించాలని చుసిన ఏ నాయకుడు అయినా, ఏ ప్రభుత్వం అయినా సర్వనాశనం అయిపోతారని చిన్ని కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అల్లు అర్జున్ వెనకాల ఒక కుటుంబం ఉంది, అల్లు అర్జున్ వెనకాల చిరంజీవి అనే ఒక మహా శక్తి ఉంది అంటూ చిన్ని కృష్ణ తెలిపాడు.

# అల్లుఅర్జున్ అరెస్టుపై ప్రముఖ నటుల కామెంట్లు



సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే అత్యుత్సాహం సాధారణ పౌరుల రక్షణలో కూడా చూపించాలని కోరుకుంటున్నా. మనం మంచి సమాజంలో జీవించాలి. ఇదొక దురదృష్టకర ఘటన. దీని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఇకపై మరిన్ని జాగ్రత్తలు పాటించి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మనందరి తప్పు ఉంది. ఒక వ్యక్తిని నిందించడం కరెక్ట్ కాదు.

- నాని

నమ్మలేక పోతున్నా

ప్రస్తుతం జరుగుతున్నది నమ్మలేక పోతున్నా. జరిగిన సంఘటన దురదృష్టకరం, చాలా బాధాకరం. అయితే, తప్పంతా ఒక వ్యక్తిపైకి నెట్టడం సమంజసం కాదు.

- రష్మిక

బాధాకరం

సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఘటన బాధాకరం. మరిన్ని జాగ్రతలు తీసుకుని ఉండాల్సింది. ఈ ఘటనకు అల్లు అర్జున్‌ని బాధ్యుడిగా చేయడం దారుణం. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి.

- అనిల్ రావిపూడి

దురదృష్టకరం

థియేటర్ వద్ద ఘటన దురదృష్టకరం. ఒక తల్లి ఆ రోజు ప్రాణాలు కోల్పోయింది. కానీ ఈ రోజు అల్లు అర్జున్ పట్ల జరిగింది మాత్రం చాలా కఠినమైన చర్య.

- అడవి శేష్

అన్యాయం

ఈ ఘటన బాధాకరం. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరు. జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్లు చుట్టు పక్కల వారికి సూచిస్తుంటారు. ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయం.

- వరుణ్ ధావన్

జవాబు చెప్పాలి

అల్లు అర్జున్ ఏమైనా టెర్రరిస్టా? ఇంట్లోకి దూరి అరెస్ట్ చేయడం ఏమిటి? ఈ అరెస్టుపై రేవంత్ రెడ్డి అందరికీ జవాబు చెప్పాలి.

# పోలీస్ పాత్ర నాకు చాలా ప్రత్యేకం



రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో యష్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై రూపొందిన బ్లాక్‌బస్టర్ 'మర్దానీ'. పదేళ్ల క్రితం విడుదలైన ఈ సినిమాకు 2019లో సీక్వెల్‌గా 'మర్దానీ 2' విడుదలైంది. ఈ రెండూ బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాలను అందుకున్నాయి.

'మర్దానీ 2' విడుదలై శుక్రవారానికి అయిదేండ్లు పూర్తయిన సందర్భంగా 'మర్దానీ 3'కి సంబంధించిన మేకింగ్ వీడియోను యష్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేసింది. ఇందులో రాణి ముఖర్జీ పోలీస్ ఆఫీసర్ శివానీ శివాజీరాయ్ పాత్రలో కనిపించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ 'వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి 'మర్దానీ-3' షూటింగ్ మొదలుపెట్టబోతున్నాం. పోలీస్ డ్రెస్ వేసుకొని అద్భుతమైన పాత్ర చేయడం నాకెప్పుడూ ప్రత్యేకమే. ఆ పాత్ర ద్వారా మీనుంచి అమితమైన అభిమానాన్ని పొందాను. సమాజాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ, బాధ్యతానిర్వహణలో ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని పోలీసులకు ఈ సినిమా అంకితం. గత ఫ్రాంచైజీని మించేలా గూజ్‌బమ్స్ తెప్పించేలా అంచనాలకు మించి ఈ సినిమా ఉండబోతున్నది.' అని తెలిపారు. అభిరాజ్ మినవాలా దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి రచన: ఆయుష్ గుప్తా, నిర్మాత: ఆదిత్య చోప్రా.